
ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక



25 నయాపైసలు
26-6-57



ఒంటిపావురాయి

ఫొటో : వి. దుర్గాప్రసాద్—విజయవాడ.

ఒక భీమా ఏజెంటు డైరీనుండి

ఆమె తన నెక్లేసును తాకట్టు పెట్టింది

దేశాయిలు కష్టదశలో వున్నారు. అతి త్వరితంగా క్షీణించుతూవున్న మనోహర వ్యాపారం వారి దాచిపెట్టు తున్న డబ్బునుకూడా హరించివేసింది. వైద్య కళాశాలలో ఆయన కొడుకును చదివించడం అతి కష్టమయి పోయింది.

ఆయనకు యిప్పుడు మిగిలిన ఆధారమల్లా రూ. 10,000 లకు తాను తీసుకున్న జీవిత భీమా పోలసీ మాత్రమే. కాని తర్వాత ప్రీమియమ్ గడువు వచ్చేసరికి, తాను చెల్లించలేనని తెలుసుకున్నాడు.*

వారి స్నేహితునిగా, భీమా ఏజెంటుగా దేశాయిలతో యీ విషయాలు మాట్లాడ దల్చుకున్నాను. "మనోహర్ కొద్ది రోజుల్లో నీవు ప్రీమియమ్ చెల్లించని పక్షంలో నీ పోలసీకి విలువ లేదు. (లాప్స్ అవుతుంది.) అంటే దానర్థం మీకసలు భీమా రక్షణే లేదన్నమాట. అయితే, ప్రీమియమ్ చెల్లించడానికి వేరే మార్గాలేమీ లేవా?" దీనికి సమాధానంగా కొంతసేపు నిశ్శబ్ద వాతావరణం ఆవరించింది. అప్పుడు శ్రీమతి దేశాయి యీవిధంగా అన్నది. "నాకో బంగారపు నెక్లేస్ వున్నది...."



ఆ నెక్లేస్‌ను తాకట్టు పెట్టగా వచ్చిన డబ్బుతో ప్రీమియమ్ చెల్లించాం.

నిజం వూహాకల్పనలకంటే బలీయమైనది. ఎనిమిది నెలలతర్వాత మనోహర్‌ను దురదృష్ట వశాత్తు ఒక మోటార్ ట్రక్ ఢీకొన్నది. దానితో ఆయనకు మళ్లీ స్పృహ రాలేదు.

ఈనాడు యువకుడు అరుణ దేశాయి ఒక డాక్టరు. మనోహర్ భీమా పోలసీ డబ్బు సరియైన సమయంలో అందడంవలన, అరుణ్‌ని, అతని తల్లిని చాలాకాలంవరకు ఏమీ చింతలేకుండా కాపాడింది. ఇక నేను త్యాగశీలురాలైన ఒక మంచి స్త్రీ యొక్క స్నేహమును ఆదరాభిమానాలను జీవితాంతం వరకు ఉండేలా సంపాదించుకున్నాను.

* కొన్ని కారణాలవలన, ఆయన తన భీమా పోలసీపైన అప్పు తీసుకోడానికి వీల్లేకపోయింది.

★ ఇందులో పేర్కొనబడిన వ్యక్తుల ఆత్మగౌరవ సంరక్షణకై, యీ పేర్లు కల్పితమే. కాని యీ కథ మాత్రం నిజమైనది.

లైఫ్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ అఫ్ ఇండియా

ASP/LIC-15

సంవత్సర చందా రు. 13-0-0 విడిపత్రిక 25న.పై.	**ఆంధ్రపత్రిక** సచిత్ర వారపత్రిక **Founder : K. NAGESWARA RAO**	సంపుటము 51 సంచిక 43 **26-6-57**

హేవిళంబి జ్యేష్ఠ బహుళ త్రయోదశి బుధవారం

విషయానుక్రమణిక

ముఖచిత్రం : సాధనావారి "సంకల్పం"లో కుమారి.

❋ శీతజ్వరం ❋

నిరోధానికి కొన్ని సలహాలు

డాక్టర్ ఎమ్. ఎస్. చాధా
(ఢిల్లీ ఆరోగ్యశాఖ డైరెక్టరు)

ప్రస్తుతం దేశాన్నంతటినీ కలవరపరుస్తున్న పెద్ద సమస్య శీతజ్వరం. కొన్ని నెలల క్రితం జపాను దేశంలో తలఎత్తింది. ఈమధ్యే హాంగ్ కాంగ్, సింగపూరు, మనిల్లా, తాయ్ పే ఆగ్నేయాసియాలోని మరికొన్ని ప్రాంతాలలో వ్యాపించింది. అది అలా ప్రయాణం చేస్తూ మన దేశానికి వచ్చింది. రోజుల క్రిందట మద్రాసు, బొంబాయి, కలకత్తా, న్యూఢిల్లీలలో ఈ జాడ్యం పాకింది. దేశంలోని ఇతర ప్రాంతాల్లోనుంచి కూడా దీని వ్యాప్తిని గురించి వార్తలొస్తున్నాయి.

ఈ వ్యాధి రావటం ఇదే కొత్తకాదు. పోయిన శతాబ్దంలోనూ అంతకుముందు కాలంలో కూడా వివిధ దేశాల్లో ఈ వ్యాధి వ్యాపించి అనేకుల్ని పొట్టను బెట్టుకున్న సందర్భాలు గత చరిత్రలో అనేకం చూశాం. 1918–1920 మధ్యకాలంలో ప్రథమ ప్రపంచయుద్ధం ముగిసిన వెంటనే ఇంచుమించు అన్ని దేశాలూ ఈ మహమ్మారికి గురిఅయ్యాయి. దాదాపు కోటిమందిదాకా ఆహుతి అయ్యారు.

అదృష్టవశాత్తూ ప్రస్తుతం పరిస్థితి అంత తీవ్రంగా లేదు. వ్యాధి విస్తారంగా పాకిపోయినా, చాలా తక్కువమందిని బలి తీసుకుంది.

అంటువ్యాధి

శీతజ్వరం అంటువ్యాధి. దీని గుణాలు: అమాంతం జ్వరం ముంచుకు వచ్చేస్తుంది. కొన్ని సందర్భాలలో చలితోబాటువస్తుంది. తలనొప్పి, పడిశెం, గొంతునొప్పి ఉంటాయి. వ్యాధి సోకినవారికి ఒళ్ళంతా ముఖ్యంగా వీపు నొప్పులువచ్చి పడిపోతారు. ఊపిరి ఆడక పోడం సాధారణంగా జరగదు గానీ, గొంతుక ఎండిపోయినట్లుండి నొప్పిగా ఉంటుంది. వ్యాధి తీవ్రతను బట్టి, జ్వరం ఒక రోజునుంచి ఆరు రోజులదాకా ఉండచ్చు. తీవ్రంగా లేనిపక్షంలో రోగి మూడు, నాలుగు రోజుల్లో లేక ఐదు రోజుల్లో కోలుకోవచ్చు.

'వైరస్' అనే అతి సూక్ష్మ క్రిమి శీతజ్వరానికి కారణం. దీన్ని సాధారణ సూక్ష్మదర్శినిలోంచి చూస్తే కనబడదు. సూక్ష్మాతిసూక్ష్మమైనది ఈ వైరస్. శీత జ్వరానికి సంబంధించిన వైరస్ ఎ. బి. అనే రెండు రకాలు. ఈ మధ్య సి అనే మరొక రకాన్ని గుర్తించారు. ఈ మూడు రకాల్లోనూ అనేక తెగలున్నాయి. ఈ తెగలు శీతజ్వరాన్ని అనేక రకాలుగా వ్యాపింపజేస్తాయి. ప్రస్తుతం, శీతజ్వరం వ్యాప్తి విస్తారంగా ఉన్నా, తీవ్రత లేదు. ఈ రకం, 'ఎ' జాతిలోని ఒక కొత్త తెగ ప్రభావం.

తీవ్రంగా ఉన్నా లేకపోయినా ఈజ్వరం తగిలిన మనిషి, దీన్ని అంటువ్యాధిగా మార్చడానికి కారకుడవుతాడు. ఈ రోగియొక్క ఉమ్మిలోనూ, చీమిడిలోనూ వైరస్ ఉంటుంది. సాధారణంగా, రోగిదగ్గర మసిలే వాళ్లకు రోగి ఉమ్మటానికి, ముక్కు చీదుకోడానికి ఉపయోగించే గుడ్డలు ముట్టుకోవడంద్వారా ఈ జ్వరం అంటుకుంటుంది.

మశూచికం, పొంగు వ్యాధుల క్రిముల వలెనే, ఈ వైరస్ పరిసర ప్రాంతాల్లో కూడా జ్వరాన్ని వ్యాపింపచేస్తుంది. ఒక్కచోట తల ఎత్తిందంటే ఈ జ్వరం మహా వేగంతో వ్యాపించగలదు. కొద్దిరోజుల్లోనే విస్తారంగా, నిప్పు పాకినట్టు పాకిపోతుంది.

జ్వరసూచనలు కనబడే కాలం – దీన్ని "పొదిగే కాలం" అంటారు — 24 నుంచి 72 గంటలదాకా ఉంటుంది. ముఖ్యంగా జ్వరం తగిలిన కొత్తల్లో రోగులు ఉండే చోట్లల్లో తిరిగే వారికి ఈ జ్వరం అంటుకునే ప్రమాదం ఉంది.

అక్కడక్కడ శీతజ్వరం ఏదో ప్రాంతంలో వస్తూనే ఉంటుంది. కానీ ఇది వ్యాప్తిచెందే సూచనలు కనిపిస్తే మటుకు ప్రజారోగ్య దృష్ట్యా పెద్ద సమస్య అయి కూర్చుంటుంది.

నివారణ పద్ధతులు

ప్రస్తుతం బహుళంగా వ్యాప్తి చెందుతూన్న శీతజ్వరం చాలా క్లిష్టసమస్య. వ్యాధి నిరోధకశక్తి తక్కువగా ఉన్నవారు ఈ వ్యాధి ఉన్న ప్రాంతాల్లోకి వెడితే ఈ జ్వరం సులభంగా అంటుకునే ప్రమాదం ఉంది. అందువల్ల ఆయా ప్రాంతాల్లో అందరూ, వ్యక్తిగతంగాకూడా అది తమ బాధ్యతే అని భావిస్తూ సహకరిస్తే వ్యాధిని చాలా మటుకు అరికట్టగలం.

రోగుల్ని ప్రత్యేకస్థలాల్లో వేరే ఉంచడం అవసరం. జ్వరం తగిలిన వెంటనే ప్రజారోగ్యదృష్ట్యా కూడా చాలా శ్రేయస్కరం. రోగియొక్క ఉమ్మి, చీమిడి ఉన్న చోట్లు, డెట్టాల్, ఫినైల్ లాంటి క్రిమిహారణౌషధాలతో శుభ్రంగా కడిగెయ్యాలి. రోగి వాడుతూన్న చేతిరుమాళ్లు మొదలైనగుడ్డలు మసులుతూన్న వేడినీళ్ళలో నానేసి ఉతకాలి. రోగిఉన్న ప్రాంతాలకు, నర్సులు, తదితర పరిచర్యచేసేవారూతప్ప ఎవ్వరూ వెళ్లకూడదు. వారైనా అంటువ్యాధి సోకకుండా ముఖానికి ఏదైనా కప్పుకుని ఉండటం మంచిది.

జ్వర తీవ్రత లేకపోయినా, వైద్యులు పూర్తిగా కోలుకున్నాడని చెప్పేదాకా రోగిని పక్కమీదేఉంచాలి. దీనివల్ల వ్యాధి మరొకరికి అంటుకునే ప్రమాదం వుండదు. వైద్యులు అనుజ్ఞ ఇచ్చేదాకా రోగి పక్కమీదే ఉంటే, రోగి త్వరగా కోలుకోవచ్చు.

ఇతరులు దగ్గరగా వున్నప్పుడు, ఉమ్మడం గాని, ముక్కు చీదుకోడం, దగ్గడంగాని చెయ్యకూడదు. తువ్వాళ్లు, అద్దాలూ, భోజనార్థం ఉపయోగించబడే కంచాలూ, పళ్లాలూ, గ్లాసులూ, ఎవరికివారు ప్రత్యేకంగా వుంచుకొని వాడుకోడం మంచిది. క్రమపద్ధతిలో జీవించేవారూ, శుభ్రమైన అలవాట్లు గలవారూ, మంచి ఆహారం తినే

(55-వ పేజీ చూడండి)

సంసారం నిస్సారమన్నారు కొందరు విరక్తులు. సంసారం స్వర్గసీమలాంటిదన్నారు కొందరు రక్తులు.
ఎవరెలా అభిప్రాయపడినా, మానవుడు పుట్టింది మొదలు గిట్టేదాకా సంసారపు జంజాటనలో గుంజాటన పడాల్సినవాడే. వదుల్చుకుందామన్నా వదిలేదికాదు సంసారం. కనుక, సంసారంలో ఉంటూనే, దాన్ని సాధ్యమైనంత సుఖమయం చేసుకోడం సంసారుల విధి. ఇది భార్యాభర్తలిద్దరి సంస్కారంమీదా ఆధారపడి ఉంటుంది.

సంసారంలో సహజీవనం

పోస్ట్‌మన్ అందించిన కవరు చించి చూచుకున్నాను. నా బాల్యస్నేహితుడొకడు నేను పంపిన పెండ్లి అహ్వానానికి సమాధానంగా ఇలా వ్రాశాడు:

"మిత్రమా, నీవు ప్రేమతో పంపిన పెండ్లి పత్రిక అందింది. చాలా కృతజ్ఞతలు. పని ఒత్తిడి వల్ల వివాహానికి హాజరుకాలేక పోతున్నందుకు ఎంతో విచారిస్తున్నాను. నూతనంగా పెండ్లిచేసుకుంటున్న నీవు దాంపత్య జీవితంలో వుండే సాధకబాధకాలను తెలుసుకున్నావో లేదో! అయినా వాటిని లోకానుభవం వల్ల క్రమేణా తెలుసుకుంటావు. అయితే అనుభవం పొందడంలోనే పుణ్యకాలంకాస్తా దాటిపోతుందేమో అన్న శంకతో శ్రద్ధతో సేకరించిన పత్రిక కత్తిరింపును యీ లేఖతో జతపరుస్తున్నాను. దీన్ని నా పెండ్లికానుకగా స్వీకరించి తీరిక దొరికినప్పుడు శ్రద్ధతో చదువుతావని ఆశిస్తున్నాను...ఇట్లు...నీ శ్రేయోభిలాషి— విశ్వం!"

సుఖజీవనానికై భార్యాభర్తలు వైవాహిక జీవితంలో అనుసరింపదగిన మార్గాలను సూచనప్రాయంగానైనా తెలుపగలదన్న నమ్మకంతో మావాడు పంపిన పత్రిక కత్తిరింపులో ఇలా ఉంది: "మొన్నీమధ్య ఒక వింత జరిగింది. ఆలుమగలు నిశ్చింతగా చేస్తున్న సంసారంలో ఒడుదుడుకులు హఠాత్తుగా కలగడానికి సంబంధించినది యీ వింత. యౌవ్వనంలోవున్న ఒక యువతి తన భర్తనుంచి విడాకులు పొందదలచినట్లు కోర్టులో దావా వేసిందట. సదరు యువతి తిరస్కారానికి గురికావలసివచ్చిన అతగాడు రూపసి. ప్రయోజకుడు కూడానట. మీదుమిక్కిలి అతడిని ఆమె ఎందరో యువకుల్లోనుంచి కోరికోరి కట్టుకుందిట. అయితే నేమి పట్టుమని పదిరోజులు పాటైనా దాంపత్యం అనుభవించకుండానే విడాకులు ఇప్పించమని ఆమె కోర్టుకు వెళ్ళక తప్పలేదట. ఇంతకూ ఆమె విడాకులు పొందడానికి చూపిన కారణం వింటే మీరు ముక్కుమీద వేలేసుకుంటారు. ఆమె భర్త మేనువాల్చడమే తడవుగా ఒక్కపెట్టున డజను గండు పిల్లులు హోరాహోరీన పోట్లాడుతున్నట్లు గురక పెడతాడట. మిన్ను విరిగి మీదపడ్డా ఖాతరు చేయడు. ఆమెకేమో కాలిఅలికిడి వినిపిస్తేనే నిద్రాభంగం కలుగుతుందట. కనుకనే ప్రయోజకుడైన పురుషుడైనా అతన్ని వదులుకోక తప్పలేదట."

వధూవరులు మూడుముళ్లు పడిన ముహూర్తం మొదలు జీవితాంతందాకా చిలకాగోరింకల్లా కాలక్షేపం చేయవలసింది పోయి పసలేని కారణాలకులోబడి ఏవిధంగా ఒడుదుడుకులకు గురిఅవుతూ వుంటారో యీ కత్తిరింపు తెలుపుతున్నది.

అక్కిరాజు జనార్దనరావు

అయితే సంసారజీవితంలో తనకు నచ్చని ఏవిషయంమీదనో దంపతులు యీ రూపంలో విడిపోవడం కొంత నయమే నేమో అనిపిస్తున్నది. ఎందుకంటే ఇటువంటివాళ్లు విడిపోయినా, ఎవళ్ళదారిన వాళ్లు సుఖపడగలుగుతారు. వచ్చే చిక్కంతా ఎడ్డెమంటే తెడ్డెమంటూనే బుజం బుజం రాసుకొని తిరిగేవారితో వుంది.

చీటికీ మాటికీ చిరాకు

ఈ తరహా ఆలుమగలు అనునిత్యమూ నిద్రలేస్తూనే జుట్టూ జుట్టూ పట్టుకుంటూరు. తిట్లుపంచాంగం శ్రవణం చేస్తారు. ఇలాంటివారు మనకు సమాజంలో కొల్లలుగా కనిపిస్తారు. మా ప్రక్కవాటాలో ఒక జంట కాపురముంటున్నారు. వారిల్లు క్షణక్షణం కురుక్షేత్రంగా మారుతూ ఉంటుంది. వారి మధ్య పోట్లాటలకు ఏదో ప్రబలకారణం ఉండవచ్చని మీరు అనుకుంటున్నారు కాబోలు. అట్లాంటిదేమీ లేదు.

"టీలో చక్కెర జాస్తి పడింది" అని ఆయన ఇంటికప్పు బ్రద్దలయ్యేట్లు గర్జిస్తాడు. "ఏడ్చినట్టే వుంది. కటిక చేదుగా వుంది" అని ఆమె వెంకితనంగా సమాధానమిస్తుంది. అక్కసితో గొడవ బయలుదేరుతుంది. "ఈ బిందె ఇట్లా ఎందుకు సొట్టపోయింది" అని అతడు పనికట్టుకొని అడుగుతాడు. "అది అంతేలెండి" అని ఆవిడ తేల్చేస్తుంది. బిందె సొట్టపోవడంవల్ల వచ్చిన యీ రభస తలలు సొట్టపోయేవరకూ వెళ్తుంది. "ఈ గోడకు వున్న పటాన్ని అక్కడ మేకుకు ఎవరు తగిలించమన్నారు" అని కొంప మునిగిపోతున్నట్లు ఆమె నిలదీసి అడుగుతుంది. "ఏడిశావ్, అది అక్కడుంటేనే అందంగా వుంది" అని అతడు తోసిపుచ్చుతాడు. పంట్లాం, షర్టూ వేసుకొని చెప్పులు తొడుక్కోబోతున్న భర్తను "ఎక్కడికండీ బయలుదేరుతున్నారు?" అని ఆమె ప్రశ్నిస్తుంది. "ఏట్లోకి, వాగులోకి" అని ఆయన బదులు పలుకుతాడు. ఇట్లా చెప్పుకొని పోవాలంటే వారి కలహ కారణాలు సవాలక్ష ఉన్నాయి.

బండ్లదారిన నడిచే రెండెడ్లబండి మిట్టపల్లాలను దాటడం అనివార్యం. అది సహజం కూడానూ. అదేవిధంగా జీవితంలో ఒడుదుడుకులు కలగడం తప్పనిసరి అవుతుంది. ఏ విధమైన ఒడుదుడుకులు లేకుండా సాఫీగా సాగిపోయే జీవితాలు చాలా అరుదు. అసలు వుండవనే చెప్పవచ్చు. భార్యాభర్తల మధ్య సంసార జీవితంలో, ఆఫీసరు, గుమాస్తామధ్య ఉద్యోగ జీవితంలో, అప్పుఇచ్చిన వాడూ, పుచ్చుకున్నవాడి మధ్య సంఘ జీవితంలో ఇంకా ఇల్లాంటివే ఎన్నో రంగాలలో చాలా స్వల్ప కారణాలమీద మాట పట్టింపులు, మనస్పర్థలు ఏర్పడి అనుకోని విధంగా ఒడుదుడుకులు కలుగుతాయి. ఒడుదుడుకులకు లోనైనవారి పరిస్థితి దారంతెగిన గాలిపటంలా ఉంటుంది. దారం తెగిన గాలిపటం పోయిపోయి ఏ చెట్టు చిటారు కొమ్మల్లో చిక్కుకుంటుందో, ముళ్ళకంప

మీదనే పడుతుందో, మురికినీటి గుంటలోనే మునుగుతుందో లేక దానిపైనే చూపునిలిపి అదినడిపిన దారిన నడిచిన కుజ్జివాడి చేతుల్లోనే వాలుతుందో చెప్పడం కష్టం. అదే విధంగా ఒడుదుడుకులకు లోనైన మనిషి ఏయే పరిణామాలు పొందుతాడో ఊహించలేము.

తమ దర్జాకు, అంతస్తుకు తగిన గౌరవ మర్యాదలు జరుగలేదన్న నెపంతో పెత్తిగా క్రోధాలు పెంచుకొని ఒడుదుడుకులకు గురి అయ్యేవారు కొందరు. ఇట్లాంటి వారు ఎంతసేపటికీ తమ దర్జా, దర్పం సంగతే ఆలోచిస్తారు. అవి భంగపడకుండా వుండడమే వారికి కావలసింది. ఇతరులు ఎట్లాపోయినా వారు పట్టించుకోరు. ఇతరుల సాధక బాధకాలను అర్థం చేసుకోడానికి కూడా వారు ప్రయత్నించరు. తమ దర్జాకేమైనా లోటు జరిగినప్పుడు ఎంతటి అఘాయిత్యానికైనా సరే వారు వెనుదియరు.

వియ్యాలవారి కయ్యాలు

నేను ఎరుగున్న శ్రీమంతుడు ఒకాయన వున్నాడు. ఆయన ఒక్కగాని ఒక్క కొడుక్కి తనతో అన్ని విషయాలలోనూ సరితూగగల సంబంధంచూచి పెండ్లిచేశాడు. పెండ్లిజరిగి అయిదారు సంవత్సరాలైంది. ఇప్పటికీ యీ పేరిన కోడల్ని తల్లిగారింటనే వుండనిచ్చాడు. కొడుకును అక్కడికిపోవీల్లేదని నిషేధించాడు. ఎందరోఎన్నో విధాల నచ్చచెప్పినా ఆ మంకుఘటం ఒప్పుకోలేదు. ఇంతకూ జరిగిన వ్యవహారం చాలా స్వల్పమైనది. పెండ్లి అయిన సంవత్సరం వచ్చిన దీపావళిపండుగకు కొత్తలుడిని అత్తగారు తీసుకొనిపోయారట. తోడుగా ఆడబడుచు వెళ్లిందట. తిరిగి వెళ్ళేటప్పుడు అల్లుడికీ, ఆడబడుచుకీ అత్తవారు సకల లాంఛనాలతోనే వీడ్కోలు చెప్పారట. అయినప్పటికీ వియ్యంకుడికి కన్యాదాతమీద ఎక్కడలేని ఆగ్రహం వచ్చింది. అల్లుడికి పెట్టిన ధోవతులు మేలిరకం జరీఅంచువి కావనీ, ఆడబడుచుకు పెట్టిన చీర నా సిరకందనీ, ఇట్లాంటి పనులు తనంతటివాడితో వియ్యం అందుకున్నవారు చేయవలసినవి కావనీ ఆయన పెద్ద రభస చేశాడు. దానిమీద మాటా మాటా పెరిగి పరిస్థితి ఇంతవరకూ వచ్చింది.

డబ్బు ఇబ్బందులు

వివిధ కారణాలవల్ల వచ్చే ఒడుదుడుకుల సంగతి ఎట్లావున్నా, ఆర్థికమైన ఇబ్బందుల వల్ల వచ్చే ఒడుదుడుకులు చిత్ర విచిత్రాలుగా ఉంటుంటాయి. ఈ రోజుల్లో ఆర్థికమైన చిక్కులకు గురికాని సంసారం మనకు కనిపించదు. ముఖ్యంగా మధ్యతరగతి, క్రింద తరగతి సంసారాలలో డబ్బులేమివలన కలిగే ఒడుదుడుకులు ఇంతా అంతా కాదు. ఈ కాలంలో సాధారణవ్యక్తి ఎదుర్కోవలసి వస్తున్న ఒడుదుడుకులలో చాలావరకు ఆర్థికమైన ఇబ్బందులవల్లనే కలుగుతున్నాయనడం ఎవ్వరూ కాదనరు.


మా జానకిరామయ్య సంగతి చూడండి. సైకిలు కొనాలని ఉద్యోగంలో చేరినప్పటి నుంచి అనుకుంటున్నాడు. వాడు ఉద్యోగంలోచేరి ఏడెనిమిది సంవత్సరాలు అయింది. అయినా నాటికీ నేటికీ వాడి కోరిక తీరలేదు. సైకిలంటూ ఒక వాహనం లేనందున రోజూ వాడు పడాల్సివస్తున్న బాధ ఇంతా అంతా కాదు. లేస్తూలేవగానే పాల కోసరం కోసెడుదూరం పోవలసివస్తుంది. తరువాత కూరగాయలకనో, కట్టెపుల్లలకనో, చాకలీ ఇంటికనో మరో రెండు మూడు కోసులదూరం పోవలసివస్తుంది. ఇదంతా నడుస్తూ వెళ్లివచ్చేసరికి ఆఫీసుకు టయిమ్ అవుతుంది. ఆఫీసు మాత్రం దగ్గరలోవుందా, ఎటు లేదన్నా కోసెడు నడవాలి. లేటవుతుందేమో అన్న భయంతో ఇల్లాలును తొందర పెడ్తాడు. ఉడికీ ఉడకని పదార్థాలను తిని ఆదరాబాదరాగా బయలుదేరుతాడు. దారిలో చెప్పు ఉంగటం తెగడంవల్లనో, రాయితగిలి కాలికి దెబ్బతగలడంవల్లనో కలిగే బాధలు పడ్తూ ఆఫీసు చేరుకుంటాడు. ఖర్మం కాలి, ఎర్రగుర్తు పడనేపడుతుంది. "ఏమిటయ్యా, ఎప్పుడూ లేటుగా వస్తావు, ఆఫీసా మరేమన్నానా" అంటూ సూపరింటెండెంటు గద్దిస్తాడు. దానితో మనసు వికలమవుతుంది. మనసుపెట్టి పనిచేయలేకపోతాడు. "ఇవేం రాతలయ్యా, అన్నీ తుడుపులూ, కొట్టివేతలే" అంటూ చీదరించుకుంటాడు. ఆఫీసులో పేరుకొనిపోయిన కోపాన్ని జానకిరామయ్య ఇంట్లో ఇల్లాలుమీద, పిల్లలమీద వెళ్ళపోస్తాడు ఇట్లాంటి సందర్భాలు జానకిరామయ్యకు రోజూ వచ్చేవే. సకాలంలో పనులు చేసుకునిపోతే ఈ గొడవలేవీ వుండవనుకొని వాడు సైకిలు కొనడానికి నిశ్చయించుకున్నాడు. నెలకు కొంత చొప్పున మిగులుస్తూపోతే ఏడాదిలేక ఏణ్ణార్థంలో సైకిలు కొనడం తేలికైనపనే అనుకున్నాడు కూడా. కాని అంచనాలు తారుమారయ్యాయి.

మొదటినెలలో పెద్దమ్మాయి పుట్టినరోజు పండుగవస్తే, రెండోనెలలో పెద్దకొడుక్కి అక్షరాభ్యాసం జరిగింది. మూడవ నెలలో చిన్నబ్బాయికి పుట్టెంటికలు తీశారు. నాల్గవనెలలో చిన్నమ్మాయికి చెవులు కుట్టించారు. అయిదవ నెలలో పంచమ సంతానానికి నామకరణం చేశారు. ఈ విధంగా ఎప్పటికప్పుడు ఏవో అవసరాలు వచ్చిపడుతూనే ఉన్నాయి. ఇవిగాక వచ్చిపోయే చుట్టాలు, "మాబాకీ యీ నెలలోనే చెల్లించాలి" అని పట్టుబట్టే ఋణదాతలు ఉండనే ఉన్నారు. వీటిలో ఏఖర్చును వాడు కాదనగలడు. కనుకనే ఎన్ని ఒడుదుడుకులనైనా సరే అతడు తట్టుకోక తప్పడంలేదు. సైకిలు ఎక్కటం మాత్రం ఊహాలోనే ఉండిపోయింది.

అయితే జీవిత వివిధ రంగాలలో కలిగే ఒడుదుడుకులన్నీ ఒక ఎత్తయితే సంసార జీవితంలో కలిగే ఒడుదుడుకులన్నీ ఒక ఎత్తని నా అభిప్రాయం. మనిషిని అన్ని బాధలకంటే ఆకలిబాధ ఎక్కువ కుష్కింపజేస్తుంది. అదే విధంగా మనిషి అన్ని సందర్భాలలో వచ్చే ఒడుదుడుకులకంటే దాంపత్య జీవితంలోవచ్చే ఒడుదుడుకులవల్ల ఎక్కువ నీరసించిపోతాడు.

సహృదయురాలు, సౌశీల్యవతి అయిన ఉత్తమ ఇల్లాలు సమక్షంలో ఉన్నప్పుడు పురుషుడు ఇతరత్రా కలిగే ఎన్ని ఒడుదుడుకులనైనా సరే మరిచి సుఖించగలడు. కనుక ఆలుమగలు పొరపులుమరిచి మనసులు కలిసి సహజీవనం నెరపడం చాలా అవసరం. అట్లా జీవించగలిగినప్పుడు ఏరకమైన ఒడుదుడుకులనైనా సరే అధిగమించగలుగుతారు.

(హైదరాబాదు రేడియో కేంద్రం సౌజన్యంతో) ★



కృష్ణానది వంతెన దృశ్యం

కృష్ణవేణి పుష్కరం

కృష్ణా పుష్కరాలు ఆంధ్ర దేశానికే గాక, భారతదేశాని కంతటికీ ప్రధాన మయిన పర్వ దివసాలు. ఈ ఉత్సవ సమయంలో ఆంధ్రులేకాక భారతీయులంతా కృష్ణానదిలో స్నాన సంధ్యాదులు నిర్వర్తించుకొని పితృ దేవతలకు తర్పణాలు, దాన ధర్మాలు మొదలైన పుణ్యకర్మ లాచరిసారు. పుష్కరోత్సవాలు జూన్ 19 వ తేదీ మొదలుకొని 30 వ తేదీవరకు జరుగుతాయి. ఈ సమయంలో కృష్ణానదీ తీరంలో ఉన్న పుణ్యక్షేత్రాలన్నీ ప్రధాన మయినవే! ఈ తీర్థాలన్నిటిలోను విజయవాడ అత్యంత ముఖ్యమయిన పుణ్యక్షేత్రం. అందుచేతనే కృష్ణాపుష్కరాలలో యాత్రికు లెక్కువగా విజవాడకే వసారు.

విజయవాటిక ప్రాముఖ్యం

ఈ ఉత్సవాలలో విజయవాడ కంతటి ప్రాముఖ్యం ఏర్పడడాని కనేక కారణా లున్నాయి.

ఇక్కడ ఇంద్రకీలాద్రి, కనక దుర్గాలయము చాలా ప్రాచీన కాలంనించి ప్రసిద్ధి పొందాయి. ఈ పర్వతానికి అయిదు క్రోసుల దూరంవరకు దుర్గా పుణ్యక్షేత్రమని స్కాందపురాణం పేర్కొంటున్నది. ఈ క్షేత్రానికి దక్షిణపు సరిహద్దు మంగళగిరి. పడమటి సరిహద్దు అనంతతీర్థము. ఈ అనంతతీర్థానికే ఈ కాలంలో 'ఉండవల్లి గుహ'లని పేరు వచ్చింది. ఉత్తరపు సరిహద్దు పృథ్వీనది. ఈ నదికే నేటి కాలంలో బుడమేరని పేరేర్పడంది. పృథ్వీనది క్రమక్రమంగా పుడమి ఏరుగా మారి అదే 'బుడమేరు'గా మారి ఉండవచ్చును.

విజయవాడకీ పేరేర్పడడానికి కొన్ని పౌరాణిక గాథలే కారణమని స్కాందపురాణం పేర్కొంటున్నది. బ్రహ్మదేవుడు పూర్వం పరమేశ్వరుణ్ణి గురించి తపస్సు చేశాడట. ఆ సమయంలో ప్రత్యక్ష మయిన పరమేశ్వరుణ్ణి బ్రహ్మదేవుడు మల్లెపూలతో పూజచేశాడట! అందుచేత ఇంద్రకీలాద్రిపై వెలిసిన పరమేశ్వరునికి మల్లికార్జునుడని పేరేర్పడింది. కనకదుర్గాదేవి ఇంద్రకీలాద్రి శిఖరంపై శుంభనిశుంభ రాక్షసుల నిద్దరిని సంహరించింది. అప్పటినించీ ఆ పర్వతం ఆదేవికి నివాసస్థాన మయింది.

పూర్వం అర్జునుడు ఇంద్రకీలాద్రిపై పరమేశ్వరుణ్ణిగూర్చి తపస్సుచేసి పాశుపతాస్త్రం సంపాదించాడు. అప్పటినించీ ఈ పట్టణానికి 'విజయవాటిక' అనే పేరు వచ్చిందని ఇంకొక పురాణగాథవల్ల తెలుస్తూంది. గుణగవిజయాదిత్యునివల్ల విజయవాడ కీపేరు వచ్చిందని చరిత్రకారులూహిస్తున్నారు. ఏది ఏమైనా ఇక్కడ ఇంద్రకీలాద్రి ఒరసుకొని సాగరాభిముఖంగా ప్రవహించే కృష్ణవేణి

మహాపవిత్రమయినదని మన ప్రాచీనగ్రంథాలుద్ఘోషిస్తున్నాయి.

పుష్కరప్రవేశం

కృష్ణా గోదావరీ పుష్కరాలు పన్నెండేళ్ళ కొక్కొక్కమాటు వస్తూంటాయి. గురుడు మేషాది ద్వాదశరాసుల్లోను, ఒక్కొక్క రాసిలో ఒక్కొక్క సంవత్సరం పాటు నిలకడగా ఉంటాడు. అందుచేత గురుచారాన్ని బట్టి పన్నెండేళ్ళ కొక్కొకసారి ఆయానదుల కాయాపుష్కరాలేర్పడుతూంటాయి. గురుడు మేషరాశిలో ప్రవేశించినప్పుడు గంగాపుష్కరం. ఇలాగ పుష్కరంవచ్చేవి భారతదేశంలో పన్నెండు నదు లున్నాయి. ఈపన్నెండు నదులలోను మూడునదు లాంధ్రదేశంలోనే ఉన్నాయి.

గురుడు సింహరాశిలో ప్రవేశించినప్పుడు గోదావరీపుష్కరం వస్తుంది. కన్యారాశిలో ప్రవేశించినప్పుడు కృష్ణాపుష్కరం వస్తుంది. మకరరాశిలో ప్రవేశించినప్పుడు తుంగభద్రాపుష్కరంవస్తుంది. జూన్ 19 వ తేదిని గురుడు కన్యారాశిలో ప్రవేశిస్తున్నాడు. కనక అప్పటినుంచీ అది కృష్ణా పుష్కర పుణ్యకాలం మయింది.

పుష్కరగాథ

ఈ పుష్కరాన్ని గురించీ, పుష్కర ప్రవేశాన్ని గురించీ స్కాందపురాణంలో ఒక ప్రాచీన గాథ కనిపిస్తుంది.

పూర్వం మహాతపశ్శాలి అయిన ఒక బ్రాహ్మ డుండేవాడట. అతని పేరు తుందిలుడు.

ఆ బ్రాహ్మణుడు చాలాకాలం పరమేశ్వరుణ్ణి గురించి ఘోరతపస్సు చేశాడు. చివరికి పరమేశ్వరు డతని ఎదట ప్రత్యక్షమయ్యాడు. ఏమికావాలో కోరుకోవంసిందని అడిగాడు. తుందిలుడతనికీ విధంగా విన్నవించుకొన్నాడు:

"పరమేశ్వరా! పుష్కర తీర్థంలో సమస్త పుణ్యక్షేత్రాలు నివసిస్తాయని పురాణ వేత్త లుద్ఘోషిస్తున్నారు. నాలో ఆ పుష్కరతీర్థం

పుణ్య పుష్కరం

మధురాంతకం రాజారాం


విన్నావటే అక్క! వినవమ్మ చెల్లి!
ఎన్నటికోగాని యిదిరాదు మళ్ళీ!
పొంగిపోతుందట కృష్ణవేణమ్మ!
పోయిచూతముగాని వేగ రారమ్మ!

ఎవ్వరనుకొంటిరో ఈ కృష్ణవేణి
ఈమె నదులకు రాణి! నిత్యకల్యాణి!
అలయక సొలయక అసురుసురనక
గలగలా పరువెత్తు పంచకల్యాణి!


ఎందాక ప్రవహించునంతటివరకు
ఈతల్లి తన వేయిచేతులు సాచి
పైరుపచ్చల పట్టుశాలువాపరుచు
పరిమళమ్ముల పూలతోటలనునిలుపు!

పాపమ్ములన్నియును పరువెత్తుననుచు
పావని కృష్ణలో తానమాడుటకు
నేల నాలుగుచెరగులందుండి నేడు
నేలయీనినయట్లు తరలివచ్చెదరు!

సాగరేంద్రుని భార్యలందరిలోన
సొగసుంప్రోవైన చిన్నారి చాన!
నదిగాదు మనకీమె పెన్నిధియె గాన!
కురిపింపుడీమెపై పూల జడివాన!



బెజవాడ కనకదుర్గ.



శ్రీ మల్లికార్జున స్వామి

కృష్ణవేణీ పుష్కరం

లీనమైపోవాలని కోరుకుంటున్నాను. ఇదే నా కోరిక!"

పరమేశ్వరుడతని కావరం ప్రసాదించాడు. అతనికే పుష్కరుడనే పేరనుగ్రహించాడు. పృథ్విలోఉండే పుణ్య తీర్థాలన్నీ అప్పటినుంచీ అతనియందే ఉండగలవని వరంఇచ్చాడు. అంతేకాక పుష్కరునితో కలిసిన గంగాది పుణ్యానదు లత్యంత పవిత్ర భావం పొందగలవనికూడా అనుగ్రహించాడు.

మరికొంతకాలానికి బ్రహ్మదేవుడు పరమేశ్వరుణ్ణి గురించి తపస్సుచేశాడు. పుష్కరుడెప్పుడు తన కమండంలోనే ఉండేటటు వరమీయవలిసిందని ప్రార్థించాడు.

పిమ్మట మరికొంతకాలానికి దేవగురువు బృహస్పతి బ్రహ్మగేవుణ్ణిగురించి గొప్ప తపస్సుచేశాడు. ఆ తపస్సుకు మెచ్చి బ్రహ్మదేవు డతనికి ప్రత్యక్షమయ్యాడు. వరం కోరుకోమని అనుగ్రహించాడు.

దాని కెంతో సంతోషించి బృహస్పతి బ్రహ్మ నీవిధంగా ప్రార్థించాడు:

"పరమేష్ఠీ! నీకమండలంలో ఉన్న పుష్కరుణ్ణి నా స్వాధీనం చెయ్యాలి. నేను ప్రతి సంవత్సరము ఒకొక్క రాశిలో సంచారం చేస్తూంటాను. అప్పుడే పుష్కరుడా రాశి కధిదైవతమయిన ఒకొక్క మహానదిలో ప్రవేశించాలి. పుష్కరునితోబాటు నీవు కూడా ఆయా నదులలో నివసించాలి! ఇదే నా కోరిక!"

బ్రహ్మదేవు డతనికా వరం అనుగ్రహించాడు. అప్పటినించీ బృహస్పతి ఒకొక్క నూతన రాశిలో ప్రవేశించగానే పుష్కరు డొక్కొక్క నదిలో ప్రవేశిస్తున్నాడు. ఈ ప్రవేశకాలానికే మనవారు పుష్కరపుణ్యకాలమని పేరుపెట్టారు. ఈ కాలంలో సమస్త దేవతలు సమస్త పుణ్యతీర్థాలతోను కలిసి ఆయా నదులలో ప్రవేశిస్తూంటారు. వారి సాహచర్యం వల్ల ఆయా నదులకు మరింత మహత్త్వం వస్తుంది. కనకనే మన సంప్రదాయంలో పుష్కరాల కింతటి ప్రాముఖ్యం వచ్చింది.

కృష్ణా ప్రశస్తి

పూర్వం ఒకప్పుడు బ్రహ్మదేవు డొక యజ్ఞం ప్రారంభించాడు. బ్రహ్మదేవునికి సరస్వతీ గాయత్రీ దేవత లిద్దరు భార్యలు. ఆ యజ్ఞం ప్రారంభించే సమయానికి సరస్వతీదేవి అక్కడికి రావడం కొంచెం ఆలస్యమయింది. బ్రహ్మదేవుడామె కోసం వేచి ఉండలేక గాయత్రీ దేవితోనే యజ్ఞం ప్రారంభించాడు. ఇంద్రాదిదేవతలు కూడా ఆయనమాట కెదురాడలేక పోయారు. కొంతసేపటికి సరస్వతీదేవి అక్కడికి వచ్చింది.

తాను రాకుండానే యజ్ఞం ప్రారంభించడం తనకొక గొప్ప తలవంపని ఆమె అక్కడ ఉన్నవారినందరిమీద మండిపడింది. అక్కడ కూర్చున్న దేవతలందరు జల (ద) స్వరూపులై పోవాలని శపించింది. ఆ శాపం వల్లనే శ్రీకృష్ణుడు (శ్రీ విష్ణువు) కృష్ణానదిగా మారిపోయాడు.

సంగ్రహంగా కృష్ణానది పుట్టుకను గురించిన పురాణగాథ ఇది. పడమటి కొండలలో మహాబలేశ్వరంలో అవతరించిన కృష్ణానదిలో తుంగభద్ర, వేణి, భీమ, మలాపహారిణి మొదలైన జీవనదులెన్నో కలిశాయి. ఈ నదితీరంలో శ్రీకాకుళము, అమరావతి, ముక్త్యేశ్వరము, వేదాద్రి మొదలైన పుణ్యక్షేత్రాలెన్నో వెలిశాయి. ఈనాడు కృష్ణవేణి ప్రవహించిన భూభాగం అంతా బంగారు మాగాణిగా ప్రసిద్ధి కెక్కింది.

కృష్ణాపుష్కరం యాత్రకోసం ఆంధ్రదేశ యాత్రికులు చాలా కాలంనించీ ఉవ్విళ్ళూరుతున్నారు.

ఇటీవల ప్రభుత్వము, ప్రజలు కృష్ణాపుష్కర తీర్థయాత్రికులకోసం ఎన్నెన్నో ఏర్పాట్లు చేశారు. అయితే దైవికంగా వచ్చిన శీతజ్వరం భయంవల్ల యాత్రికులు కొన్ని ముందుజాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వాధికారులు హెచ్చరికలు చేస్తున్నారు.

ప్రజారోగ్యదృష్ట్యా యాత్రికు లిటువంటి

షైహాషయాత్ర

'ౠలలా లాలా...లలలా లాలలా' అని ఈల వేసుకుంటూ షెల్ఫులో వున్న ఆరు చదరపు అంగుళాల అద్దంలో తన ఇరవై చదరపు అంగుళాల మొహాన్ని చూచుకుంటూ తల దువ్వుకుంటున్నాడు శేషగిరి.

వంటింట్లోంచి వచ్చిన సరోజ బెడ్ రూం గుమ్మందగ్గర నుంచుని శేషగిరిని వీక్షిస్తూంది.

గిరి దువ్వుకోవడం పూర్తయింది. అద్దంలో, తన దుస్తులనూ, మొహాన్ని, తెగ చూచుకుంటున్నాడు. సరోజకు నవ్వొస్తూంది.

పాంట్ లోకి వున్న చొక్కా మీద నడుముదగ్గర మడతలు లేకుండా చేయాలని చేతితో సర్దుతూ ఆ అద్దాన్ని వేర్వేరు ఎత్తులలోవుంచి అందులో నడుముభాగాన్ని చూడడానికి ప్రయత్నిస్తున్నాడు. కాని అద్దం అందుకు ఒప్పుకోలేదు.

సరోజ ఫక్కున నవ్వింది.

గిరి తిరిగిచూచాడు. "దీన్తో లాభంలేదు. వేరే పెద్ద అద్దం కొనేయాల్సిందే." అంటూ అద్దంవైపు తిరిగాడు.

"స్వామీ."

"ఆయ్ !"

"చిన్న మనవి."

"తారీఖు ఇరవై ఎనిమిది...మనవులన్నీ మూసుకోవాలి."

"ఆర్థిక సంబంధం కాదు..."

"మరేమిటి ?"

"భవదీయ షర్టు."

"యే క్యా హై?"

"తమ చొక్కా..."

"అద్భుతమయిన, వెన్న పూసలాటి, జున్ను ముక్కవంటి లాంగ్ క్లాత్ ది..."

"కావచ్చు-"

"పదిహేను మాసాలు పనిచేసింది : అందులోనూ—ఆశే సహచరులు లేకుండా విశ్వాసపాత్రంగా పనిచేసింది."

"మరి రిటైరు కానీయరా ?"

"అప్పుడే ?"

"తమ వీపుమీద దాదాపు అంగుళం మేరకు రిటైరింగ్ కి అర్జీ పెట్టుకుంది."

"సరళ రేఖేనా?"

"ఆ. సరళరేఖే! పైగా గతవారం కుట్టబడిన రేఖకు సమాంతరం కూడానూ..."

శేషగిరి గబగబ చొక్కా విప్పేశాడు. సరోజ నూది దారం పట్టుకొచ్చి ఆ చిరుగు నిముషంలో కుట్టింది. చొక్కా తొడుక్కుని మళ్ళీ అద్దం ముందు నిల్చున్నాడు శేషగిరి. అతిడి మోహంమీద ఏదో ఆలోచన కన్పించింది.

"ఏమిటి ఆలోచిస్తున్నారూ ?" అని అడిగింది సరోజ."

రంగారావ్

"ఈ అద్దంలో శుక్రుడు ఎంచక్కా ముద్దొస్తున్నాడూ!

"ఓహో!...అంచేత ?" సెమలీలా మొహను తీవిగా పైకెత్తింది సరోజ.

"ఇంత చక్కటి అబ్బాయిని ఈ ఎండలో మాసు మైళ్ళు నడిపించడమా..."

"ఏం ? ఇవాళ బస్సులు లేవా ?"

బస్సులు లేకేం—దివ్యంగా వున్నాయి. మనదగ్గర డబ్బులు లేవు."

" ? "

"అవునండీ! అమ్మాయిగారూ" అంటూ శేషగిరి పర్సుతీసి బోర్లించాడు. భూమ్యాకర్షణశక్తి ఆ పర్సుమీద పనిచేసింది; కాని ఫలితం శూన్యం."

"మీకు కావలసింది చెపేగా" అంటూ పరుగెత్తింది సరోజ. ఆమెవెనకే వంటింట్లోకి శేషగిరీ వెళ్ళాడు.

వెంకటేశ్వరస్వామివారి హుండీని బోర్లిస్తూంది సరోజ."

"హమ్మయ్యో-దేవుడిసొమ్మే?"

"ఏమీ ఫరవాలేదండీ. మొదటి తారీఖున వడ్డీతో పడేద్దాంగా...ఇదిగో పావలా"

"పావలా ఎందుకూ?"

"సాయంకాలం రావడానికి-"

"సాయంకాలం చల్లగా నడిచి వచ్చేస్తాలే"

"ఇంతదూరం నడుస్తారా?"

"రోజూ చేస్తున్న దేగా ... చిన్నప్పుడు వాచకాలలో చదువుకోలేదూ...కాలినడక ఒక మంచ వ్యాయామము. అందుమూలమున రక్తప్రసరణ హెచ్చి కండలు బలిష్ఠములగును..."

"చాలు చాలు...ఆఫీసు టైమవుతూంది."

"ఆ బేడ ఇలా పడేయి చాలు. మిగతాదీ రేపు పొద్దుటికి వుంటుంది." అని బెడ్ రూంలోకి వెళ్ళి ఆఖరుసారిగా అద్దంలో చూచుకున్నాడు శేషగిరి.

సరోజ మంచంక్రిందనుంచి 'షూ' జత తీసి,

"ఇవి వేసుకోరూ?" అంది.

"వాటికి మేజోళ్ళు లేవు ప్రియతమా."

"జీతం రాగానే మొదట మీకు అవసరమయిన వస్తువులన్నీ కొనుక్కోకూడదూ?"

"అలాగే! ప్రస్తుతానికి బాత్ రూమ్ చప్పల్స్ పట్టుకురా."

"వాటితో ఆఫీసుకు వెడతారా!"

"అలా 'హాచ్చర్య' పడిపోకు. మనం వెళ్తున్న గుమాస్తా గిరికి అవి చాలులే"

క్రింది పెదవిని పంటితో కొరుక్కుంటూ జోళ్ళు తెచ్చింది సరోజ.

శేషగిరి ఆఫీసుకు బయలుదేరాడు. గుమ్మందాకా సరోజ వచ్చింది.

"మీరు ఈసారి తప్పక చెప్పుల జత కొనుక్కోవాలి."

"అలాగే."

"అలాగే అంటూ, ఊరుకుండిపోతారు. జీతం రాగానే నాచేతికివ్వండి. నేను కొనుక్కొస్తాను."

"అబ్బే! ఆ శ్రమ నీకెందుకూ-మాస్తూ వుండు. కనీసం సెకండ్ హాండ్ టైర్ చెప్పులయినా కొనేస్తా."

"బాగుంది" అంది సరోజ.

"సరోజ చేతి నొకసారి గట్టిగా నొక్కి, వీధిలోకి నడిచిపోయాడు శేషగిరి.

బస్సెక్కాడు. కండక్టర్ దగ్గరకు రాగానే 'గ్లోబ్' అంటూ వెంకటేశ్వర స్వామివారి హుండీలోంచి సరోజ తీసి యిచ్చిన బేడను పర్సులోనుంచి తీసి కండక్టరుకిచ్చాడు. ఆ బేడ తీయడంలో-అసలా పర్సులో బోలెడు బేడలూ, అంతకన్నా బోలెడు అణాలూ, అర్థణాలూ, కానీలూ అవీ ఇవీ ఎన్నో వున్నట్టూ, అందులోంచి ప్రత్యేకం ఈ బేడను బహుప్రయాసపడి తీసినట్టూ, కనుపించాడు.

"ఇవాళనుంచి టిక్కట్టు బేడ కాదండోయ్"-అన్నాడు కండక్టరు.

"ఏం?"

జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరం.

విజయవాడ వంటి ముఖ్య కేంద్రంలోనే కాక కృష్ణాతీరంలో చాలా చోట్ల పుణ్యక్షేత్రాలున్నాయి. ఈ క్షేత్రాలకు వచ్చిన యాత్రికులందరు కృష్ణవేణిలో స్నానంచేసి తమ పాప పంకిలం అంతా క్షాళితమయి పోయిందని ఆనందిస్తారు! కృష్ణవేణమ్మకు చేయెత్తి నమస్కరిస్తారు.

"కృష్ణవేణి! నమస్తుభ్యం
సర్వపాప ప్రణాశిని!
త్రిలోకీ పావన జలే!
రంగత్తుంగ తరంగిణి!"

★ ఘోష యాత్ర ★

"రేట్లు మారాయి."

"నిన్న పేపర్లో ఇచ్చారు."

"ఇవాళనుంచి దశాంశ పద్ధతి అమలులోకి వచ్చిందండీ. టిక్కెట్టు 13 నయాపైసలు!"

"చచ్చామే" అంది శేషగిరి మనసు. 'నీవే తప్పనితః పరం జెరుగ' - మోహంతో బస్సును కలియజూచాడు శేషగిరి. ఆఫీసు మిత్రుడు రావుగారు కన్పించారు.

"రావుగారూ! నా దగ్గర 'ఛేంజ్' లేదు. ఏదీ, మన కండక్టరుగారికో నయాపైసా ఇవ్వు కోండి" అన్నాడు శేషగిరి. రావుగారు ఇచ్చు కున్నారు.

"అమ్మయ్య" అనుకున్నాడు శేషగిరి.

ఐలండ్ గ్రౌండ్స్ దగ్గర బ్రిడ్జి ఎక్కుతూ, ఎక్కుతూ, ఆగిపోయింది బస్సు. డ్రైవర్ ఎంత చెప్పినా బస్సు వినలేదు. సోషలిస్టు సామాజిక వ్యవస్థకదా అని నలుగురూ కలిసి తోశారు. కాని "నాకు సోషలిజం అంటే మోజులేదుపొండి" అంది బస్సు.

అందరూ దిగి ఆ దారి వెంబడి వెళ్ళే మరో బస్సుకోసం ఎదురుచూచారు. కానీ ఆఫీసుల వేళ కావడం మూలాన్ని బస్సులన్నీ క్రిక్కిరిసివున్నాయి. ఒక్కటి కూడా ఆగలేదు.

రావుగారు ప్రక్కకు చేరి "ఏమండీ! ఆటోరిక్షాలో వెడదామా..." అన్నారు శేషగిరితో

"అబ్బే! ఎందుకండీ? డబ్బు దండుగా..."

"డబ్బు దండుగేముందీ—మహా అయితే అర్ధరూపాయవుతుంది. చెరి పావలా ఇచ్చుకుందాం"

"అబ్బే...అహా...అది కాదు లెండి.

ఈ ఆటో రిక్షాలు, టాక్సీలు—వీటిల్లో కూచుంటే నాకా పెట్రోలు వాసన గిట్టదండీ. దోకొస్తుంది అదీ కాక ఎటూ ఇక్కడదిగాం కనుక బుక్ హౌస్ కెళ్ళి 'సర్వీసెస్ మాన్యువల్' కాపీలొచ్చాయేమో కనుక్కోస్తా"

"ఇపుడు తొమ్మిది ముప్పావయిందండీ" అన్నారు రావుగారు.

"ఏం ఫరవాలేదు...అక్కడనుంచి సైకిలు రిక్షాలో వచ్చేస్తాలెండి. మీరు పదండి" అని త్వరత్వరగా బుక్ హౌస్ వైపు నడక సాగించాడు శేషగిరి.

పది గజాలు నడిచిన తర్వాత రావు ఆటో రిక్షాలో వెళ్ళడం చూచిన శేషగిరి 'తప్పించుకున్నారా బాబూ' అని బుక్ హౌస్ మార్గం వదిలి, ఆఫీసుదారి పట్టాడు.

పదీ ఇరవైకి ఆఫీసులో తన సెక్షనులోకి అడుగుపెట్టాడు. అటెండెన్సు రిజిస్టర్ ఆ పాటికే ఆఫీసరు దగ్గరకు వెళిపోయింది.

"మిస్టర్ శేషగిరీ—సీనియర్ క్లర్కు అయిన మీరు ఇంత ఆలస్యంగా రావడం బాగులేదు" అన్నారు హెడ్ క్లర్కు.

"అవును అని అంగీకరించాడు శేషగిరి.

"ఏమిటి—'అవును'?"

"అంటే — బాగులేదూ—అని" అన్నాడు చెమట కారిపోతూండగా రుమాలుతో మొహం తుడుచుకుంటూ.

"మరి ఆలస్యంగా వచ్చారేం?"

"అలా ప్రాణాలు తోడేయకండి!... విధవ బస్సు టైరుపగిలి కూచుంది"

"అలా అయితే నడిచి రావాలి."

"అపనే చేశాము."

"ఏమయినా సరే ఇకమీద ఆలస్యంగా వస్తే ఒప్పుకోను." అన్నారు హెడ్ క్లర్కు.

సాయంకాలం మూడింటికి హెడ్ క్లర్క్ గారు గిరి ప్రక్కనుంచుని తేనెలుట్టిపడగా "మిస్టర్ శేషగిరీ" అన్నారు.

"హా! తాళజాల ఈ ప్రేమ" అనుకుని "ఆ" అన్నాడు శేషగిరి.

"మన బాస్ గారి అమ్మాయికి పెళ్ళి".

"ఓహో!"

"అందుకు ఆయన మనల్నందరినీ ఆహ్వానించారు."

"థాంక్స్!"

"మరి ఈ సందర్భంలో ఉత్త చేతులతో వెళ్ళడం బాగుంటుందంటారా?"

"ఉహు! ఎంతమాత్రమూ బాగుండదు. ఓ అణా పులూ, ఓ వేడ అరటి పళ్ళూ కొనుక్కు వెళ్ళవలసిందే—అన్నట్టు డిన్నరుందా?"

"ఆ, ఆ, వుంది ... ఏం? ఈ సందర్భంలో మన ఆఫీసుతరఫున వధువుకో చిన్న నెక్లెసు బహూకరించా లనుకున్నాం." అంటూ హెడ్ క్లర్కుగారు జేబులోంచి ఓ పొడుగాటి కాగితంతీశారు,

శేషగిరికి రానున్నది అర్ధమయింది. "ఊ" అన్నాడు విరక్తితో.

"ప్రతీ క్లర్కూ అయిదేసి రూపాయిలూ ప్రతీ హెడ్ క్లర్కూ పదేసి రూపాయిలూ వేసుకుందాం. మీ పేరుకూడా వేశాం."

"అలాగే" అన్నాడు శేషగిరి ఎంగిలి మింగుతూ,

"థాంక్యూ" అని అవతల క్లర్కు దగ్గరకు వెళ్ళిపోతూ హెడ్ క్లర్కు ఇలా అన్నారు: "ఇలాటివాటిలో మీరు వెనక్కుతీయరని నాకు తెలుసు."

"ఓహో! అలాగాండి" అనుకుంటూ తన జేబులోంచి ఓ కాగితంముక్క తీశాడు శేషగిరి.

అది- రాబోయే మొదటి తారీఖున తాను అందుకోగల జీతాన్ని ఎలావాడాలో, ఏమేమి కొనాలో, అని రాత్రింబవళ్ళు ఆలోచించి, అనేక సవరణలుచేసి, కోత తీర్మానాల కంగీకరించి తయారుచేసిన—బడ్జెట్.

దానిని అరఘంట పరిశీలించాడు.

ఆఖరుకు-అందులో ఒక ఐదురూపాయల అంకెకు ఎదుటవున్న 'చొక్కాగుడ్డ' అన్న పదాన్ని కొట్టేసి హంసపాదు పెట్టి 'పెళ్ళి బహుమానం' అని రాశాడు.

ఏదో ఘనకార్యంచేసిన వాడిలా కుర్చీలో బాగా వెనక్కు ఆనుకుని కూర్చుని 'అమ్మయ్య' అని ఒళ్ళు విరుచుకుని ఒక్కసారి ఆవలించి, గాలి పీల్చాడు.

కాస్త గాలి ఎక్కువయిందేమో, వీపు మీద చొక్కా 'పర్ ర్' మంది.

"ఈ రేఖకూడా సరళమేనా? అయినచో నిదియూ సమానాంతరమేనా?" అని "ఇంటికెళ్ళి సరోజ నడగొచ్చులే"—అనుకున్నాడు శేషగిరి. ★



డియర్ బుడుగూ,

నువ్వూ సీ గాన పెసూనాంబ కులాసాగా ఉన్నారని తలుస్తాను. మా ఇంటి పక్కన లక్ష్మి అనే సీత ఉంది. దాన్ని నేను పేమించాను. ఇది విని మా నాన్న నాకు ప్రైవేటు చెప్పేశాడు. అందుకని నువ్వూ, సీ గాన పెసూనాంబా మీ బాబాయి అయిడియాలతో వచ్చి నాకూ లక్ష్మికి పెళ్లి రైటు చేసి రక్షించు.

సంగతులు అయిపోయాయి. కొవ్వూరు.

★ వురేయ్ నీ పేరు రాయడం మర్చిపోయావు కోయ్.

వురేయ్ బుడుగూ!

మరేమో నువ్వు అస్తమానూ మీ బాబాయి వంక పెట్టి నాలాంటి బాబాయిలందరిని అనుమానం చేస్తావా? మరి బోల్డు బాబాయిలు (నాకు కాదు నీకు) ఈ కోతలు మాని నిన్ను వడ్డిమీద చంపేస్తామన్నారు.

సుబ్బలక్ష్మికీ, సీతకీ మాలాంటి బాబాయిలంటే యిష్టమున్నప్పుడు మధ్య నీకెందుకూ అంట! మమ్మల్ని అనుమానం చేస్తావా! ఇలా అయితే నీకెంత ప్రయివేటు చెప్పాలో! ఇంకా సుబ్బలక్ష్మిలు, సీతలూ గురించి రాయి. అంతే కాని మళ్లా బాబాయిల్ని అనుమానం చేశావా నీకు గాఠిగా ప్రయివేటు చెప్పవలసివస్తుంది జాగ్రత్త!

ఓ బాబాయి, బోడవరం.

★ కోయ్ కోయ్.

డియర్ బుడుగూ

వీడెవ్రడా అని హాశ్చర్యంగా ఉంది కదూ!

★ లేదు. నీ పేరు డి. చంద్రశేఖరరావు మీది గూడూరు. హా!

బుడుగూ,

నీవు మళ్ళీ ఎప్పుడు వస్తావు? నీవు మదరాసులోనే కదూ వుంట? మేమూ ఇక్కడే ఉన్నాంలే. మా ఇంటికి రా ఒ సారి. సీ గాన పెసూనాంబను కూడా తీసుకురా. సీ. గాన పెసూనాంబలాటి పిల్ల మా ఇంట్లో కూడ వుందిలే, ఆ పిల్ల పేరు బాను.

అంజనీదేవి, మదరాసు.

★ బానులాంటి పిల్ల మా యింటిలో కూడ ఉందిలే, దాని పేరు సీ గాన పెసూనాంబ.

చిరంజీవి బుడుగూ!

భాగవతంలో కృష్ణలీలలు, ఆంధ్రపత్రికలో బుడుగు ఖదలు నాకు చాలా ఇష్టం. ఛాలా ఛాలా నిజం చెప్పిన నీలాంటి కొడుకుని కన్న రాధను గోపాళాన్ని అడిగానని చెప్పు.

మీ పిన్ని, ఎస్. లక్ష్మి.

★ నాక్కూడా అవేయిష్టంగదా. ఇంకోటి ఛాలా ఛాలా నిజెం చెప్పడం అంటే కుంచెం కుంచెం అబద్ధం చెప్పడం అని అర్థం ఉందిట గదూ. ఇలాని బాబాయి చెప్పాడులే.

డియర్ బుడుగూ,

నీ కథలు చదివి నా ఫ్రెండ్సు అందరకు చెప్పేను. మా అందరకు నీవంటే భలే ఇష్టము. నీవు నీ పసునాంబను తీసుకొని మా వూరు ఒకసారి రాకూడదూ! మా వూళ్ళో పెద్ద అయిస్కూలు వున్నది నేను ఆ స్కూల్లోనే ఫష్టుఫారములో చేరుతాను. మరిచిపోయాను. నీవు ఏమి చదువుచున్నావు?

యాళ్ళబండి రామప్రసాద్. (ఖండవల్లి),

★ నువ్వు రాసిన ఉత్తరం.

ఇంకో మూడ్రోజులకు మద్రాసు వచ్చేస్తున్నాను. నువ్వు నిఝం జెటకారై లు దగ్గరకు తీసుకురా.

ఆర్. కె. రామం, కొవ్వూరు.

★ యలాగా నేను కొవ్వూరు ఒస్తున్నానుగదా కేపో నిన్నో.

బుడుగూ,

నేను ఐదోఫారం ప్యాసయి ఎస్. ఎస్. ఎల్. సి. లోకి వచ్చాను. నువ్వు ఐదోఫారం ప్యాసయినది లేనిది నాకు తిరిగి ఉత్తరం రాయి. ఇక్కడ మా అమ్మ నాన్న అంతా కులాసా. ఇంతే సంగతులు.

నీ స్నేహితుడు, కోనూరు గోపాలరావు, మొవ్వ.

★ నేనింకా అస్సలు బళ్ళో పళ్ళేదుగా. అందుకని ఐదోఫారం అదేదో అయ్యానో లేదో నాకు తెలీదుట. తెలిస్తే రాస్తా.

వురేయ్ బుడుగూ! చిచ్చులపిడుగూ

నీ పేరంతా పెట్టి పిలుస్తున్నానని హాశ్చెర్యపడిపోయేస్తున్నావా!

ఇవటూరి కృష్ణమోహనరావు, గుడ్లవల్లేరు.

★ పడిపోయేసి మళ్ళీ లేచానులే.

చి॥ బుడుగూకి

ఆశీస్సులు. నిన్న మా ఫ్రెండిస్ నన్ను టీపార్టీకి పిలిచి వేడి వేడి పకోడీలు పెట్టారు. పకోడీలు తింటూ వుంటే నిఝంగా నీవు జ్ఞాపకానికొచ్చేవు. మరి నీకు పకోడీలంటే చాలా హిష్టం అన్నావ్‌గా. మా ఊరు వస్తే నీచే బోల్డు బోల్డు పకోడీలు తినిపించి మరీ వదులుతా.

ఎం. వి. ఆర్. రోజా, విజయనగరం.

★ నేనవన్నీ తినేసి ఇంకా బోల్డు బోల్డు కొనిపించి మరీ వదల్ను.

చౌర్య విభ్రాంతి

గతసంచిక తరవాయి

౧౦

ప్రాతఃకాల సూర్యోదయ కాంతి మాళవ రాజధాని అంతటా బంగారు రంగ వల్లులు తీర్చి దిద్దింది. దూర దూరంగా మారు మోగే రణభేరీధ్వని క్రమ క్రమంగా నగర సింహద్వారం సమీపించింది.

అమరుక దేవుడు యోధవేషం ధరించి, ఏ క్షణంలోనైనా యుద్ధరంగంలో దురకడా నికి సిద్ధంగా నిలబడ్డాడు. కొలువుకూటంలో ప్రవేశించి, వేగులవారు చెప్పిన యుద్ధవార్త లొకటొకటే శ్రద్ధగా ఆలకించాడు. అతని శరీరంమీది రణవ్రణాలింకా కళుకు కళుకు మని వేధిస్తూనే ఉన్నాయి. కాని యుద్ధ వ్యగ్రమైన అతని హృదయంలో ఆవేదనే స్ఫురించలేదు!

అనుక్షణము వేగులవారతని సన్నిధికివచ్చి మాళవసైన్యాల జయాపజయాలను నివేదిస్తూనే ఉన్నారు. ఒకమారు మాళవసైనికులు శత్రు సైనికులను రాజధాని పొలిమేరవరకు తరిమివేశారు! ఇంకొకమారు విదర్భ సైనికుల తాకిడికి శత్రు సైన్యం అంతా మాళవ రాజధాని సింహద్వారంవరకు నెట్టివేశారు. ఇంకొక క్షణంలో శత్రుసైన్యం మాళవ రాజధానిలో ప్రవేశించవలసిందే! కాని అంతలోనే మాళవ సైనికులు తమ ప్రాణాలెదురొడ్డి శత్రుసైన్యాని కడ్డకట్టగా నిలుచున్నారు!

ఇక ఆలస్యం చెయ్యకుండా వెనువెంటనే యుద్ధరంగంలో దురికి తన సేనానాయకులకు, సైనికులకు ప్రోత్సాహం కలిగించాలని అమరుకదేవుడను క్షణము ఉవ్విళ్లూరుతూనే ఉన్నాడు. అయితే ఒక్కమారా యతీశ్వరుల సందర్శనానందము. వారి ఆశీర్వచన భాగ్యము పొంది ఉత్తర క్షణంలో కళ్లు మూసుకొని రణరంగంలో దురకాలని అతని సంకల్పం.

యతీశ్వరుల నందరినీ వెంటబెట్టుకుని ఒకక్షణంలోనే తిరిగి వస్తానని చెప్పి వెళ్లిన కింశుకప్రభ ఇంకా అతని సన్నిధికి రాలేదు. అతడామె రాకకోసం ఎంతో ఆత్రంగా ఎదురు చూస్తూ నిలుచున్నాడు. అంతలో రాజ్యవర్ధను డతి వినయంగా అతని సన్నిధికి వచ్చి నిలబడ్డాడు:

"మహాప్రభూ! శత్రు సైనికులు నగర ద్వారం సమీపించారు! ఘోరంగా పోరాడుతున్నారు. అయినా మన సైన్యమేమీ తీసిపోలేదు. చిట్ట చివరికి జయలక్ష్మి మనదే! కనక తామిక స్వయంగా యుద్ధరంగంలో దురకవలసిన అవసరం నాకేమి కనిపించడం లేదు! అదీగాక తమరింకా కొంచెం విశ్రమించడం అవసరమని రాజవైద్యులు విన్నవిస్తూనే ఉన్నారు! ఆపైన తమ చిత్తం!"

ఊనూరుమని మహారాజొక నిట్టూర్పు విడిచిపెట్టాడు. అతని సంకల్పం ఆ క్షణా

గోపాలరావు

నికి కొంతవరకు మారినదని మహామాత్యుడు గ్రహించుకొన్నాడు. మారు మాటాడకుండా నెమ్మదిగా అక్కడినించి వెళ్లిపోయాడు.

మహారాజు స్వయంగా యుద్ధరంగంలో దురకడం మహామాత్యునికి మొట్ట మొదటి నించీ ఇష్టంలేదు. ఇప్పుడది మరింత బలపడింది. రాజ్యవర్ధనుడేదో మిష పెట్టి మహారాజు స్వయంగా యుద్ధరంగంలో దురకకుండా అడుగడుగునా అడ్డు తగులుతూనే ఉన్నాడు!

మొట్టమొదట అమరుకదేవు డది ఆత్మక్షేమంకోసమే జరిగినదని అనుకోకపోలేదు. కాని క్రమక్రమంగా ఆ విషయంలో అతనికేదో సందేహం పట్టుకుని పీడించింది. రాజ్యవర్ధను డిటీవల మంత్ర తంత్ర శాస్త్రజ్ఞులతో జేరి మంతనాలారంభించాడు. అది చూచాయగా అమరుకదేవుని చెవిని పడింది.

అదికూడా తన క్షేమారోగ్యాల కోసమే అయి ఉండవచ్చునని అమరుకదేవు డొకప్పుడనుకున్నాడు. కాని ఆ విషయంలో ఇప్పుడతనికేదో పెద్ద అనుమానమే కలిగింది. అదే ఆలోచిస్తూ అతడొక క్షణం సేపలాగే నిలుచున్నాడు.

మళ్లీ యుద్ధభేరీ భైరవధ్వనిగంభీరంగా అతని కర్ణకుహరాలలో మారుమోగింది. అతడిక కింశుకప్రభకోసం ఎదురుతెన్నులు చూస్తూ నిలబడలేకపోయాడు. వెంటనే రణరంగానికి బయలుదేరి వెళ్ళిపోవాలని అనుకొన్నాడు. అంతలో కింశుకప్రభ తొందర తొందరగా అతని సన్నిధికి వచ్చి విన్నవించింది:

"మహాప్రభూ! నావల్ల కొంచెం విలంబనమే జరిగింది. మన్నించండి! ఆయతీశ్వరులను వెదికి పట్టుకోవడం కొంచెం కష్టమే అయింది. చిట్టచివరి కెలాగో అలాగ వెదికి పట్టుకున్నాను. వారంతా ఇప్పుడే తమకొలువుకూటానికి విచ్చేయనున్నారు."

కింశుకప్రభ యతీశ్వరులంతా అక్కడికి రాగానే వారికి సవినయంగా నమస్కరించింది. ఎంతో మర్యాదచేసి ఆయా సుఖాసనాలపై కూర్చోవలిసిందని ప్రార్థించింది. అమరుకదేవు డత్యంత భక్తిభావంతో వారందరికీ సాష్టాంగ నమస్కారాలు చేసి సవినయంగా చేతులు జోడించి నిలబడ్డాడు. కింశుకప్రభ అతని భక్తిప్రపత్తులు చూచి మొట్టమొదట కొంచెం ఆశ్చర్యపడుతూ నెమ్మదిగా అంతఃపురంలోనికి వెళ్ళిపోయింది.

యతీశ్వరు లెవ్వరు తమకేర్పరచినసుఖాసనాలపై కూర్చోలేదు. అలాగే నిలబడి నిశ్చల దృష్టితో అమరుకుని ముఖవైఖరి పరిశీలించారు:

"తత్త్వమసి!

తత్త్వమసి! రాజన్!"

అందరు ఒకేగొంతుతో నాలుగైదు మారు లెలుగెత్తి ఘోషించారు! ఆ ఘోష అమరుకదేవుని హృదయకుహరంలో ప్రళయ సాగరఘోషే రేకెత్తించింది!

అమరుకదేవుడు వారందరి ముఖాలు అతి

[illegible]

జాగరూకతతో పరిశీలిస్తూ నిలబడ్డాడు. అతని హృదయంలో మళ్లీ ఒక పెద్ద మథన ప్రారంభించింది! అందరు అతన్ని ఉద్దేశించి "రాజా! నీవా పరమాత్మ స్వరూపుడవే! సుమా!" అని ఎలుగెత్తి హెచ్చరించారు!

"నే నెవరిని? నే నెవరిని? నే నమరుక దేవుడను కానా? కాకపోతే నా నిజస్వరూప మేమో! నేనా పరమాత్మస్వరూపుడనా? ఇది నిజమేనా? నే నమరుకడను కానే కానా? అయితే నే నెవరిని? నే నెవరిని?"

అతని హృదయంలోని మథన క్షణక్షణానికీ ఆ విధంగా పెచ్చు పెరిగింది! మరికొంత సేపటి కమరుక దేవుని కేదో హఠాత్తుగా స్ఫురణకు వచ్చింది. ఇంకా కొంత సేపటి కతని హృదయంలో పూర్వవృత్తాంతం అంతా ఒక మెరుపులా మెరిసింది!

ఆ క్షణంవరకు అతనిహృదయంలో ఉవ్వెత్తుగా పెరిగిన సందేహతరంగాలన్నీ పూర్తిగా అంతరించాయి. పెదవులపై, చిరునవ్వులు పువ్వులు పూశాయి.

"తత్త్వమసి!
తత్త్వమసి! రాజన్!"

మళ్ళీ వారందరి కంఠాలు ఒక్కుమ్మడిగా మారుమోగాయి. వెంటనే అయతీశ్వరులందరు అమరుకదేవుని పాదాలకు ప్రణమిల్లి జయ జయ ధ్వానాలు చేశారు. అమరుక దేవుని పెదవులపై చిరునవ్వులాగే ఆరని తారకలా మెరిసింది. క్రమ క్రమంగా ఆ పూర్వస్మృతి అంతా అతని మనో నేత్రాల కెదురుగా సాక్షాత్కరించింది!

౧౧

ఆచార్యశంకరుడు పద్మపాదాది శిష్యులతో కలిసి మాహిష్మతీనగరంలో మండన మిశ్రుని గృహ ప్రాంగణంలో అడుగు పెట్టాడు.

మండన మిశ్రుడు పూర్వ మీమాంసా శాస్త్రవేత్త. మహా విద్వాంసుడు. ప్రపంచ లీల యావత్తు కర్మాధీనమే అని అతని మతం. పూర్వమీమాంసా శాస్త్రం సిద్ధాంతంకూడా అదే. యజ్ఞయాగాది కర్మలు, నిత్య నైమిత్తిక కర్మలు, పుణ్యకర్మలు ఆచరించేవారికి స్వర్గాది లోకాలు కరతలామలకాలనీ, ఆకర్మలే సర్వ శ్రేయోదాయకాలనీ ఆ శాస్త్ర సిద్ధాంతం.

ఆచార్యశంకరుడు తన ఆసేతు హిమాచల



★ ఆచార్య విభ్రాంతి ★

యాత్రలో మీమాంసావేత్త మండన మిశ్రుని విఖ్యాతకీర్తి విన్నాడు. తన శిష్య బృందంతో కలిసి స్వయంగా ఆ మహావిద్వాంసుని గృహాంగణంలో నిలుచున్నాడు.

మండన మిశ్రుడంతకు పూర్వమే ఆచార్య శంకరుని అద్వైత వేదాంత వాదం కొంత వరకు కర్ణాకర్ణిగా విన్నాడు. స్వయంగా అంతటి ఆచార్య శంకరుడే తన కతిథి దేవుడై అవతరించాడని విని ఎంతైనా సంతోషించాడు. యతీశ్వర మర్యాదా గౌరవాదరాలతో ఆచార్యశంకరుని తోబాటతిథు లందరినీ తన భవంతి కాహ్వానించాడు.

శంకరుని అద్వైత వేదాంత వాదానికీ, పూర్వమీమాంసా సిద్ధాంతానికీ కొన్ని ముఖ్యమైన వివాద విషయాలున్నాయనీ ఆ వివాదదృష్టితోనే ఆచార్యుడతిథిగా విచ్చేశాడనీ మండనమిశ్రుడు గ్రహించుకొన్నాడు. తన కింతకాలానికాచార్య శంకరుని వంటి మహాపురుషునితో వాదించే భాగ్యం కలిగిందని మండమిశ్రుడుప్పొంగిపోయాడు. తన పూర్వమీమాంసా సిద్ధాంతం ఇక ఆ నాటినుంచీ విద్వాంసులందరికీ శిరోధార్యం కాగలదని ఆనందించాడు.

ఆసమయంలో మండనమిశ్రుని ధర్మపత్ని ఉభయభారతి అతని దగ్గిరికి వచ్చి నెమ్మదిగా చెవిలో చెప్పింది:

"మీరేమో మీ శాస్త్రవాద బలంతో ఆచార్య శంకరుల నోడించాలని ఉవ్విళ్లూరుతున్నారు! కాని నాకా తేజోమూర్తిని సందర్శిస్తే అంతటి ధైర్యం కలగడం లేదు! ఒక వేళ మీరే ఆ వాదంలో పరాజితులై పోతే?"

మండనమిశ్రు డొక క్షణకాలం తన భార్యవైపు చూచాడు:

"ఒక వేళ నేనేకనక ఆ వివాదంలో పరాజయం పొందితే అద్వైత వేదాంత మార్గమే సర్వులకు శిరోధార్య మన్నమాట! వెంటనే సన్యసించి నేనాయన కంతే వాసినై వెళ్ళిపోతాను! అంతే! దీనికిక తిరుగు లేదు!"

ఆ మాటవిని ఉభయభారతి బాగా భయపడింది. అయినా పైపైకొక చిరునవ్వు నవ్వింది:

"ఒక వేళ ఆచార్య శంకరులే పరాజితులై పోతేనో?"

"ఆయన తమ సన్యాసాశ్రమం విసర్జించి తిరిగీ పూర్వమీమాంసా కర్మమార్గం చేపట్టి తీరవలసిందే!"

"కానీయండి! ఇంతకీ ఏమి జరగవలసి ఉందో, అదే జరుగుతుంది! బుద్ధిః కర్మానుసారిణీ!"

ఉభయభారతి ఊసూరుమని ఒక వేడి నిట్టూర్పు విడిచిపెట్టింది. మండనమిశ్రుడు మహా విద్వాంసుడు. అంతేకాక మహా సాహసి. ఇది శాస్త్రసమ్మతమైన మార్గం అని నమ్మకకలిగితే వెంటనే ఆమార్గం అనుసరించడానికి కాయన వెనకంజ వెయ్యడు! మాటలకు, చేతలకు మధ్య లేశమైనా విభేదం అంగీకరించని కర్మనిష్ఠుడు!

ఉభయభారతి ఆయన సన్నిధిని సర్వశాస్త్రాలు, షడ్దర్శనాలు అధ్యయనం చేసింది. మహా విద్వాంసురాలని అందరిచేత మన్నన లందుకొన్నది. అంతటి విద్వాంసురాలే భర్తకిప్పుడొకమహావేత్తమూలానపరాజయం రానున్నదని భయపడింది. కాని మండన మిశ్రుడేటువంటి పరాజయభయమేమీ లేదనీ, ఆచార్య శంకరుడే పరాజయం పొందగలడనీ అభయహస్త మిచ్చాడు.

శంకరాచార్య మండన మిశ్రుల మధ్య శాస్త్రచర్చ జరుగనున్నదని విని మాహిష్మతీ నగర విద్వాంసులంతా మండనమిశ్రుని భవంతిలో గుమిగూడారు. మధ్యాహ్నం రెండు యామాలవేళ దాటి కొంచెం చల్లబడగానే శాస్త్ర చర్చ ప్రారంభమయింది. ఆచార్య శంకరుకని ప్రియాంతేవాపద్మపాదాచార్యుడు, ఉభయభారతి, మరికొందరు శాస్త్రవేత్తలు వారిద్దరి వాదోపవాదాలు శ్రద్ధగా ఆలకిస్తూ మధ్యస్థ ధర్మం నిర్వహించారు. మొట్టమొదట ఛలోక్తులతోను, చమత్కారాలతోను ప్రారంభమైన శాస్త్రచర్చ క్రమక్రమంగా గహనాతి గహనమైన శాస్త్రవిషయాలలోకి వెళ్లిపోయింది. ఆచార్య శంకరు డత్యంత ప్రసన్న వదనంతో శాస్త్రచర్చ సాగించాడు. ఆయన ముఖంలో లవలేశమైనా విజిగీషా భావం గోచరించలేదు! మండనమిశ్రుడా మహాపురుషుని సౌజన్యము, సౌహార్ద్రము, సత్యనిష్ఠ చూచి నిర్ఘాంతపోయాడు! అతడింతకుపూర్వం ఎన్నెన్నో వాదోపవాదాలు సాగించాడు. ఎందరెందరో విద్వాంసులతో వాదించాడు. ఆ విద్వాంసులలో ఎంతసేపు ఎదటివారిని ఓడించాలన్న తహతహేగాని, సరియైన సత్యనిష్ఠ కనబడలేదు! ఆచార్య శంకరుని ధోరణి దానికి కేవలం విభిన్నంగా కనిపించింది!

ఇంచుమించుగా సాయంకాలం గోధూళి వేళ వరకు శాస్త్రచర్చ కొనసాగింది. అంతవరకు మండనమిశ్రుడు తన శాస్త్ర పాండిత్యంతో స్వయంగా ఆచార్య శంకరుని మన్ననలే అందుకొన్నాడు! కాని క్రమక్రమంగా మండవమిశ్ర పండితుని వాదబలం క్షీణించింది. చిట్టచివర కుభయభారతితో సహా అందరు ఆచార్య శంకరుని వాదమే వేదశాస్త్ర సమ్మతమని అంగీకరించారు. కాని మండనమిశ్రు డెక్కడా చలించలేదు! వెనువెంటనే సన్యాసాశ్రమం స్వీకరిస్తున్నానని సదస్యులందరికీ తన అచంచల సంకల్పం తెలియజేశాడు!

అంతలో ఉభయభారతి లేచినిలబడి ఆచార్యశంకరునికీ, మధ్యస్థులకు సవినయంగా నమస్కరించి విన్నవించింది:

"నాదొక్క మనవి! ధర్మపత్ని పురుషుని కర్థాంగి అని మన శాస్త్రవేత్త లుద్ఘోషిస్తున్నారు. అందుచేతనన్ను కూడా శాస్త్రవాదంలో జయించే వరకు ఈవిజయం సంపూర్ణ విజయం కాజాలదని మనవి! ఆపైన తమ చిత్తం!"

ఆమె వాదం విని ఆచార్య శంకరుడే ఔనౌనన్నట్టలవోకగా శిరఃకంపంచేశాడు. ఆయనే ఔనని అంగీకరించిన ప్పుడిక మధ్యవిద్వాంసులకడ్డుచెప్పడానికి మనసొప్ప లేదు. అదీగాక వారికికూడా ఆమె ఆశంక న్యాయ్యమేనని తోచింది. మండన మిశ్రుడు మరి సమాధానం చెప్పలేక తలవంచుకొని కూర్చున్నాడు.

మళ్ళీ ఉభయ భారతీ శంకరాచార్యుల మధ్య శాస్త్ర వివాదం చెలరేగింది.

ఆమె మండనమిశ్రుడు తొక్కిచూడని నూతన మార్గాలలో మీమాంసా శాస్త్ర చర్చ ప్రారంభించింది. క్రమక్రమంగా ఆచర్చ అనేక శాస్త్ర సంప్రదాయ మార్గాలలో కొనసాగింది. మరి కొంతసేపటి కది గృహస్థ ధర్మం మీదికి తిరిగింది.

ఉభయ భారతిక కంతవరకు ఆచార్య శంకరుని పరాజయం సాధ్యం కాలేదు! ఆచార్య శంకరుడు భారత వర్షంలో అంతటా దిగ్విజయయాత్ర చేసి అద్వైత మత ప్రతిష్ఠాపనాచార్యుడని ప్రసిద్ధివహించాడు. మండన మిశ్రుని వంటి మహావిద్వాంసునికే ఆచార్య శంకరుని పరాజయం సాధ్యం కాకపోతే, ఇక ఉభయభారతి మాత్రమేమి చెయ్యగలగు?

కొంతసేపటికామెకొక ఉపాయం తట్టింది. ఆలోచించి ఆలోచించి తన వాదోపవాదధూళిలో కామశాస్త్ర ప్రస్తావన చొప్పించి దానిపై ఒకవివాదం లేవదీసింది. ఆవివాదానికి సమాధానమిస్తే ఆచార్యశంకరుడాజన్మ బ్రహ్మచారి అన్న ప్రతిష్ఠకే భంగం కలుగుతుంది!

సమాధానమే ఇవ్వకపోతే మధ్యస్థ విద్వాంసులాచార్యుడావాదంలో ఓడిపోయినట్టే నిర్ణయిస్తారు! ఆవిషమసంధిలో ఆచార్య శంకరుడు కేవలం మౌనంవహించి మాట్లాడకూరుకున్నాడు. మధ్యస్థ విద్వాంసులకేమీ పాలుపోలేదు. వారిలోవారు కొంతసేపు గుసగుసలాడుకొన్నారు.

అది కేవలం గృహస్థధర్మానికి సంబంధించిన ప్రశ్న. ఆచార్యుడాజన్మబ్రహ్మచారి. అందుచేతనే ఆచార్యుని పరాజయం నిర్ణయించడానికి మధ్యవర్తులంగీకరించలేదు. అయితే ఆరుమాసాల వ్యవధిలోనైనా ఆచార్యుడుభయభారతి ప్రశ్నకు సమాధానం చెప్పాలని అందరు ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఆచార్యుడు పర శరీరప్రవేశ విద్యావేత్త. ఆవిధంగా కొంత అనుభూతిపొంది, ఉభయభారతి ప్రశ్నకుచితమయిన సమాధానమిస్తే తన బ్రహ్మచర్య నిష్ఠకే లోపము రాదు. ఆక్షణంలో ఆచార్యశంకరుని కదే సముచితమయిన మార్గమని స్ఫురించింది.

అంతటితో ఆవాదోపవాదాలలాగే నిలిచిపోయాయి. తాత్కాలికంగానైనా మండనమిశ్రునికి సన్యాసయోగం తప్పించినందు కుభయభారతి ఎందరు అభినందించారు. ఆచార్యుడు పద్మపాదాది శిష్యులతో కలిసి తిరిగే దిగ్విజయయాత్ర కుపక్రమించాడు. ఆరుమాసాల అవధికి పూర్వమే మళ్లీ మాహిష్మతీనగరం చేరుకోగలనని మండన మిశ్రునికి వాగ్దానంచేశాడు.

“ఆచార్యపాదులు సర్వజ్ఞులు! అంతటి మహామేధావికి తుచ్ఛమయిన కామశాస్త్ర రహస్యం ఒక లెక్కా! అయితే కేవలం లోకధర్మ సంగ్రహం కోసమే ఆచార్యులీ మార్గం అవలంబించి ఉండవచ్చును!”

పద్మపాదాది శిష్యులందరు ఆచార్యుని సంకల్పాని కావిధంగా భాష్యాలు రచించుకొన్నారు. మారుమాటాడక ఆచార్యుని అడుగుజాడలలోపడి నడిచి వెళ్ళిపోయారు.

పది పదిహేను రోజులలో వారందరు మాళవరాజ్య సమీపారణ్యం చేరుకొన్నారు.

ఆచార్యునికా ప్రాంతంలో సింహం పంజాదెబ్బతో నిర్జీవమైపోయిన అమరుక భూపతి శరీరం కనిపించింది. పర శరీర విద్యా ప్రభావం వినియోగించి, వెంటనే శంకరుడా శరీరంలో ప్రవేశించాడు. తన శరీరం ఒక గుహలోఉంచి జాగ్రత్తగా సంరక్షించ వలసినదని శిష్యులందరికీ ఆజ్ఞాపించాడు. ఆ శరీరానికేదైనా మహా ప్రమాదం ఏర్పడితే వెంటనే తనకా విషయం తెలియజెయ్యవలసిందని పద్మపాదునికతి రహస్యంగా ఆదేశించాడు. అటుపిమ్మట అమరుకదేవుని శరీరాను భూతిలో లీనమై మూర్ఛలో మునిగిపోయాడు. క్రమక్రమంగా మహాభోగి అయిన అమరుకదేవుని అంతఃపురంలో ప్రవేశించి కామకళా రహస్యాలన్నీ అవలీలగా అవగాహనం చేసుకొన్నాడు.

౧౨

అమరుకదేవుని శరీరంలో నిలిచిన ఆచార్య శంకరుని హృదయంలో, పూర్వస్మృతులన్నీ ఆవిధంగా క్రమక్రమంగా ఒకటొకటిగా పురివిప్పి నృత్యం చేశాయి.

“కొంతకాలంపాటి శరీరంలో నివసించినంతమాత్రాన నాకే ఇంతటి విస్మృతి విభ్రాంతులు కలిగాయే! ఇక సాధారణ సంసారులకు శరీరాత్మ భ్రాంతి కలగడంలో ఆశ్చర్యమేమి ఉంది!”

శంకరాచార్యుడు కొంతసేపలాగే ఆశ్చర్య ముద్రలో మునిగిపోయాడు.

క్రమంగా ఆచార్య శంకరునికి, అమరుకదేవుని అంతఃపురాంగనలు, వారితో కలిసి మెలిసి తానమభవించిన మహాభోగాలు, కింశుక ప్రభగాఢానురాగము, ఆమె నృత్య హేలావిలాసాలు — మొదలైనవన్నీ స్ఫురణకువచ్చాయి. అంతలోనే “ఆ భోగాలనుభవించిన వ్యక్తివేరు! నేను వేరు! నేను కేవలం అజరామరమైన పరమాత్మ మూర్తిని! నేనా వ్యక్తిని కాదు!” అన్న స్ఫురణ కలిగింది. ఇంకొక క్షణంలో “అందరు పరమాత్మ స్వరూపులే! కేవలం నా స్వరూపులే! పరమార్థ దృష్టిలో పరిశీలిస్తే నాకు, ఆ అంతఃపురాంగనలకు భేదమేమీ లేదు! లేదు!” అని స్ఫురించింది. ఆచార్య దేవుని హృదయంలో వారందరిపైన అపారమైన కరుణావాహిని వెల్లివిరిసింది. అంతేకాదు: ఆ క్షణంలో చరాచర ప్రపంచం అంతటిమీద ఆచార్యుని

★ ఆచార్య విభ్రాంతి ★

ఆపారకరుణావాహిని జాలువారింది. తన చల్లని అద్వైతామృత వృష్టితో ప్రపంచంలో ప్రాణులందరికీ ఇంత విజ్ఞాన భిక్ష పెట్టి వారందరి హృదయవేదనా జ్వాలలు ఒక్కమారుగా చల్లార్చివేయాలని ఒక మహా సంకల్పం కలిగింది. ఆ భావనతో ఆచార్య శంకరుని చెక్కిళ్ళపై కన్నీటి బిందువులే జాలువారాయి.

అంతలో రాజ్యవర్ధను డక్కడికి వచ్చాడు:

"మహాప్రభూ! యుద్ధంలో మనకే దిగ్విజయ సూచనలు గోచరిస్తున్నాయి. శత్రువులందరు చెల్లాచెదరై పారిపోతున్నారు! తమకిక ఈ యోధవేషం అనవసరం!"

రాజ్యవర్ధను డలాగే నిలుచున్నాడు.

"మీ వంటి మహామాత్యులుండగా నాకేమి కొదవ. స్వయంగా మీరే ఇక ఈ రాజ్యసంరక్షణ భారం వహించండి. నాకింకా పూర్తిగా స్వస్థత కలగలేదు. మన సైన్య సన్నాహభారం కూడా ఇక మీరే వహించండి!"

దానితో తన సంకల్పం పూర్తిగా నెరవేరిన దని రాజ్యవర్ధను డనుకొన్నాడు. ద్విగుణీకృత ధైర్యంతో తిరిగి యుద్ధ వ్యూహ సన్నాహాలారంభించాడు.

ఆచార్యు డొకమారు మాళవ రాజధానీ నగరంవైపు, అంతఃపురంవైపు చూచాడు. ఒక్క నిట్టూర్పు విడిచిపెట్టాడు. తిరిగి తన పూర్వ దేహంలో ప్రవేశించవలెనని సంకల్పించాడు.

ఆచార్య శంకరుని దగ్గర సెలవు తీసుకొన్న యతీశ్వరు లంతకు పూర్వమే మాళవారణ్యానికి ప్రయాణమైనారు.

వారరణ్యంలో ప్రవేశించే సరికి, పర్వత గుహలో ఆచార్య శంకరుని శరీరం భద్రంగా సంరక్షిస్తున్న యతీశ్వరు డొకడు తొందర తొందరగా వారి సన్నిధికి వచ్చాడు:

"మాళవ రాజాధికారులు కొందరు గురుపాదుల శరీరానికి బలాత్కారంగా దహన సంస్కారం చేస్తున్నారు! రండి! రండి! గురుదేవుని శరీరం చితిపాలు కాకుండా సంరక్షించండి!"

అది వినగానే పద్మపాదాది శిష్యులంతా పర్వతగుహదగ్గిరకి పరుగులు పెట్టారు. ఆపైన మరిఆచార్యశరీరానికిదహనసంస్కారంజరగకుండా, సరిగా సమయంలో అడ్డుపడ్డారు. పద్మపాదుడు మాళవరాజాధికారులెవరు ఆ గుహ సమీపానికికూడా రావడానికి వీలు లేదని గట్టిగా కట్టడిచేశాడు. మాళవాధికారులిక గత్యంతరంలేక తలలు వంచుకుని తిరిగి వెళ్ళిపోయారు.

పద్మపాదునికిమాళవరాజాధికారులచర్యల కంతరార్థం అంతా విస్పష్టంగాబోధపడింది. రాజ్యవర్ధనుడు కొంతమంది మంత్ర తంత్ర శాస్త్రజ్ఞులతో సంప్రదించి అమరుక దేవుని శరీరంలో పరశరీరప్రవేశ విద్యావేత్త ఎవరో ప్రవేశించి ఉండవచ్చునని గ్రహించాడు. రాజ్యసంరక్షణ కేవిధంగానైనా అమరుక దేవుని జీవితం అత్యవసరమని అతనికి స్ఫురించింది. వెంటనే మాళవరాజ్య పరిసరాలలో ఉన్న మృతశరీరాలన్నిటికీ దహనసంస్కారం చేసితీరాలని ఆజ్ఞాపించాడు. గుప్తంగా సంరక్షించినమృతశరీరాలుకూడాకనిపెట్టిబలాత్కారంగానైనాఅవిదహించివెయ్యవలసిందే అని గట్టిగా కట్టడిచేశాడు. అందువల్లనే యతీశ్వరు లక్కడలేని అదను కనిపెట్టి రాజాధికారు లాచార్యునిశరీరం బలాత్కారంగా దహించి వెయ్యాలని సంకల్పించారు. కాని తరుణంలో అది చూచిన పద్మపాదాది శిష్యులు రాజాధికారుల ఆటలు సాగనీయలేదు. వారంతకుపూర్వమేఅమరుకశరీరంలో ప్రవేశించిన ఆచార్యుని కాత్మవిస్మృతికలిగి ఉండవచ్చునని భయపడ్డారు. రాజధానీ నగరంలో ప్రవేశించి వారందరు ఉచ్చైస్స్వరాలతో హెచ్చరిక లుచ్చరించడానికి అసలు కారణం అదే! కాని వారెంత జాగరూకత

ఈ వారంతో
ప్రాచీనగాథాలహరి అయిపోయింది.

దహించినా చిట్టచివరి కాచార్యుని శిరోభాగం కొంతవరకు అగ్నిజ్వాల కాహుతి కాక తప్పలేదు! పద్మపాదాది శిష్యులా అగ్నిజ్వాలలు చల్లార్చి ఆచార్యుని శిరోభాగానికి శాయశక్తులా చికిత్సలు చేశారు. ఆచార్యుని పార్శ్వంలో నిలిచి అత్యంతభక్తి భావంతో అగ్నిసూక్తపారాయణ ప్రారంభించారు. కొంతసేపటికాచార్యుని శరీరంలో తిరిగి దివ్య చైతన్యం జ్వాల వికసించింది.

మరికొంత సేపటికాచార్య ముఖంలో చిరునవ్వుదయించింది! శిష్యులది చూచి అత్యంతభక్తి భావంతో ఆచార్యునికి జయజయధ్వానాలు చేశారు.

ఆచార్యశంకరుడు నెమ్మదిగా కళ్ళుతెరిచి నాలుగు వైపులా పరిశీలించి చూచాడు. పద్మపాదాది యతీశ్వరులందరు తిరిగీ జయజయధ్వానాలు చేశారు.

కాని ఆచార్యుని శిరోవేదన వేయి శూలాలై వేధించింది. ఆ వేదనానుభూతి పొందిన ఆ అద్వైతాచార్యుని హృదయంలో నిఖిల ప్రపంచ ప్రాణికోటి వేదన మరింత తీవ్రంగా వేధించింది. ఆ ప్రాణులందరిమీద ఆచార్యుని అపార కారుణ్యదృష్టి ప్రసరించింది. మండన మిశ్రునికేకాక ప్రపంచ ప్రాణులందరికీ తన అద్వైతామృతం చవిచూపించాలనీ, వారి నందరినీ సంసార జటిల దుఃఖాల సుడిగుండాలలోంచి తరింపజేయాలనీ ఆమహా పురుషునికొక దివ్య సంకల్పం కలిగింది.

ఆచార్యుడిక తన శిరోవేదన లక్ష్యపెట్టనే లేదు! వెనువెంటనే లేచి మాహిష్మతీ నగరానికి బయలు దేరాలని సంకల్పించాడు. పద్మపాదుడది గ్రహించి ఆచార్యునికి తన చేయి అందిచ్చాడు. అతని భుజంమీద చేయివేసి ఆచార్యుడు నెమ్మదిగా లేచి నిలుచున్నాడు. వారందరు వెంటనే మాహిష్మతికి ప్రయాణమయ్యారు. ప్రపంచ ప్రాణి సముద్ధరణ దృష్టితో తన శరీర స్వస్థత లవలేశమైనా గమనించకుండా బయలుదేరిన ఆచార్యునివైపు చూడగానే పద్మపాదాది శిష్యుల నేత్రాలలో బాష్పమాలికలు తోరణాలై నిలిచాయి!

వారందరు ముక్తకంఠాలతో మళ్ళీ జయజయధ్వానాలు చేశారు. ఆ ధ్వనులా సహోముఖంలో మరింత గంభీరంగా మారుమోగాయి! —సమాప్తం. ★

ఎడారిలో ఎండమావులు

"నేను యం. బి. బి. యస్. చదువుతాను, నాన్నగారూ!" అంది లలిత.

"అలాగేనమ్మా! ముందు ఇది గట్టెక్కనీ!" అన్నారు పరంధామయ్యగారు నవ్వుతూ సంతోషంతో లోపలికి వెడుతున్న లలితని చూసి పరంధామయ్యగారు ఒక్క నిట్టూర్పు విడిచారు.

పాపం! తల్లిలేనిపిల్ల! లలితకి మూడో ఏడు వచ్చేటప్పటికి తల్లిపోయింది. అప్పటినుంచీ, తల్లీ తండ్రీ తానే అయి, పరంధామయ్యగారే పెంచారు. ఇంతవరకు లలిత కోరిక ఏదీ తీరకుండా లేదంటే, పరంధామయ్యగారు ఆమెని ఎంత గారాబంగా పెంచారో అర్థం అవుతుంది. ఆయనకీ, సంపాదించినదే కాకుండా, పిత్రుపైతామహికమైనది కూడా ఉండడంవల్ల చాలాదర్జాగానే బ్రతికారు. లలితకి కూడా తాము గొప్పవారమని గట్టినమ్మకం. ఆడపిల్ల ఐనా, మొగపిల్లవాడయినా లలిత ఒక్కతే కనక, అన్ని కోరికలూ ఆమెలోనే ఫలించేటట్టు చూసుకుని తృప్తిపడుతున్నారు పరంధామయ్యగారు. అందుకనే తన బంధువుల్లో కొంతమంది వారించినా లెక్కచేయకుండా ఆయన లలితని హైస్కూలులో కూడా చేర్పించారు. లలితకూడా పరంధామయ్య ఆశలకీ, ఆశయాలకీ ఒక ఆలంబనంగా వుంటూ వచ్చింది. చదువులో ఒక్కొక్క మెట్టూ సునాయాసంగా పైకెక్కుతూ వచ్చింది. స్కూలందరిలోనూ తెలివైనవారిలోనే లెక్కవేశారు ఆమెని. ఆ యేటే స్కూలు ఫైనలు పరీక్షకి వెళ్లింది.

భావి జీవితాన్ని గురించి, లలితకి కొన్ని విచిత్రాభిప్రాయాలున్నాయి. అందరు ఆడపిల్లల మాదిరి కాకుండా, తాను ఒక ప్రత్యేకత నిలబెట్టుకోవాలని, ఆమె ఆశ! అందుకని పెద్దచదువులు చదవాలనీ, ఆచదువు సార్థకం అయ్యేటట్టు, గొప్ప గొప్ప ఆశయాలతో, పదిమందికీ పనికివచ్చే వృత్తిలో ప్రవేశించి పేరూ ప్రతిష్ఠా సంపాదించాలనీ, ఇంకా ఏవేవో అయిపోవాలనీ ఆశలుపెంచుకుంటూ ఉండేది. అందుకనే డాక్టరు కావాలని కోరుకుంది.

మరొకప్పుడు ఆమె ఆలోచనలు ఇంకో రీతిగా ఉండేవి. తన అందచందాలని గూర్చి కూడా ఆమెకి కొంత ఎక్కువ అభిప్రాయం లేకపోలేదు. వాటి ఆధారంతోనే, తనకి సరిపోయే జీవిత భాగస్వామిని ఎన్నుకోవాలనీ, తాను వెళ్లినచోటల్లా ఒక వినూత్న పద్ధతి, సంస్కారం కల వాతావరణం సృష్టించాలనీ, గృహాన్ని స్వర్గతుల్యం చేసుకోవడంలో తాను మిగిలినవారికి ఆదర్శప్రాయంగా ఉండాలనీ కోరుకునేది. ఈవిధమైన ద్వైధీభావంలో పడి లలిత ఊగులాడుతోంది. ఏది ఏమయినా తన ఆశలు ఫలింపచేసుకోవడంలో పట్టుదలా శ్రద్ధకూడ చూపిస్తుంది. చెప్పింది చేసితీరుతుందని ఆమెనిగూర్చి అభిప్రాయం పడిపోయింది ఆమె స్నేహితులకి.

స్కూలు ఫైనలు పరీక్షలో ఘనంగా విజయం పొందడంతో లలిత కాలేజీ చదువుకొరకు యేర్పాట్లు జరిగాయి. మొదటనుంచీ సనాతనాచార సంప్రదాయ సిద్ధమైన వారి కుటుంబంలోని కొందరు వయోవృద్ధులు ఈ విషయంలో పరంధామయ్యగారిని మంద

ర్యాలి సూర్యనారాయణ

లించడానికి ప్రయత్నించారు. దానికి ఆయన ఒక మందహాసంచేసి "పోనీయండి, చిన్నపిల్ల సరదాపడుతోంది. చదువుకుంటే మాత్రం అది ఊళ్ళేలాలా ? ఉద్యోగం చేయాలా ? అయినా నాకేమంతమంది ఉన్నారని. అమ్మాయి అయినా, అబ్బాయి అయినా మా లలితేకదా !" అని సమాధానం చెప్పేవారు.

కాలేజీలో చేరిన లలితకి ఆ జీవితం మొదట్లో ఉత్సాహంగానే ఉండేది. కాని క్రమేణా విద్యార్థినులపట్ల—అందులోనూ కొంచెం అందంగా ఉన్న విద్యార్థినులపట్ల విద్యార్థులు ప్రవర్తించేతీరు ఆమెకి కొంతబాధ కలిగించింది. అర్థరహితమైన వారి యూథభావాలకి తానుకూడా గురికాక తప్పలేదని తెలిసిన తరువాత మరింత భాధపడింది. అటూయిటూ కాని భావాల బరువుతో ఆమె మొదటియేడు గడిపింది.

ఆ వేసంగిలో పరంధామయ్యగారికి పెద్ద జబ్బుచేసింది. ఇంక లలితకి కాలూచేయీ ఆడలేదు. ఏవేవో భయంకరమైన విపరీత భావాలు బయలుదేరేవి. చెప్పరాని పెద్ద భయం ఆవరించింది. కళ్లల్లో వత్తులు వేసుకుని ఆమెచేసినసేవ ఫలితంగా ఆయన మళ్లీ మామూలు మనిషి కావడానికి నెలలు పట్టింది.

ఆతరువాత కొన్నాళ్లకి ఒకరోజున పరంధామయ్యగారు హడావడిగావచ్చి లలితని ముస్తాబుకమ్మనీ, ఎవరో చూడడానికి వస్తున్నారనీ చెప్పారు. అర్థంకాక తండ్రి ముఖంలోకి చూసింది లలిత.

"ఏంచేయను తల్లీ ! మొన్నటిలాగే మళ్లీ యేదైనావచ్చి ఈ ప్రాణం కాస్తా గుటుక్కుమంటే నీగతేంగాను ? ఏదో నా కాలూ చెయ్యీ తిన్నగా ఉన్నప్పుడే నిన్నొక అయ్యచేతులో పెట్టేస్తే నా భాధ్యత తీరిపోతుంది." అని అన్నారు పరంధామయ్యగారు.

"ఇప్పుడేమంత తొందర వచ్చింది నాన్నా! నా చదువైనా పూర్తికాలేదు కదా!" అని అడ్డు చెప్పింది లలిత. బలీయమైన ప్రవాహంలో కొట్టుకుపోతూ గడ్డిపోచనైనా ఆధారంచేసుకుందామని ప్రయత్నించే అసహాయుని ఆరాటం కనిపిస్తోంది ఆమె ధోరణిలో. పరంధామయ్యగారు,

"దానికేం అడ్డమ్మా? పెళ్ళి అయ్యాకనే చదువు పూర్తిచేసుకోవచ్చు. ముందు ఈ భారం తీరితే—" అని అనబోతూంటే మధ్యలో అడ్డువచ్చి, లలిత "నేను నీకు అంతభారం అయ్యానా నాన్నా!" అంది డగ్గుత్తికతో. ఆ ప్రశ్నవిన్న పరంధామయ్యగారు, వేటకాని అమ్ముగ్రుచ్చుకున్న వృద్ధ

★ ఎడారిలో ఎండమావులు ★

సింహాంలా గిలగిల లాడిపోయారు. తన బిడ్డ తనకే బరువా? ఏమని సమాధానం చెప్పడం? విచారమూ, బాధా కలగాపులగం అయి ఆయన మనస్సును క్షోభింప జేశాయి. ఒక్క క్షణం తమాయించుకుని, బరువుగా అన్నారు "పిచ్చి తల్లీ! దానికి నేనేం చెప్పగలనమ్మా! కాని! మన సమాజ నియమాలని ఎదిరించే స్థాయిలోకి రాలేదమ్మ మనం ఇంకా. ఎంత నాగరికత, విజ్ఞానం ఉన్నా ఎంత ఐశ్వర్యం, అధికారం ఉన్నా పురాతన సంప్రదాయాలనీ, సంఘవ్యవస్థనీ ఒక్కసారి తిరస్కరించి తిరగడం ఎవరితరమూ కాదు. ఎదిగిన ఆడపిల్లకి పెళ్ళిచేయకుండా జాప్యం చేసిన యే తండ్రినీ ఈ సంఘం క్షమించదు. అది ఇరువురకూ కూడా వాంఛనీయం కాదమ్మా! మన ఆశలు ఆశయాలు సంఘానికి అనుగుణంగా రూపొందించుకున్నప్పుడే సుఖం. నీ వింకా చిన్న పిల్లవి. ఈ విషయాలు నీ కప్పుడే అర్థంకావులే."

తండ్రి వెళ్ళిన వైపే చూస్తూ నిలుచుండి పోయింది లలిత. "ఏమిటీ అవాంతరాలు" తానేదో పెద్ద చదువులు చదవాలని యేదో అయిపోవాలనీ అనుకుంటే ఇదేమిటి? అన్నీ తెలిసిన నాన్నగారు అలా అంటున్నారు. నాన్నగారికి తాను ఎగురు పోతుందేమో నన్న భయం ఒకవంకా, తానేంచేయ లేక పోతున్నాననే ఆవేదన ఒక ప్రక్కా ఆమెకి శాంతిలేకుండా చేశాయి.

౨

పెళ్ళి అయిపోయిన తరువాత నాన్న గారు చేసిన పనికి అంతగా యిదవ్వక్కర లేదనిపించింది లలితకి. అత్తవారింట్లో తన్నందరూ ఆదరంగా చూస్తున్నారు. ఐశ్వర్యం లోనూ వారు తన పుట్టింటి వారికి తీసిపోరు. అన్నింటికంటె ముఖ్యమైంది-తన ఆశలకి సరిపోయిన భర్తలభించడం. పెద్దచదువు, చదువుకు తగ్గ హోదా, చక్కటి సంస్కృతీ అన్నీ ఉన్నాయి. పైగా తననెంతో ఆదరిస్తాడు. అంతేకాదు ఆ యింటిలో అంతా కాదో, గొప్ప విద్యావంతులు కావడంవల్ల ఆ యింటి వాతావరణమే విజ్ఞానవంతంగా ఉంటుంది. అందువల్ల పై చదువులగురించిన తనకోరిక అణగారి పోనక్కరలేదని ధైర్యం కలిగింది.



పరిచయస్తులదగ్గర అత్తగారు తననీ, తన సంస్కారాన్నీ పొగడినపుడు ఎంతో సంతోషించింది. తన వాంఛలు ఎండమావులు కావని ఆమెకి నమ్మకం కలిగింది.

పెళ్లి అయిన తరువాత అత్తవారు అభ్యంతరం తెల్పకపోవడంవల్ల ఆ మరుసటి సంవత్సరం చదువు పూర్తి చేసింది. ఇంక మామూలు ధోరణిలో యం. బి. బి. యస్. చదువు ప్రస్తావన వచ్చింది. నలుగురూ నాలుగూ అని చివరికి మొండిచెయ్యి చూపించారు. లలితకి ఎంతో అభిమానం వేసింది. "పెళ్ళి అయ్యాక కూడా చదువులకని కాలేజీలకి వెళ్లడం బాగుండదు" అనీ, "ఈ చదివింది చాలదూ, యింకేం చదవాలి" అనీ, "యం. బి. బి. యస్. అంటే మాటలతో పనా" అనీ యింట్లో వాళ్లందరూ అంటూంటే తన భర్త యేం మాట్లాడడేమని ఆమె యెంతైనా యిదయ్యేది. చదువుకున్నవారు కూడా యిలా అంటే అర్థం ఏమిటి? వీళ్లి చదువు, సంస్కారం ఎందుకు? అందుకేనేమో నాన్నగారు సమాజం ఇంకా ముందుకు పోలేదన్నారు. ఎంత చదువుకుందామనుకున్నా ఈ పరాయి యింట్లో అజ్ఞాత బలీయశక్తులేవో తనని అడ్డగిస్తున్నాయి. "కాదు. కూడదు. తప్పకుండా చదువుతాను." అని గట్టిగా చెప్పలేకపోతుందేం తాను? ఏమిటీ బలహీనత? ఏవిటీ సాంఘిక నియమాలు? ఏం తోచక తండ్రికి జాబు రాసింది. ఆయన మామూలు ధోరణిలోనే సలహాయిస్తూ, అంతగా చదవాలని ఉంటే బి. ఎ. ప్రైవేటుగా కట్టమని రాశారు. ఇదీ బాగానే ఉంది. చదువు మానుకోనూ అక్కరలేదు, పెద్ద చదువులు చదివినట్టూ అవుతుంది, అని తృప్తి పడింది. శక్తి ఉడిగి పోతున్నప్పటికీ విజయకాంక్షతో పోరాడే సైనికునిలా ఆ సలహానే ఆచరణలో పెట్టడానికి పూనుకుంది. అందుకు అత్తింటివారేమీ అభ్యంతరం పెట్టకపోవడం ఒక సుగుణం!

తీరా బి. ఎ. పుస్తకాలూ అవీ తెప్పించి చదవడం మొదలుపెట్టిన కొన్ని రోజులకే భర్తకి ఏదో ఉద్యోగం వచ్చి వేరుగా కాపురం పెట్టవలసి వచ్చింది. అది ఒక విధంగా లాభంగానూ, ఒకవిధంగా యిబ్బంది గానూ తోచింది లలితకి. తన ఆశయాలు నిర్భయంగా ఆచరణలో పెట్టే అవకాశం వచ్చింది—ఒక లాభం. పనిపాటల విషయంలో పెద్దదిక్కు ఉండదు. అన్నీ తనే చేసుకోవాలి. చదువు సాగుతుందో, సాగదో అని యిబ్బంది. అయినప్పటికీ, యింటి పనులతో సతమతమవుతూనే, పట్టుదలగా చదివి బి ఎ. లో ఒకటి రెండు భాగాలు పూర్తి చేసింది. ఆమె దీక్షకి అందరూ మెచ్చుకున్నారు. ఒక విధమైన విజయగర్వం ముఖంలో వెలిగింది. మూడో భాగం కూడా పూర్తి చేసేస్తే, ఒక డిగ్రీ తెప్పించుకుని, తాను కూడా ప్రయోజకురాలి ననిపించుకోవచ్చు. తన ఆశలు ఈ విధంగానైనా ఫలిస్తాయి. పోనీ అదే చాలు. అందుకని మరింత గట్టిగా చదవడం మొదలుపెట్టింది.

కాని ఈ వ్యామోహంలోపడిన లలిత కొన్ని జీవిత సత్యాలని మరచి పోయింది. స్త్రీ ప్రకృతి విచిత్రమైనదనీ, తత్ఫలితాలు మానవాతీతాలనీ, కొన్ని కొన్ని సమయాల్లో అనుకున్నదానికి అంతా వ్యతిరేకంగా జరుగుతుందనీ ఆమె మరిచిపోయింది. అందులోనూ దాంపత్య జీవితం గడుపుతున్న స్త్రీ అన్నీ అనుకున్నట్టు చేయలేదని తరవాత తెలిసి వచ్చింది. పట్టుదలగా చదివినా పరీక్షకి వెళ్లడానికి వీలులేకపోయింది లలితకి. పురిటి రోజులు దగ్గరికి వచ్చాయి. సాహసించలేకపోయింది. ఈనగాచి నక్కలపాలు చేసినట్లయింది తన జీవితంలో యేమిటో అన్నీ అడ్డంకులే! తాను నిర్మించదలచిన సౌధాలు ఆకాశంలోనే ఉండిపోతాయి కాబోలు. ఇంక ఈ బి. ఎ. పూర్తిచేయడం ఎప్పటికీ పడదేమో కూడా!

అయినా దీక్ష వదలలేదు. ఎలాగో ఆ బి. యె. అయినా అనిపించుకుంటే...ఒక వెర్రి ఆశ యేడిపిస్తోంది. ఒక ప్రక్కన చంటిపిల్లవాడిని చూసుకోవాలి; యింకో ప్రక్క గృహ విషయాలు–చదవగలనా అనే సందేహం కూడా కలిగేది. అలాగే తంటాలుపడి చదివింది. పరీక్షలకివెళ్లి రాసింది. ఒకరకంగా తృప్తి పొందింది. కాని తీరా ఫలితాలు ప్రకటించిన తరువాత ఆ తృప్తి నిరాశగా మారిపోయింది. దాంతో మరింత క్రుంగిపోయింది. ఆశ అంతకంతకీ అణగారిపోతోంది. ఆ తరవాత ఒకటొకటే అవాంతరాలు వచ్చేశాయి. తండ్రి పోవడంతో ప్రోత్సహించి ధైర్యం చెప్పేవారు లేకపోయారు. ఇంటికి పెద్దకోడలు అవడంవల్ల ఏళ్ళు గడిచినకొద్దీ బాధ్యతలు ఎక్కువౌతూ వచ్చాయి. రకరకమైన వ్యాపకాలతో మనస్సు నిండిపోయేది. చదువును గురించిన ఆలోచనే వచ్చేదికాదు. ఈ విధంగా పరాజితలైన ఎందరో ఆడపిల్లల్లో తానుకూడా ఒకత్తె అయిపోయింది.

కాని ఎవరేనా చదువునే పిల్లల్ని చూసినప్పుడు, యం. బి. బి. యస్. అనే బోర్డు చూసినప్పుడూ, మానుతున్న గాయం రేగినట్టు గిలగిలలాడేది లలిత మనస్సు. అయితే ఏం లాభం? పిపాసార్తితో ఆత్రంగా ఎడారిలో ఎండమావులవైపు వెర్రిగా పరుగులెత్తే బాటసారికి ఎప్పటికైనా దాహశాంతి కలుగుతుందా? ★


అసంప్రేక్ష్యకారిత్వము... పంచతంత్రము ...అయిదవ భాగము



... సేయరచన ...
నండూరి. రామమోహనరావు
బొమ్మలు.. బాపు



అభిమాన పుస్తకం



రావి కొండలరావు

మవుంట్ రోడ్డులోవున్న బుక్ షాపులో అరగంట సేపట్నుంచి ప్రదక్షిణాలు చేస్తున్న జోగారావుకు కొద్దిగా ఆకలివేసినట్టు తోచింది. పొట్టమీద ఓసారి చేత్తో రాసుకున్నాడు. ఫూ—ఆకలికేం—దాని వేళ ఐదేప్పటికి అది సిద్ధపడిపోతుంది!

జోగారావు ప్రదక్షిణాలు మళ్ళీ ప్రారంభించాడు. ఈ పుస్తకాలన్నీ ఒఖసారిగా చదివేయాలన్నంత కోరిక కలిగింది. ఐతే, ప్రస్తుతానికి అట్టలు చదువుతూ తృప్తి పడ్డాడు! 'చాలా సేపయింది, ఇక బయట పడదామా' అనిపించి, నూటఒకటో ప్రదక్షిణం పూర్తిచేసేదామన్నట్టుగా కాలు కదిపాడు. ఇంతసేపూ తనకు కనిపించక, దాక్కునివున్న తన 'అభిమాన రచయిత' గారి పుస్తకం ఛటాలున జోగారావు కంటపడ్డది. ఆగి—పుస్తకం బయటకులాగి—'జన్మతరించింది' అనుకున్నాడు. ఈ పుస్తకం కోసం ఎన్నాళ్ళుగా తను తపస్సు చేస్తున్నాడో లెఖ వేసుకున్నాడు. భేష్! పేజీలన్నీ ఒఖసారి ఆ చివర్నుంచి ఈ చివరకు తిరగవేస్తూ అక్కడక్కడ కొంత కొంత చదివాడు' కాస్సేపటికి ఈ పుస్తకం తనది కాదన్న సంగతి తెలుసుకుని, అటూ యిటూ చూసి తను బుక్ షాపులో పుస్తకాల మధ్య వున్నట్టు తేల్చుకున్నాడు జోగారావు. ఈ పుస్తకం కాపీలు ఇంకా ఎన్నివున్నయోనని అక్కడ చూశాడు—ఇంకేమీ కనించలేదు. ఇదికొనటం ఎట్లా అని ఆలోచుస్తూనే దాన్ని దాని స్థానంలో వుంచేసి, నిట్టూర్చి దానికేసే చూస్తూ ప్రేయసిని వదిలివెళ్లుతున్న ప్రియుడిలాగా మొహం పెట్టి బయటకు నడిచాడు!

జోగారావుకు ఆకలి మళ్ళీవేసింది. నెలాఖరు రోజులు—భోజనపు టిక్కట్ల పుస్తకం మూడురోజుల క్రిందటే ఆఖరయిపోయింది రోజుకు మూడేసిసార్లు తిన్నాడని కాదు—అతిథులపట్ల జోగారావు చూపించిన అమిత ఆదరణవల్ల! ఇంకా మూడునాలుగు రోజులు గడిపితేగాని ఆ ఒకటో తేదిరాదు—ఒకటో తేదీదాటి రెండు మూడు రోజులయితేనే గాని ఆ జీతంరాదు! జోగారావు చెయ్యి జేబులోకి పోనిచ్చి పాత ఉత్తరం ఒకటి లాగాడు. ఆ మడతలో చూడగా అతనికి మూడు రూపాయినోట్లు కనిపించినై. ఈ మూడు నోట్లతోనూ, మిగిలిన కాస్త చిల్లరతోనూ వారంరోజులు ఎట్లా గడపటమో అతని వూహకందలేదు!

జోగారావుకు పుస్తకాలమీద అమిత గౌరవం. గౌరవం అనేమిటి—కొన్ని కొన్ని పుస్తకాలంటే అతనిభాషలో "చచ్చిపోతాడు!" ఈరోజు తను చచ్చిపోవాల్సిన ఈ పుస్తకం కనిపించింది కాబట్టి ఇకచావక తప్పదనుకున్నాడు. ఈ పుస్తకంకోసం జోగారావు ఆరేళ్లుగా బాధపడుతున్నాడు. ఎంత మందినో అడిగాడు—ఎన్ని గ్రంథాలయాలో తిరిగేశాడు—ఎన్ని పుస్తకాల షాపుల్లోనో ప్రదక్షిణాలు చేశాడు—ఐతే ఎంచాతో ఇన్నాళ్లుగా అతని కంటబడని పుస్తకం ఇవాళ కనిపించింది. పదిరోజుల క్రిందట అడిగితే షాపువాళ్లు లేదన్నారు. ఈలోగా వచ్చిందన్నమాట!

మౌంటురోడ్డులో కార్లూ బస్సులూ హడావుడిగా తిరుగుతున్నై. పెద్ద పెద్ద 'క్యూ'లలో నించుని త్వరత్వరగా బస్సుల్లో ఎక్కేస్తున్నారు జనం! జోగారావుకు నవ్వొచ్చింది. "వీళ్ళందరికీ ఏమిటో ఇంత అర్జంటు పన్లు?" అనుకున్నాడు. ఆ కారు నడుపుతున్న మనిషికి ఏంపనో తెలీదుగాని, అరవై మైళ్ళఖాటిలో పరుగెత్తి పారిపోతున్నాడు! ఏమయితేనేం - తనకుమాత్రం అర్జంటు వ్యవహారాలేమీ లేవు—అందుకు తను అదృష్టవంతుడు!

ఇంతసేపూ యీ బస్సుల గోలలో జోగా

రావుకు ఆత్మారాముడి ఏడుపు వినిపించలేదు. ఈ ఆత్మారాముడు గాడు "అంగో లక్ష్మణా!" అని పలకరించి, హోరెత్తి ఏడవటం జోగారావు చెవులారా విన్నాడు. వాడు 'అన్నమో రామచంద్రా' అన్నట్టు లేదుగాని, 'కాఫీయో జోగారావా' అన్నటుగా అనిపించి, హోటల్లో దూరి, కాస్త టిఫినూ కాఫీ సేవించి చెయ్యి తుడుచుకోటానికి రుమాలు కోసం జేబులు తడిమాడు— లేదు! తడిచేతిని పాంటు జేబులోకి ఒక్కసారి పోనిచ్చి ఆ జేబులోనే 'తడి'ని తుడిచేసుకుని బయటపడ్డాడు!

మళ్ళీ జోగారావుకు ఆ పుస్తకం గుర్తొచ్చింది. దాన్ని విడిచిపెట్టి ఎక్కడికి పోవటమో అతనికి అర్థంకాలేదు. ఇన్నేళ్ళుగా తను చేసిన తపస్సు ఫలించినా—ఫలితాన్ని పొందటానికి కొంత ఖర్చు చెయ్యాలి. ఆ పుస్తకం ఖరీదు ఎంతో ఏం చావా! పోనీ వచ్చే నెల డబ్బు రాగానే కొందామనుకున్నాడు. ఐతే అంతవరకూ అక్కడే అది తనకోసం కాచుకుని కూచుంటుందని నమ్మకం ఏమిటి?—ఈలోగా ఎవడన్నా కొనేయొచ్చు. 'నేను దాన్ని కొంటాను అంతవరకూ ఉంచ'మని చెప్పేసిరానా— అనుకున్నాడు. పుస్తకాలవాడు ఏం నవ్వుకుంటాడో!

జోగారావుకు కాలు ఎటూ కదలటంలేదు. ఈ పుస్తకం ఖరీదు రూపాయిన్నరో రెండో వుంటుంది. పోనీ, కొనేద్దామా అంటే వారంరోజులు తను హోటలుగుమ్మం ఎక్కటానికన్నా నోచుకోడు!

అరగంటసేపు అక్కడే నించుని ఆలోచించాడు. ఐతే ఏంది— కొనేద్దాం! ఈ రోజుకు కాస్త చిల్లర మిగుల్తుంది కదా—రేపు తెల్లవారే లేచి ఎవడి జేబన్నా వెదకవచ్చు! ...ఎవడిస్తాడు— అందరికీ నెలాఖరేగా అని మళ్ళీ అనిపించింది. నెలాఖరయితే మాత్రం ఆ మాత్రం ఒకటో రెండో దగర పెట్టుకోకుండా వుంటాడా ఎవడైనా! ఈ మధ్య చాలా రోజులుగా తను ఎవరి దగ్గరా అప్పు తీసుకోలేదు— అది ఇప్పుడు పనికిరావొచ్చు!

బుక్ సెంటర్‌లోకి మళ్ళీ ప్రవేశించి, ఆ పుస్తకాన్ని నెమ్మదిగా బయటకు తీసి "ఎంతకి?" అని కనుక్కున్నాడు అక్కడున్న షాపు అతన్ని.

"మూడూ పన్నెండణాలు"

జోగారావు చెయ్యి యంత్రంలాగా పని చేసింది. ఛటాలున ఆ పుస్తకాన్ని ఆ స్థానంలో వుంచేసింది! మారుమాట చెప్పకుండా బయట పడాడు జోగారావు. వీడి తస్సాదియ్యా-మూడూ పన్నెండణాలా! తన దగ్గర వున్న మొత్తం అంతా కలిపినా అంత వుండదే! తెగించి కొందామని వెళ్ళినా. ఇదేం ఖర్మ ఇట్లా పరిణమించింది! కానీ—'ప్రాప్తం' అనేది వుండాలని సర్ది చెప్పుకుని ఇంటికేసి నడిచాడు జోగారావు.

ఏమిటో అతని మనస్సు ఇంకా ఆ పుస్తకం మీదే వున్నది. ఎంత తప్పించుకుందామన్నా తప్పటంలేదు. ఎట్లాగన్నా కొనెయ్యాలి—ఈ రాత్రి చదివెయ్యాలి—అప్పుడుగాని నిద్రపోరాదు!

జోగారావు ఇంటికి చేరుకుని 'అప్పుడే వచ్చానా' అనుకుని ఆలోచించాడు. తన పరధ్యానంవల్ల దారిలో నాలుగు బస్సులూ రెండు కార్లూ తనను తొక్కేయాలని ప్రయత్నించి, తీరా దగ్గరకొచ్చి భయపడి అమాంతం ఆగిపోయివి— అవిచేసిన 'ధ్వని' వల్ల తను మళ్ళీ ఈ లోకంలో పడుతూ తప్పించుకుంటూ 'పేవ్ మెంటు' ఎక్కుతూ వచ్చాడు! తనను తొక్కేయాలని పెద్ద పెద్ద బస్సులే ప్రయత్నించినై—ఇదొక లెఖా! అనుకున్నాడు. ఐనా తను దారంతా ఇంత పరధ్యానంగా వుండటానికి కారణం ఆ పుస్తకమే! ఇదేదో తనను వొదిలేట్టులేదు!

బట్టలన్నా మార్చుకోకుండా అట్లాగే క్రిందనే విశ్రమించాడు. అతనికి ఏమీ తోచటంలేదు. ఎంత వూరుకుందామన్నా ఆ పుస్తకమూ—ఆ రచయితా అతని దృష్టిని తప్పించలేకుండా వున్నారు.

ఏదో ఆలోచించి జోగారావు ఛటాలున లేచాడు. తారురోడ్లమీద నడకవల్ల అరిగిపోయి, మధ్యన రూపాయంత రంధ్రంతో శోభిల్లుతున్న చవకరకం చెప్పుల్లో కాళ్ళు దూర్చాడు. వెధవది! ఎన్నాళ్ళనుంచో అనుకుంటున్నాడు తను కొత్త చెప్పులు కొనుక్కోవాలని. సరే—ఇప్పుడేనా ఏమిటి ఈ వూహకూడా! వెధవ చెప్పులు ఎప్పుడు కొనుక్కుంటే కాదు—తను చదవాల్సిన పుస్తకం కొనటానికే డబ్బులు లేక బాధపడుతూంటే చెప్పుల కొచ్చింది తొందర!

చెప్పు మధ్య వృత్తాకారాన్ని పెంచుకుంటూ దడదడా నడుస్తూ—పావుగంటలో ఒక ఇల్లు చేరుకుని జోగారావు తలుపు తట్టాడు. "ఎవరు?" అన్నది లోపల్నుంచి ఒక కంఠం.

"విశ్వనాథం వున్నాడా అండీ?" అన్నాడు జోగారావు.

"వున్నాడు రండి" అన్నది గొంతు.

జోగారావు లోపలకు ప్రవేశించి విశ్వనాథాన్ని కలుసుకున్నాడు.

"ఏమిట్రా ఎండలో వచ్చావ్? కూచో" అన్నాడు విశ్వనాథం.

"కూచోటానికి టైమ్ లేదురా, నీతో అర్జెంటుగా మాట్లాడాలి."

మాట్లాడమన్నాడు విశ్వనాథం. తనకు అత్యవసరంగా కనీసం రెండు రూపాయలన్నా కావాలనీ, జీతంరాగానే వెంటనే తీర్చేస్తాననీ, ఇంకెప్పుడూ ఇట్లా హఠాత్తుగా వచ్చి డబ్బు అడగననీ ప్రాధేయపడాడు జోగారావు.

"రెండు రూపాయలే!" అని ఆశ్చర్యపడ్డాడు విశ్వనాథం.

"బాబ్బాబూ... నీపుణ్యం వుంటుంది" అని బ్రతిమాలాడు జోగారావు. పదినిమిషాలు ఆలోచించి, ఒక రూపాయినోటూ ఇంకో రూపాయి చిల్లరా కలిపితెచ్చి జోగారావు చేతిలో పోసి "సాధ్యమయినంత త్వరగా ఇస్తే కృతజ్ఞణ్ణి!" అన్నాడు ఆపద్బాంధవుడు. దానికి సమాధానం చెప్పే స్థితిలో లేని జోగారావు ఆ డబ్బులు లెఖన్నా చూసుకోకుండా, చెప్పుల్లో కాళ్లు దూర్చి పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ బుక్ షాపులో పడ్డాడు. ఈలోగా దాన్ని ఎవడైనా కొనేశాడేమోనని షాపులోకి అడుగు పెడుతూనే ఆ స్థానంలోకి చూశాడు. అదక్కడే వున్నది! దివ్యమైన భవంతులు నాలుగూ,

★ అభిమాన పుస్తకం ★

పాతిక ఎకరాల భూమీ దానం పుచ్చుకుంటున్నంత సంతోషంగా ఆ పుస్తకాన్ని కొని, జాగర్తగా అట్ట తిరగేసి, ఆ కాయితం వదిలి మరో కాయితం తిప్పి జేబులోంచి కలంతీసి నీటుగా తన పేరు అక్కడ రాసుకుని, దానికేసి ఆప్యాయంగా చూస్తూనే తన కలాన్ని జేబులో పెట్టుకుని, సగర్వంగా పుస్తకాన్ని రెండు చేతులతోనూ గుండెలకు హత్తుకుని రాజ్యాలను జయించిన మహారాజుకు మల్లే ఠీవిగా అడుగులు వేస్తూ బుక్ షాపు దాటి బయటకొచ్చాడు జోగారావు! ఇహ అతనికి ఈ ప్రపంచంతో నిమిత్తం లేదు - ఈ కార్లూ బస్సులూ ఎక్కడకు పోయినా అతనికి అవసరం లేదు-ఆరేళ్లుగా కావాలనుకుంటూ తపించుకుపోతున్న పుస్తకం ఇవాళ అతని చేతిలోపడది. అది అతని స్వంతం-చేతులారా డబ్బుపోసి అతను కొనుక్కున్న వజ్రాలహారం!

ఆ పుస్తకం ఎంత త్వరగా చదివేయటమా అని జోగారావు తహతహలాడాడు. చదివేయటమేకాదు-దీన్ని జాగర్తగా బీరువాలో పెట్టి తాళంవేసి, ఆ తాళంచెవి భద్రంగా మొలలో దోపుకోవాలి!

చరచరా నడుస్తూ ఇంటికేసిపోతున్న జోగారావుకు ఓ ప్రాణస్నేహితుడు ఎదురై పలకరించాడు—

"ఎక్కణ్నుంచోయ్?" అనే ధోరణిలో కళ్ళెగరేస్తూ.

"పుస్తకాల షాపునుంచిలే" అన్నాడు జోగారావు సగర్వంగా.

"ఏదో కొన్నట్టున్నావే—ఏదీ?" అని తీసుకుని చూశాడు స్నేహితుడు.

"జాగర్త—కొత్తపుస్తకం!" అని హెచ్చరిస్తూనే తన కష్టార్జితాన్ని అతని చేతిలో పెట్టాడు.

అరెరే—ఈ పుస్తకం వుందన్న మాట" ఎన్నాళ్లనుంచో దీనికోసం చూస్తున్నాను!

"నువ్వానా?" అన్నాడు జోగారావు.

"ఏం—నేను కాకపోతే ఇంకెవరు?... సరేగాని నువ్వుకొ నేశావా?"

"ఆహా!"

"ఏమీ అనుకోకు-ఆడబ్బిచ్చేస్తాను నాకిచ్చెద్దూ"

"నేనే ఇవ్వటం ఏమిటి—ఆ డబ్బిస్తే ఆ షాపువాడే ఇస్తాడు—బిల్లు కూడా మరీ రాసి!"

"సరేలే...బిల్లు ఎవడికి కావాలి గాని చదివేశావా?"

"ఇప్పుడింకా కొంటున్నానయ్యా — తాజా సరుకు. వస్తువు చూడగా తెలియటంలా?" అన్నాడు జోగారావు సంతోషంగా.

"ఒక్క విషయం ... ఏమీ అనుకోకు" అని నసగటం మొదలెట్టాడు ప్రాణ స్నేహితుడు.

"ఏమిటి"?

"నేను రేపు పొద్దున్నే వూరెళ్ళుతున్నాను."

"మీ వూరా?"

"మా వూరే. మళ్లా నెలకుగాని రాను. అంచాత...నే చెప్పేదంతా విను. నాకీ పుస్తకం మీద ఇంతా అంతా అభిమానం కాదు. దీనికోసం చాలా శ్రమపడ్డాను. అటువంటిది ఈ నాడు నా ప్రాణస్నేహితుడి దగ్గర లభించింది. ఇది నీ స్వంత పుస్తకం. ఎప్పుడయినా నువ్వు చదువుకుంటావు నువ్వు నన్ను పూర్తిగా నమ్ము. ఇప్పుడిది నాకిచ్చావంటే, ఈ రాత్రిలోగా చదివేసి పొద్దున్నే బండెక్కిపోతాను. నేను మళ్లీ వచ్చాక పోనీ చదువుకుందామంటే నేను వుండలేను. ఈ క్షణానే చదివేద్దామన్నంత కోరిక కలుగుతోంది. నువ్వు పొద్దున్నే నా రూముకు వచ్చావంటే, ఈ రాత్రిలోగా చదివేసి నా రూమ్ మేట్ చలపతికి వప్పగించి జాగర్తగా నీ కిచ్చేయమని చెబుతాను. లేదూ-మీయింటికే తీసుకొచ్చి అతను ఇచ్చేస్తాడు. నెల్లాళ్లపాటు నేను హాయిగా వుంటాను. కాదనకు!" అని దీనంగా ఉపన్యాసం ఇచ్చాడు ప్రాణస్నేహితుడు. ఈ ఉపన్యాసం విన్నాక జోగారావుకు మాట రాలేదు. తను ఇంకా పుస్తకం కొంటున్నాడు - పేరురాసిన ఆ సిరాతడి ఇంకా ఆరనేలేదు-అప్పుడే ఎరువా?—

"నేను చదవాలి" అన్నాడు జోగారావు మొండిగా.

"చదవొద్దని నేనన్నానా? చదువు. నేను వెళ్ళిపోతున్నాను గదయ్యా - నువ్వెట్లా ఇచ్చావో అట్లాగే తెల్లారేసరికి నీ చేతిలో నీ పుస్తకం వుంటుంది. నా మాటమీద ఆ మాత్రం నమ్మకం వుంచు. బాబ్బాబూ... నువ్వే దీని యజమానివాయె!"

జోగారావు సందిగ్ధంలో పడ్డాడు. కొత్త పుస్తకాన్ని తనింకా చదవనిదాన్ని అసలు ఇట్లా అడగటానికి ఈ స్నేహితుడికి మొహమాటం ఎందుకడ్డలేదోనని వూహించసాగాడు. అదిగాక, ఈ పుస్తకాలతో వున్న చిక్కేయిది! పుస్తకం ఇవ్వకపోతే "పుస్తకానికే ఇంత ఇదయిపోతావా" అనేస్తారు. ఇస్తే అది తిరిగిరాదు! ఇట్లా తన పుస్తకాలు ఎన్ని పరహస్తాల్లో గతించిపోయినవో్యా లెఖలేదు. వాటితోపాటు ఇది పోతేనో! అమ్మయ్యో!

"నేనివ్వను!" అన్నాడు జోగారావు ఏమవుతుందో చూదామని.

"ఇవ్వకపోతే ఈ నెలంతా నేను ఉసూరని ఏడవాలి. నీ పుణ్యం వుంటుంది. మరి అంతమనిషిని నమ్మవేం?...నాలుగైదు నెలల కిందట ఐదు రూపాయలు కావాలనీ నాలుగు రోజుల్లో ఇస్తాననీ అంటే నేను నీకు ఇచ్చాను కానూ? నిన్ను నమ్మి ఇచ్చానంటావా? నమ్మకం వుండాలోయ్ బ్రదర్...నీకేం భయంలేదు. అది తెల్లారేప్పటికి నీ చేతిలో వుంటుంది." అని అంటూనే జోగారావు చేతిలోంచి ఆ పుస్తకాన్ని తీసుకున్నాడు. జోగారావు ఇక అడ్డుపెట్టలేక పోయినాడు. ఆనాటి ఐగురూపాయలలో ఈ పుస్తకాన్ని ముడిపెట్టగానే అతనికి మనస్సులో అదోలా

అనిపించింది. ఇంతలో వుంటారు ఈ స్నేహితులు!

"రేపు పొద్దున్న నీ రూమ్‌కే వచ్చి తీసుకుంటాను. చలపతితో చెప్పు. అతని చాత నువ్వేం పంపనక్కర్లేదులే!" అన్నా జోగారావు నిరుత్సాహంగా.

"థాంక్స్. మరేం అనుకోకు. పుస్తకం మీద మమకారం అటువంటిది!"

పుస్తకాన్ని తీసుకొని ప్రాణస్నేహితుడు పోతూంటే జోగారావు ఏడుపుమొహం పెట్టాడు. ఆనాడు సత్యవంతుడి ప్రాణాలు యముడు తీసుకు పోతున్నప్పుడు, సావిత్రి మొహంలో కనిపించిన దీనత్వం, వ్యధ ఈనాడు జోగారావులో మళ్లీ కనిపించినై!

జోగారావుకు ఒళ్ళు కంపరమెత్తింది. ఎండలో బయల్దేరి, వాడి ప్రాణంతీసి డబ్బు పుచ్చుకుని మోజుపడి ఆప్యాయంగా ఈ పుస్తకం కొనుక్కుంటే - ఏ దేవడో దారిలో సైంధవుడల్లే అడ్డుపడి తన చేతుల్లోంచి లాక్కుపోతాడా? వాడికేమిటీ హక్కు గాని మీద? ఐతే తనెందుకు కొనుక్కున్నట్టు?...అతని మొహంబాగా ఎరుపెక్కింది. ప్రాణస్నేహితుడు వెళ్లేదారికేసే తీవ్రంగా చూస్తూ, "ఆపుస్తకం నాది—నేనివ్వను!" అని గట్టిగా అరిచాడు. బస్సులూ కార్ల ధ్వనిలో ఆమాట ఎవరికీ వినపించలేదు. వినిపించుకోవాల్సిన ఆ ప్రాణస్నేహితుడు ఎటువెళ్లిపోయాడో వాడకూడా కనిపించలేదు!

రాత్రంతా జోగారావు పుస్తకం గురించే బాధపడ్డాడు. గభాలున పక్కమీదలేచి కూచుని "నాపుస్తకం నేను చదవకుండా వాడెవడో తీసుకుపోవటం ఏమిటి?" అనుకున్నాడు. అతనికి పక్కనిండా తేళ్ళూ పాములూ ప్రాకుతున్నట్టు అనిపించింది. ఈ రాత్రేవెళ్లి తనపుస్తకం తెచ్చేసుకుంటేనో! ఐదునిమిషాలపాటు అట్లాబాధపడి చివరకు "ఖర్మ" అని నుదటిమీద కొట్టుకుని, దభీమనిపడి నిద్రపోయాడు జోగారావు!

తెల్లవారింది. రోజూకంటె ఈరోజు ముందే లేచాడు. కాలకృత్యాలు కూడా త్వరగానే ముగించుకుని, కాస్తకాఫీతాగి బయల్దేరాడు జోగారావు తనపుస్తకంకోసం. దారిపొడుగునా ఈస్నేహితులమీదా, వాళ్లు పుస్తకాలు అడిగే తీరుమీదా అతను విరుచుకు పడ్డాడు!

"చలపతీ!" అన్నాడు జోగారావు ఒక యింటిముందు నించుని.

"ఎవరది?" అన్నాడు చలపతి లోపల్నుంచి.

"నేను జోగారావును"

రమ్మని ఆహ్వానించాడు చలపతి.

జోగారావు లోపలకు ప్రవేశించేసరికి చలపతి కుర్చీలోపడుకుని తనపుస్తకమే చదువుతున్నాడు.

"ఏం జోగారావ్—తెల్లవారేసరికి దిగావే—ఏంసంగతి?" అన్నాడు చలపతి.

ఏం సంగతంటాడేమిటి వీడిమొహం—. వాడి బాబుగారి సొమ్మల్లే తన పుస్తకాన్ని అనుభవిస్తూ!

"ఆ పుస్తకం నాది!" అన్నాడు జోగారావు.

"నీదా?...ఆఁఆఁ...అవును చెప్పాడు. కాని-చాలా ఇంటరెస్టింగ్‌గా వుంది సుమా! అరవై పేజీలు చదివేశాను. ఎంతలే—ఐపోతుంది. ఇచ్చేస్తాను...దీనికోసం నువ్వు తెల్లవారేసరికి వొస్తావు అనుకోలేదు!" అని సమాధానం కోసమన్నా ఎదురుచూడకుండా పుస్తకంలో పడ్డాడు చలపతి.

జోగారావుకు మంట పుట్టింది. పెద్ద తెలిసినట్టు ప్రతీవాడూ సాహిత్యప్రియుడే ఐపోతాడు. ఇంకోడి పుస్తకం తేరగా దొరికే సరికి!

"నా పుస్తకం అది. నేనింకా చదవలేదు. నాకిచ్చేయ్ పోతాను" అన్నాడు జోగారావు.

"బావుందోయ్. మధ్యలో వుంటే ఇచ్చేయమంటావేం—కాస్సేపుకూచో... చదివేస్తాను"

హరి వీడి తెగింపు మండిపోనూ! ఏమిటీ అధికారం

"ఇపుడు కూచోను. నాకు అవతల ఆఫీసుంది. పోవాలి" అన్నాడు జోగారావు స్థాయి మార్చి.

"ఇచ్చేస్తానంటూ వుంటే మరీ ఇదయిపోతావేమిటయ్యా—ఐపోయిందుండు!" అన్నాడు చలపతి కృతి హెచ్చించి. జోగారావు ఈ అవమానాన్ని భరించలేక, ప్రాణస్నేహితుణ్ణీ ఈ చలపతినీ మనసారా మదిలో తిట్టుకున్నాడు! ఇక చేసేదిలేక—

"సాయంత్రం వొస్తాను. పూర్తి చేసేసి ఇచ్చేయ్" అన్నాడు జోగారావు మందర స్థాయిలో.

"ఓయస్. ఆమాత్రం ఓప్పుండాలిగాని, నిర్మొగమాటంగా 'ఇచ్చేయ్' అని అడిగేస్తే మేమంతా ఏమైపోవాలి?" అన్నాడు చలపతి ఇంకా తక్కువ స్థాయిలో.

ఇంకోక్షణంకూడా జోగారావు అక్కడ నించోలేదు. తన కోపాన్నంతా ఏమీ ఎరగని భూమ్మీద ప్రయోగిస్తూ చరచరా బయటకు నడిచాడు!

ఆ సాయంత్రం ఆఫీసు ఐన తర్వాత జోగారావు చలపతిని కలుసుకోలేకపోయాడు ఏదో అవాంతరం వచ్చి. రాత్రి వెళ్దామా అంటే వొళ్లంతా నొప్పిగావుండటం వల్ల బద్ధకం ఆవరించి, ఎనిమిదింటికే పడుకొన్నాడు.

మర్నాడు ఉదయం జోగారావు మళ్లీ చలపతి గుమ్మం ఎక్కేసరికి తలుపు తాళం వేసివున్నది! పావుగంటసేపు బయటనించుని ఆఫీసూ, అధికారీ గుర్తొచ్చి చలపతిని నానామాటలూ అనుకుంటూ వెళ్లిపోయినాడు!

చీకటి పడేవేళకు ఆఫీసునుంచి జోగారావు తిరిగివచ్చేస్తూవుంటే చలపతే ఎదురై పలకరించాడు. "పుస్తకం కాదయ్యా అది. ఓహోహో!" అని మెచ్చుకున్నాడు చలపతి.

"ఏదీ?-పొద్దున్నుంచి నికోసం తిరుగుతూనేవున్నాను" అన్నాడు జోగారావు.

"అవునుగాని - నిన్న సాయంత్రం వస్తానన్నావు రాలేదేం? నీకోసం ఎటూ వెళ్ళక ఇంట్లోనే కూచున్నాను."

"రాలేక పోయాను. సరే, పద పుస్తకం తీసుకుంటాను" అన్నాడు జోగారావు చలపతిని వెనక్కి తిప్పుతూ.

"సారీ జోగారావ—నిన్న రాత్రి వెంకటేశ్వర్లు నా రూమ్‌కు వచ్చాడు. వెంకటేశ్వర్లు నీకు తెలుసుగదూ?.. వాడు ఎంత చెబుతున్నా వినిపించుకోక, మళ్లీ ఇచ్చేస్తానని ఆ పుస్తకం తీసుకెళ్ళి—" అంతే!

★ అభిమానపుస్తకం ★

జోగారావుకు మిగతా వాక్యం వినిపించ లేదు. రెండు చెవుల్లోనూ హోరున గాలి వీచింది—కళ్ళు రెండూ బైర్లు కమ్మినై. మూర్ఛ వచ్చినంతపనై, తేరుకుని "నన్ను మరి చదవనివ్వరా?" అని అరిచాడు జోగారావు ఆ రోడ్డుమీద.

"ఏం చెయ్యమంటావయ్యా — వాడు వద్దంటున్నా వినిపించుకోక తీసుకు పోతేనూ?"

"ఉరి పెట్టుకోండి. బాగా దొరికారు. ఎవడిచ్చాడు నా పుస్తకంమీద మీకీ అధికారం? .. మీకు మతులు లేవూ?—మీ పుస్తకం ఐతే మీకు బాధ కలగదూ?" అంటూ జోగారావు అరవసాగాడు. ఈ అరుపులు విని జోగారావుకు పిచ్చెక్కిందని, ఆ పేవ్‌మెంటుకు అతన్ని విడిచిపెటి తన దారిన తాను పారిపోయాడు చలపతి! వెంకటేశ్వర్లు పచ్చి పుస్తకాల దొంగ! వాడి చేతుల్లో పడిందా? ..జోగారావుకు తల తిరిగిపోయింది — వెంకటేశ్వర్లు ఇంటివేపు దారి తీశాడు!

* * *

ఒకనాటి మధ్యాహ్నం మండు టెండలో కాగిపోతూ, జోగారావు పేవ్‌మెంటు మీద బస్సుకోసం నించున్నాడు. ఆకలి దహించుకు పోతున్నది. జేబులో చెయ్యిపెట్టగా కొద్దిపాటి చిల్లర కనిపించింది. ఇంకా మూడు నాలుగురోజులు గడిచితేగాని, ఒకటో తేదిరాదు — ఒకటో తేదీ దాటి రెండుమూడు రోజులయితేనే గాని ఆ జీతంరాదు: ఈ పూటకు కాఫీమానేసి ఏకంగా రాత్రికే చూసుకుందాం అనుకున్నాడు. సగం తినగా మిగిలిన వక్కపొట్లం తీసి మిగిలిన సగాన్నీ "టిఫిన్"తిని, బస్సుకోసం చూడటంలో నిమగ్నుడయ్యాడు. ఎండ పేలుస్తున్నది. మొహం ఎర్రబెక్కి, వొళ్ళంతా చెమట ముద్దయిపోతున్నది!

ఈ నెలరోజుల్లోనూ జోగారావు తన స్వంత పుస్తకాన్ని చదవనే లేదు. అది చలపతి దగ్గర్నించి వెంకటేశ్వర్లుదగ్గరకు వెళ్ళిన తర్వాత నరసింహామూర్తి దగ్గరకు ప్రయాణం చేసింది. నరసింహామూర్తి దగ్గర్నించీ శివరావుకూ, అక్కడనుంచి హనుమంతరావుకూ, ఆ తర్వాత వాడి బావమరిదికీ వాడి చేతుల్లోంచి ఎవడో వాడి స్నేహితుడి పెద్ద నాన్నగారి కుమారరత్నం చేతుల్లోకి అట్లా ప్రయాణం సాగించింది ఆ పుస్తకం! ఈ అందర్నీ ఎరుగున్నా ఎరక్కపోయినా వీళ్ళందరి గుమ్మాల్లూ జోగారావు ఎక్కుతూ దిగుతూవచ్చాడు. ఈ ఎక్కి దిగటాల్లో అతని చెప్పు మధ్యరంధ్రం బాగా పెరిగిపోయి ఒడ్డు దాటేసింది! ఆ పాదరక్షల అవశేషాలు రెండూ జోగారావు గుమ్మం ముంగువారం రోజులై కాపలా కాస్తున్నై — రాను రాను అతని మనస్సు రాయిగా మారిపోయింది. పుస్తకాన్ని తల్చుకుని శోకపరితప్త హృదయంతో బాధపడేకంటే, పూరుకోవటమే మేలనిపించింది. కాని వుండి వుండి ఆ పుస్తకం మనసులో మెరుపుల్లా క్షోభ కలిగిస్తూనే వున్నది!

ఈ బస్సుకోసం జోగారావు ఇక నిరీక్షించ లేకపోయాడు. చెప్పులు లేని కాళ్ళతో ఈ ఎండలో నడిచి వెళ్ళటం దుర్భరం అని మళ్ళీ అనిపించింది. 'కానీ—ఈ నీడ పట్టునే కాసేపు నించుందాం,' అని పేవ్‌మెంటు వెనక్కుపోయి నించున్నాడు.

ఆ పేవ్‌మెంటుమీదే పాతపుస్తకాలు ముందుపెట్టుకుని అమ్ముకుంటున్న కుర్రాడి వేపు జోగారావుచూసి, జాలిపడి, ఏదన్నా కొందామా అని దగ్గరకుపోయి వున్న పుస్తకాలను పరీక్షగా చూడసాగాడు. ఛటాలున అతని చెయ్యి ఒక పుస్తకం మీదకు పోయి దాన్ని తీసింది. ఆనాడు తను బుక్‌షాపులో కొన్న తన అభిమాన పుస్తకంయొక్క ప్రతి! కాని, ఇది బాగా నలిగిపోయి, అట్టలు వూడిపోయి వున్నది. ఐతే ఐంది — ఇదన్నా చదువుకుందామని—

"ఎంత?" అన్నాడు జోగారావు ఆత్రుతగా.

"ఎట్టణా సార్!" అన్నాడు వాడు.

"ఇంద—నాలుగు అణాలు తీసుకో!" అని వాడిచేతిలో ఒక పావలా కాసు పడేశాడు జోగారావు. ఈ పుస్తకాన్నన్నా ఎవడికీ చూపించకుండా దాచేసుకుని, తలుపులు వేసుకుని గదిలో కూచుని చదివెయ్యాలని అతను ఉద్దేశించాడు!

రెండడుగులు ముందుకువేసి, మాసిపోయి నలిగి నలిగి. చిరగటానికి సిద్ధంగావున్న ఆ పుస్తకం మొదటికాయితం తిరిగేశాడు. సరిగ్గా సన్నాళ్ళ క్రిందట బుక్ సెంటర్‌లో కష్టపడి తను ఓ పుస్తకం కొని, ఆప్యాయంగా కలంతీసి తన స్వంతపుస్తకం అనే భావనతో సగర్వంగా రాసుకున్న తనపేరు ఆ రెండోకాయితం పై భాగంలో వెలవెలబోతూ కనిపించి, జోగారావుకేసి చూసి నిరసంగా నవ్వింది! ★

నిజమాడితే నిష్ఠూరం

మునిసిపల్ గడియారం పది కొట్టింది. ఇక లాభం లేదనుకున్నాడు మూర్తి. మళ్ళీ ఆ రోజుకూడా తను ఆఫీసుకు లేటే.

"ఏమయ్యా, మూర్తీ! ఇలా ప్రతి రోజూ లేటుగా వస్తే ఎలాగ?" అడగనే అడిగాడు హెడ్డు గుమాస్తా.

ఏం సమాధానం చెప్పగలడు? నిన్న మొన్నటి దాకా స్కూలు కెళుతున్న మూర్తి, స్కూలు ఫైనలు పరీక్ష రాయగానే టెంపరరీగా వేసంకాలం సెలవల్లో ఒక గుమాస్తాగిరీలో చేరక తప్పింది గాదు. ఏదో తండ్రికి కాస్త సహాయం. చన్నీళ్ళకు వేణ్ణీళ్ళంటారే—అలాగ.

"అదేమిటండీ మరీను. అప్పుడే పనేమిటి" అని తల్లి 'ప్రొటెస్టు' చేస్తే—

"మహాలావు ఉద్యోగం చేసి ఒళ్ళు విరగ్గొట్టుకుంటున్నట్లు మాట్లాడతావేం. కాలేజీలు తెరిచేలోగా ఊరికే తిరిగే బదులు అక్కడి వెళ్ళి కూచుంటాడు. ఏదో రెండు నెలలఖాళీట. అంతమాత్రానికే అరిగి పోడులే నీ కొడుకు" అంటూ రుసరుసలాడారు తండ్రి రమణయ్యగారు. మూర్తికి గుమాస్తా ఉద్యోగం తప్పలేదు.

కాని ఈ ఆఫీసులకి ఇంత కరెక్టుగా టైముకి వెళ్ళాలని ఇప్పటికి గాని తెలిసి రాలేదు. స్కూలుకైతే హాయిగా ఇష్టమొచ్చినప్పుడు వెళ్ళొచ్చు. మొదటి పీరియడు తెలుగైతే మరీ మంచిది. అలా పెద్ద బజారు మీదుగా సినిమా హాలన్నీ చూసుకుంటూ వెళ్ళేవాడు. అలాంటి మూర్తికి ఈ ఆఫీసు "పంక్చువాలిటీ" ప్రాణ సంకటమైంది.

"దోవలో పనుండి కొంచెం ఆలస్యమైందండీ" అని నసిగాడు. నిజంగానే దోవలో ఆలస్యమైంది. హార్మోనియం పెట్టిమీద హాయిగా సినిమాపాటలు పాడుతున్న ఒక బిచ్చగాడి శ్రావ్యగానానికిముగ్ధుడై గుంపులో అలానే నిలబడిపోయి టైమైనదే తెలియలేదు. కాని అలా అని చెప్పితే ఎవ్వరూ ఒప్పుకోరని మూర్తికి స్కూలులోనే తెలిసొచ్చింది.

హెడ్ క్లార్కు ఏదో నసిగాడు.

రాత్రి భోజనాల దగ్గర తండ్రి రమణయ్య అంటీ అంటనట్లుగా అంటించారు.

"వాడికి పెందరాళే అన్నం పెట్టి పంపించరాదూ. రోజూ ఆఫీసుకి ఆలస్యంగా వెళుతున్నాట్ట" అని భార్యకి సలహాఇచ్చారు.

కాని అనటం తననే అని మూర్తికి బాగా తెలుసు.

"పదింటికల్లా బయలుదేరుతాడే మరి. ఎందు కాలస్యమవుతోందిరా" అడగనే అడిగింది అమ్మ.

ఏం చెబుతాడు. పాటలు వినటంలో టైమైందని చెపుతాడా, మ్యాజిక్ చూడటంలో ఆలస్యమైందని చెబుతాడా, లేక ఫ్రెండ్సుతో బాతాఖానీ వల్లనని చెబుతాడా?

కిక్కురుమనకుండా అన్నం కలుపుతున్నాడు మూర్తి.

"ఒరేయ్! ఇప్పటికే నాలుగైదు సార్లు లేటైనావుట. మీ ఆఫీసరు మహా 'స్ట్రిక్ట్'ట. హెడ్ క్లార్కు సాయంత్రం కనిపించి చెప్పాడు. కాస్త జాగ్రత్తగా ఉండు" కోపంగా అనకపోయినా మూర్తికి తెలుసు

"వేణు"

తనవల్ల తండ్రికి చికాకు కలుగుతోందని, ఆక్షణంలోనే నిశ్చయించుకున్నాడు—ఇక ఒక్క నిముషంకూడా ఆఫీసుకి లేటుకాకూడదని.

మర్నాడు తొమ్మిదిన్నరకల్లా కంచంలో అన్నంపెట్టింది అమ్మ. పదికొట్టేసరికి వీధి మలుపుతిరిగాడు. పెద్ద బజారు మీదుగా వెళ్ళకూడదని, చెరువు గట్టు మీదుగా అడ్డంపడ్డాడు. ఎంత మెల్లిగా నడిచినా అర గంట కంటె ఎక్కువ పట్టదు. దోవలో నిలబడి చూడటానికి ఎటువంటి ఆకర్షణలూ లేవు—చెరువులో గుడ్డలుతికే సుందరాంగులు తప్ప అంతవరకూ ఇంకా రాలేదు మూర్తి.

ఎండ కొంచెం తీవ్రంగానే ఉందిగాని హాయిగా చల్లగాలి, చెరువు మీద నుంచి వస్తోంది. ఎండే తెలియలేదు. చకచకా నడుస్తున్నాడు మూర్తి.

"అయ్యో! అయ్యో!" అని ఒక్కపెట్టున ఘోష వినిపించింది. "ఓ నాయనో" అని గుండెచీల్చుకు పోయేటట్లు ఒక్క అరుపు వినిపించింది. మూర్తికి కాళ్ళు ఆగిపోయినై. అటుచూశాడు. చెరువులో మోకాళ్ళలోతు నీళ్ళల్లోనుంచుని గుడ్డలుతికే చాకలి వాళ్లు గోలపెడుతున్నారు. అందరూ ఆడవాళ్ళే. ఏదో ఆపద వచ్చిందని పరుగు మీద చెరువుగట్టు దిగాడు.

"ఏమిటి? ఏమిటి?" అన్నాడు.

చెరువు మధ్యలో బుడ బుడ బుడగలొస్తున్న చోటుని చూపించుతూ—

"మా అబ్బాయి బాబూ. నీకు పుణ్యముంటుంది, నీకడుపున పుడతా, రక్షించు బాబూ" అని గుండెలు తరుక్కుపోయేటట్లు కాళ్ళమీద పడింది పిల్లాడి తల్లి. వయస్సు పదహారేళ్ళే అయినా మూర్తిది భారీ విగ్రహం. వెంటనే చొక్కా విప్పాడు ఒక్క దూకులో చెరువులో బుడుంగున మునిగిపోయాడు. రెండవ క్షణంలో కుర్రాడి పక్కన తేలాడు. మూడో క్షణంలో ఒడ్డుకి పిల్లాడితో సహా చేరాడు. అందరూ చుట్టుముట్టారు. ఇంతలో కొంత మంది మగవాళ్లు కూడా చేరారు. అంతే మరో క్షణానికి మైకం వచ్చినట్లయింది. అట్లానే ఒరిగిపోయాడు చెరువు గట్టుమీద.

కళ్లు తెరిచేసరికి మూర్తి అహాంతం హేగో ఐకూర్చున్నాడు. చాకలి వెంకాయ్ కుర్రాడి తండ్రి, ముఖంలో కేవలం భక్తి ఉట్టి పడుతోంది. ముంతెడు మజ్జిగ అందించాడు. ఒక్క గుక్కలో ముంతెడు ఖాళీ చేసివేశాడు మూర్తి. చుట్టూ జనం. ఆడవాళ్లూ, మగవాళ్లూ, తన్ను ఒక వింత జంతువుని చూసినట్లు చూస్తున్నారు.

"ఎవరబ్బాయి" అన్నారు ఎవరో.

"ఏమోనమ్మ దేముడల్లే వచ్చాడు" స్వరంలో ఉన్న కృతజ్ఞతకు మురిసిపోయాడు.


కాని మరుక్షణం ఆఫీసులో హెడ్ క్లార్కు జ్ఞాపకానికి వచ్చాడు. గబగబా లేచి గుడ్డలు వేసుకున్నాడు.

"నే వస్తా నాకు టైమైంది" అని మాత్రం అని అందరిదగ్గరా సెలవుతీసుకుని గబగబా బయలుదేరాడు. చెరువుగట్టు దిగంగానే

(56-వ పేజీ చూడండి)

మానవకుటుంబం

ఛాయాచిత్ర ప్రదర్శనం



"సంయోగంలో సంతోషం, వియోగంలో విషాదం పొందే దేశదేశాల ప్రేయసీప్రియులు, ఉయ్యాల ఊగుతూ సయ్యాటలాడే ఫ్రెంచి దేశపు పెళ్ళికూతురు, పెళ్ళి జరుగుతుండగా తెర చాటున కూర్చుని అద్దంలో మొదటిసారిగా తన ముఖం భర్తకు చూపించే భారతీయ వధువు, శిశువుకు స్తన్యమిచ్చే హాలండ్ దేశపు తల్లి, జర్మనీలో, దక్షిణాఫ్రికాలో, భారతదేశంలో తప్పటడుగులు వేయ నేర్చుకునే పసిపిల్లలు" — ఇలాగ జీవిత మహాయాత్రలో మానవులను, వారి వివిధానుభూతులను కళ్ళకు కట్టినట్లు ఒకేచోట ధారావాహికగా చూపించే ఛాయాచిత్ర ప్రదర్శనం ఈ నెల పదవ తేదీనుంచి మద్రాసులో జరుగుతోంది.

"మానవ కుటుంబం" అనే పేరుతో ఈ అద్భుత ప్రదర్శనాన్ని అమెరికన్ సమాచార శాఖ (యు. ఎస్. ఐ. ఎస్.)వారు ఏర్పాటు చేశారు. అమెరికన్ ఫొటోగ్రాఫర్లలో అగ్రగణ్యుడు, న్యూయార్క్ మోడరన్ ఆర్టు మ్యూజియంలో ఫొటోగ్రఫీ డైరెక్టరుఅయిన ఎడ్వర్డ్ స్టైయికెన్ ప్రదర్శన కర్త. ప్రదర్శనానికి మద్రాసు విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు డా॥ ఎ. లక్ష్మణస్వామి మొదలియార్ ఈ నెల 9న ప్రారంభోత్సవం చేశారు.

ప్రపంచపు నలుమూలలనుంచీ వచ్చిన ఇరవై లక్షల ఛాయాచిత్రాల్లో 500 చిత్రాలను ఎన్నుకుని ఈ ప్రదర్శనంలో ఏర్పరచారు. 68 దేశాలకు ఇందులో ప్రాతినిధ్యం లభించింది. అన్ని లక్షలలోంచీ కావలసిన చిత్రాలను వేరుచేయడానికి మూడేళ్లు పట్టింది.



మానవకుటుంబం

"మానవుడే నా సందేశం, మానవుడే నా సంగీతం!"

దైనందిన జీవితంలో మానవుని ఆశలు, అనురాగాలు, ఔదార్యం, క్రౌర్యం, సానుభూతి, మానవుల పరస్పర సంబంధాలు వీటిని ప్రతిబింబించే ఉత్తమ ఛాయాచిత్రాలనే ప్రదర్శన కర్త స్వీకరించారు. మానవులు ఏ దేశంవారైనా, ఏ జాతి, మతం, భాష, వేషం వారైనా అందరూ ఒకే విశ్వకుటుంబంలోని వారనీ, అందరి అనుభూతులూ, ఆలోచనలూ ఒకటేననీ ఈ ప్రదర్శనం వ్యక్తం చేస్తుంది. మొదట యౌవన వనంలో ఉయ్యాలలూగే ప్రేయసీ ప్రియులతో ప్రారంభమై, వివాహం, గర్భధారణం, శిశు జననం, మాతృత్వ మహోన్నతి, ఆ తరవాత బాలబాలికల క్రీడలు, విద్యాభ్యాసం, పెరిగి పెద్దయ్యాక కలిగే సుఖదుఃఖ సమ్మిశ్రితమైన వివిధానుభూతులు అన్నీ మనదృక్పథంలోకి వస్తాయి.

'ఒకటీ రెండూ కలిపితే మూడు' అని లెక్కచేసి ఆ లెక్కకి ఇక పొల్లులేదని సగర్వంగా చూసే ఒక బాలుడూ, అతని ప్రక్కనే 'ఒకటీ రెండూ కలిపితే మూడు' అవుతుందో కాదో అన్నట్టు ముఖం పెట్టి, విశ్వరహస్యాల సమస్యలతో పోరాడుతున్న మహామేధావి ఐన్‌స్టీన్ కనిపిస్తారు.

1955 లో న్యూయార్కులో ఈ ప్రదర్శనాన్ని మూడు లక్షలమంది దర్శించారు. ఆ తరువాత ఈ ప్రదర్శనం నలభై అమెరికన్ నగరాలు, మెక్సికో, దక్షిణ అమెరికా, యూరప్, జపాను దేశాలూ తిరిగింది. మనదేశంలో బొంబాయి, ఆగ్రా, న్యూఢిల్లీ, అహమ్మదాబాదు, కలకత్తా నగరాలు తిరిగింది. మద్రాసులో ఈ ప్రదర్శనం జూలై మధ్యప్రాంతం దాకా ఉంటుంది.

ఈ సందర్భంలో ప్రదర్శన నిర్వాహకులు ఈ ఛాయాచిత్రాలన్నిటినీ ఆర్టు పేపరుమీద ముచ్చటగా ముద్రించి ఒక సంపుటిగా ముద్రించారు. ★

[ప్రక్కన నాలుగు పేజీలలో మరికొన్ని చిత్రాలు.]

ప్లీడరు నోటీసు

"ప్లీడరుగారూ, నేనొకళ్ళకి నోటీసివ్వాలండి" అన్నాడు శేషగిరి పెద్ద సీరియస్‌గా ముఖంపెట్టి.

"ఓ దానికేం నిక్షేపంలా ఇయ్యండి." అన్నారు ప్లీడరుగారు కోర్టుకు వెళ్ళడానికి హడావుడిగ కోటు తొడుక్కుంటూ.

ప్లీడరుగారికి ఫీజువస్తేచాలు. మరేమక్కర్లేదు. నోటీసేమిటి ఎవరికివ్వాలి అన్న ధ్యాసే వుండదు. దానికితోడు తొందర.

"ఒరేయ్! వెంకాయ్, ఈయనెవరికో నోటీసివ్వాలిట చూడు అని హడావుడిగా పురమాయించి, తొందర తొందరగా కారెక్కి తుఱ్ఱుమన్నారు కోర్టుకి.

వెంకయ్య ప్లీడరుగారి దగ్గర జూనియరు గుమాస్తా. చిన్నప్పటినుంచీ ప్లీడరుగారింట్లో పిల్లల్నాడిస్తూండేవాడు. పెద్దయ్యాక అక్షరంముక్క నేర్చుకుని గుమాస్తాగా దేరాడు. ఎంతచెప్తే అంతేఘటం. చెప్పిన జేదో తూచా తప్పకుండా చేసెయ్యడమే గాని, ఏంచేస్తున్నామో అనేజ్ఞానమే వుండదతనికి. వెంటనే ప్లీడరుగారికి రావలసిన ఫీజూ తనకి రావలసిన మామూలు తీసుకుని కాగితం, కలం తీసుకున్నాడు:

"శ్రీ రాఘవయ్యగార్కి,

నిన్న నే బజారులో పనిలేక తిరుగుతూంటే పుస్తకం కొంటున్న ఒకమ్మాయిని చూశాను. వెంటనే ఆ అమ్మాయి నాకోమల హృదయాన్నపహరించివేసింది. ఎవరా అంతగొప్ప గజదొంగ అని ఆరాతీస్తే తమ కొమార్తె అని తేలింది. నా హృదయాన్ని దొంగిలించినందుకు ఆమె గార్డియన్ అయిన మీకు నోటీసిస్తున్నాను. ఈ నోటీసందిన వారంరోజుల లోపుగా నాసొత్తును నాకు జేరిస్తేసరే సరి. లేకపోతే పరిహారం వెంటనే ముట్టజెప్పాలి. అట్లాకానిపక్షంలో మీమీద క్రిమినలుగా వ్రాసీడవగలను."

శేషగిరి వ్రాలు."

వెంకయ్య వ్రాయటం పూర్తిచేసి శేషగిరికిచ్చాడు. శేషగిరంతా చదివి సరిపోయిందని సంతృప్తితో బుఱ్ఱాడించాడు. వెడుతూ వెడుతూ వెంకయ్యని పక్కకిపిల్చి నోటీసు వెంటనే పోష్టుచేయమని చెప్ప మరి రెండు రూపాయలతీసి చేతిలోపెట్టాడు. నోటీసాపూ లేపోస్టుకు వెళ్ళిపోవాలని నొక్కినొక్కి చెప్పాడు.

రూపాయలు చూడ్డంతోటే వెంకయ్య కళ్లు మిలమిల మెరిశాయి. ఉన్నపనంతా వదిలేసి పరుగుతీశాడు కోర్టుకు. ప్లీడరుగారి సంతకం పెట్టించేసి పోస్టుచేశాడు.

రాఘవయ్యగారప్పుడే కోర్టునించి వచ్చి డ్రస్సుమార్చుకుని కుర్చీలో కూర్చుని వేడి వేడి కాఫీ త్రాగుతున్నారు. ఇంతలో పోస్టుమేన్‌వచ్చి రిజిష్టరు నోటీసందిచ్చాడు.

నోటీసు చూసేటప్పటికి రాఘవయ్యగారి కోపం ఆకాశాన్నంటుకొంది. "ఎంత మొండి ధైర్యం వాడికి, నాకే నోటీసిచ్చేటాడు. చెప్తా వాడిపని చెప్తా" అనుకున్నారు

కె. అమ్మిరాజు

కవరన్నా విప్పి చూడకుండా పూరికే యిటూఅటూ, తిప్పి చూస్తూ.

"రానియ్యి చెప్తా. ఈ రాఘవయ్యతోనా కోర్టు వ్యవహారాలు" అనుకుంటూ నోటీసు హడావుడిగ చదివేశారు. ఆయనకి తలాతోకా ఏమీ బోధపడలేదు. మతిపోయింది. 'హు' అని పళ్ళుబిగించి యింకోసారి చదివేశారు.

'ఎవడీ మూర్ఖుడు? మా అమ్మాయి వాడి మనసు దొంగిలించేసిందంటాడు' అని ఒక్క క్షణమాలోచించి, 'ఏమేవ్' అని పొలికేకేశారు.

"ఆ! ఒస్తున్నా ఏమిటా పొలికేకలు మీరునూ?'

"ఆ గిరిగాడు, అంటే శేషగిరిగాడు ఎవడే?"

"ఏమిటీ పూట వాడిమీద విరుచుకు పడుతున్నారు? ఏం మునిగింది?"

"కొంపే మునిగింది. అప్రాచ్యుడు. లేకపోతే నాకు నోటీసిస్తాడా? వుండు వాడి పని చెప్తా."

"అసలు సంగతేమిటో చెప్పక పూరికే హడావుడి చేస్తారే?"

"హడావుడేమిటి? వెధవ సినిమాలన్నీ వచ్చి లోకమంతా పాడయి పోయింది. ఎక్కడ చూసినా ప్రేమా, ప్రేమ. కొట్లో పుస్తకాలు కొంటూన్న మనమ్మాయిని చూసేశాడట. అది వాడి హృదయం దొంగిలించేసిందిట. అందుకని మనం పరిహారమివ్వాలిట. లేకపోతే దావావేస్తానని బెదిరిస్తాడు. వేసుకోనీ, ఈ రాఘవయ్య దగ్గరా దావాలు, లావాదేవిలూనూ!"

"ఇదెక్కడినోటీసండి? ఎప్పుడూ విన లేదే?"

నేమాత్రం విన్నానేమిటి? నా మొహం దీనికి ప్లీడరు నోటీసు గూడాను."

"ప్లీడరు నోటీసా? ఎవరండి ఈ కేసు తీసుకున్న మహానుభావుడు?"

"కంగారులో నేనది చూడ్డం మరచేపోయా చూశావా!" అంటూ నోటిసంతా యింకోసారి పరీక్షించేశాడు. దాంతో ఆయనకి చెమటలు క్రమ్మాయి. ముఖం పాలిపోయింది.

"ఏమిటండీ అలా అయిపోయారే?"

"ఏమీ లేదు. సర్లే నువ్వుపో."


"ఇంతకీ ఎవడా బుఱ్ఱలేని ప్లీడరు?"

"అబ్బనే నేనే, ఆ బుఱ్ఱలేని ప్లీడర్ని, చంపక యింకపో"

దాంతో ప్లీడరుగారి భార్యపొట్ట చెక్కలయ్యేటట్టు నవ్వింది. ప్లీడరుగారగ్గి రుద్రుడై పోయాడు.

"ఫామ్మంటే!

"సంగతేమిటో సాంతం తేలనివ్వకుం



LIFEBUOY SOAP
LIFEBUOY
SOAP
LIFEBUOY SOAP
ఆరోగ్యవంతులైన పిల్లలు ప్రతిరోజూ
లైఫ్‌బాయ్ సబ్బుతో స్నానము చేయుదురు
–అది ప్రతిదిన*మలినములోని క్రిములను కడిగివేయును!
* మనకు ప్రతిదినం తార్పపడే మామూలు మురికిలో క్రిములున్నాయి.
మనలో ప్రతివారికీ యీ క్రిములవల్ల రోగాల ప్రమాదం వుంది.
అందుచేతనే చాలామంది ఆరోగ్యవంతులగు జనులు లైఫ్‌బాయ్
సబ్బుతో మురికిని మరియు క్రిములను రోజూ కడిగివేసుకొనుట
వల్ల తమ ఆరోగ్యమును కాపాడుకొనుచున్నారు—అది
.ఆరోగ్యవంతమైన హాయిని గలిగించును.
L. 257-X52 TL
భారతదేశంలో తయారుచేయబడినది

★ ప్లీడరు నోటీసు ★

కదా నే? ఇంతకీ అంత బుద్ధిలేని పనెల్లా జేశారు?"

"వెంకయ్యగాడో మొద్దుఘటం. చెప్పింది రాసుకోడమేగాని, ఏం రాస్తున్నాడో వాడికే తెలియదు. శుద్ధ మొద్దు."

"వాడురాసిం దానిమీద గుడ్డిగా సంతకం పెటడమేగాని, ఏం రాశాడో చూద్దామనన్నా వుండదు మీకు."

"పోవే చచ్చినపాము నేం చంపుతావింక. వెంకయ్యగాడు నురగలు కార్చుకుంటూ పరుగెత్తుకొచ్చి, అర్జంటని ఏడవకపోతే నేను మాత్రం అంత గుడ్డిగా సంతకం పెడుదునా?"

"బాగానే వుంది. అవకతవక మహారాజు మందమతి మహామంత్రి! ఇంతకీ ఏంచేయ దల్చారు?"

"ఏంచేయదల్చానా? ఒగుల్తా నావాడిని? ఈ రాఘవయ్యతో దావా అంటే కత్తిమీద సాము అని తెలియదూ? ముప్ఫయి కోర్టులు తిప్పి మూడు చెరువుల నీళ్ళు త్రాగింపనూ?"

"చాల్లెండి. ఎవరైనావింటే నవ్వుతారు."

"ఎవడా నవ్వేది?"

"పోనీ వాకబుచేసి చూడరాదూ మన మ్మాయి కేసు జోడునేమో? పరిహారం చెల్లించేద్దాము."

"ఏడిసినటుంది. వాడే దమ్మిడీకి కొరగా లేనివాడో, అనాకారో, రోగిష్టో."

"అదే వాకబు చేయమంటూంట. మన వెంకయ్యని పిలిచి అడగరాదూ?"

"వాడికింకా జ్ఞాపకముంటుందే? అయినా అడిగిచూద్దాము."

"ఒరేయ్ వెంకా!..."

"వస్తున్నా సార్."

"ఏరా నిన్ని నోటిసిచ్చాడే ఎవడో శేషగిరి. ఎవడ్రావాడు? ఎల్లావున్నాడు?"

"ఓ ఆయనా! నలభయ్యేళ్ళుంటాయండి. పొట్టిగా, గూటంలా,......"

"చాల్చాలు నువ్వు పో. ఏమే చూశావా నేచెప్తే విన్నావా!"

"మీరుండండి నేనడుగుతాను. ఏరా నీకు బాగా జ్ఞాపకముందా ఆయనే శేషగిరని?"

"అదేమిటండమ్మా అల్లా అడుగుతారు? అయ్యగారి దగ్గరకు రోజూవచ్చే ఆయన్ని ఎరగనండి నేను?"

"నాదగ్గరకి రోజూవస్తాడా?"

"అవునండి. సాయంత్రమప్పుడు మీరిద్దరూ కూర్చుని భసాదుకుంటారు కూడాను."

"నీముఖం ఆయన శేషాచలం."

"ఆయ నేనండి నే చెప్తూంట."

"ఏడిసినట్టుంది నీతో వ్యవహారం. శేషగిరిని అడిగితే శేషాచలాన్ని గురించిచెప్తావే?"

"అయితే నాకు తెలియదండి?"

"ఏమిటండీ శేషగిరంటున్నారు?" అంటూ స్ప్రింగు తలుపు త్రోసుకు లోపలి కొచ్చారు వెంకట్రామయ్యగారు.

"చాలారోజుల కొచ్చారు అన్నయ్యగారు, వుండండి కాఫీ తెస్తా."

"అబ్బెబ్బే వద్దండి ఇప్పుడే త్రాగి వస్తున్నా."

"మొహమాటం పడితే లాభం లేదండి" అంటూ యింట్లోకెళ్ళి యింకోకప్పు కాఫీ తోవచ్చారు ఆమెగారు.

చల్లారిన కాఫీ ఒక్కగుక్కలో త్రాగేశారు ప్లీడరుగారు.

"నిన్న మద్రాసునించి మా అబ్బాయి వచ్చాడండి. ఈపూట తీసుకువద్దా మనుకుంటే చెప్పకుండా పెట్టకుండా సినీమాకి పోయాడు."

"పోన్లెండి. రేపు తీసుకొద్దురుగాని. తొందరేం? పేరేమిటండీ, మర్చిపోయాను?"

"శేషగిరండి."

"శేషగిరా?" ప్లీడరుగారు తెల్లబోయి తమాయించుకుని డ్రాయరు సొరుగు లాగి కవరు పైకితీశారు.

"ఇదిగో ఈ ఎడ్రసు చూడండి?"

"అరె! మా అబ్బాయి ఎడ్రసే నే! ఇదిగో c/o వెంకట్రామయ్యగారు 280/11 క్రొత్త వీధి అనికూడా వుంటే నే."

"నే చెప్పానా ముందే! విచారించి చూడండీ అని," అంది ప్లీడరుగారి భార్య ఆనందంతో వుబ్బి తబ్బిబ్బై.

"మీ ఎడ్రసేనా? బాగా చూశారా?"

"ఆ నిశ్చయంగా."

"మీ ఎడ్రసేనన్నమాట! నాలైదు సార్లు చదివినా కూడా నా కావిషయం తోచనే లేదు చూడండి!"

"ఆ ఎందుకు తెలుస్తుంది లెండి. మీ మనస్సంతా కోర్టులు, చెరువులమీద వుంది" అంది ఆవిడ సన్నసన్నగా.

"ఇంతకీ ఏమిటండీ ఆ వుత్తరం?"

"ఏముందిలెండి మీ పుత్రరత్నం నోటీసిచ్చాడు." వంకట్రామయ్యగారు తెల్లబోయారు. "మావాడా మీకు నోటిసివ్వడమా?"

"అవును. తగిన పరిహారమివ్వకపోతే క్రిమినల్ గా ప్రాసిక్యూట్ చేస్తానని కూడా బెదిరించాడు. పరిహారం సమర్పించి చేతులు ముడుచుకుంటానులెండి. ఆగ్రహించకండి." అన్నారు ప్లీడరుగారర్థపూరితంగానవ్వుతూ.

"ఇంతకీ నోటీసు దేనికి?"

"మనం ప్రయత్నిస్తున్న దానే చూసుకున్నారు. మీరే చిత్తగించండి." నోటీసందిచ్చారు ప్లీడరుగారు ఆనంద తన్మయత్వంలో తేలియాడుతూ.

వెంకట్రామయ్యగారు "ఏం కొంపమునగాదోనని తడబడుతూ, నోటీసందుకున్నాడు.

ఆయన తడబాటు చూసి ప్లీడరుగారి భార్య ముసిముసి నవ్వులు నవ్వుకుంది. ★

అతనికంటె ఘనులు

మెయిలును తగలించడానికై "సైడింగు" ప్లాట్ ఫారంమీద ఒక కంపార్టుమెంటు సిద్ధంచేసి వుంచబడింది. కడిగిన నీటిబొట్లు అక్కడక్కడ మూలల్లోను, కిటికీ చట్రాలమీద, తెల్లగా ముత్యాల్లా ఇంకా అలాగే నిలిచి వున్నాయి. ఇంతలో ముగ్గురు వ్యక్తులు పట్టాలుదాటుకొంటూ హడావిడిగా వచ్చి పెట్టెవద్ద ఆగారు. ఆముగ్గురిలోనూ, మొదటతను రామ్ నారాయణ్ శేరు. అతని వెనకాలే ఇద్దరు పోర్టర్లు, బరువుమూటలు మోసుకొంటూ వస్తున్నారు. రెండు మూటలు, గోనెగుడ్డతో చుట్టబడి, మీద సన్నని ఇనుపబద్దిలతో కట్టుదిట్టంగా బిగించబడి వున్నాయి. రెండవది మొదటిదాని మీద కొంచెం తేలిగ్గా వున్నట్లగుపడుతోంది. రామ్ నారాయణ్ శేర్ గూడా తన దేహభారాన్ని మోసుకొంటూ, బరువుగా, హడావిడిగావచ్చి పెట్టెలో ఎక్కాడు. పోర్టర్లుకూడా పెట్టెలోని కెక్కి, మూటల్ని క్రిందదించారు. శేరు ఒక బల్లమీద వ్రాలాడు. పోర్టర్లు పడినపాటుకి పట్టిన చెమట తుడుచుకొని, ఉస్సురస్సురంటూ, ఎక్కువకూలి రాబట్టడం కోసం, తాము తెచ్చిన వస్తువుల బరువు గురించి ఏవిధంగా ఉపోద్ఘాతం మొదలు పెట్టాలా అని ఆలోచిస్తూ, మరోప్రక్క మూటల్ని బల్లక్రిందకు నెట్టడానికి తాపత్రయ పడుతున్నారు. శేరు పొడుగ్గా, లావుగావున్నాడు. ముఖం ఎంతో ప్రసన్నంగావుంది. కూలీల యెడ ఎంతో దయగలవాడిలా ఎందుకయ్యాఅనవసరంగా శ్రమపడతారు. వాటిని బల్లక్రిందకు నెట్టడానికి-వాటి నావిధంగానే వదిలేయండి అన్నాడు.

సాధారణంగా స్థూలకాయులకు చెమట ఎక్కువ. కాని మన శేరు విషయంలో మటుకు, ఈమాట నిజంగాతోచదు. బహుశా ఇతను 200 పౌన్ల బరువుంటాడు. కాని పోర్టర్లో, ఒక్కొక్కడు వాళ్లు తెచ్చిన బరువుతో సహా వందో, వంద యాభయ్యో పౌన్ల బరువుంటారు. అయినా శేరుకన్న వాళ్లెక్కువగా చెమరుస్తున్నారు. శేరు తన

పద్మసోల సత్యనారాయణమూర్తి

చేతిసంచి తెరచి, అరటిపళ్ళ అత్తం బయటికి తీశాడు. అందులో రెండుపళ్లు నలిగిపోయి తినడాకిని వీలుగాలేవు. అనుకోకుండానే ఎంతో ఉదారత్వం చూపుతున్న వాడిలా "ఇదిగో వీటిని తీసుకోండి"అంటూ ఆ రెండుపళ్ళను పోర్టర్లకిచ్చాడు. కూలీలు ఎంతో ఆప్యాయంగా వాటెనందుకుని తినేశారు.

"సరే! మీకు కూలి ఎంత ఇవ్వాలి?" అన్నాడు శేరు. "అదేంటండి శేరుగారు అలా అడుగుతారు తమకు తెలినిదేముంది. మేం మోసిన మూటల బరువు తమకు గుర్తేకందండి. వాటిని ఎంతోదూరం నుంచి మోసుకొచ్చాం. రాత్రయినా ఈ రోజు ఎంతవేడిగా వుందో చూశారా? ఏదో పేదోళ్ళం పిల్లలు గలవాళ్ళం..." ఉంఛవృత్తిచే జీవించేవాడు యాచించే స్థాయిలో అన్నాడొక పోర్టరు. కాని శేర్ ఏమీ మెత్తబడినట్లులేదు. "అదేమిటోయ్! రూపాయి లేమైనా చెట్టుకి కాస్తున్నాయా దులిపితే రాలడానికి? రోజులు చాలా గడ్డుగావున్నాయి. అందులో మాలాంటి వాళ్ళకు మరీను! మాకూపిల్లలున్నారు. మాభవిష్యత్తు మేమూ చూసుకోవాలి. తొందరగా తేల్చండి ఎంతకావాలో!" ఎంతో నెమ్మదిగా, ఏదో కథలో పాత్రాభినయనం చేస్తున్నవాడిలా అన్నాడతను.

కూలీలు ఒకరిముఖం ఒకరు చూసుకున్నారు. చివరికి, ఒకడు "శేర్ సాబ్! న్యాయంగా అడుగుతున్నాను. మూడు రూపాయలిప్పించండి-చాలు" అన్నాడు. ఉలికిపడినట్లుగా, కోపంతో వంచిన తల ఎత్తాడు. కాని మరుక్షణంలోనే కోపాన్ని కనబడనీయకుండా మామూలు స్థాయిలోనే నెమ్మదిగా "మూడు రూపాయలే? కలకత్తాలో ఒక్కొక్క పోర్టరు ఒక మణుగు బరువు మోస్తాడు. కూలి ఎంతో తెలుసా? ఒకసారి తేవడానికి పావలా. ఈ రెండుమూటలూ కలిపి మహా వుంటే ముప్పయిశేర్లకన్న బరువుండదు. ఈ మాత్రందానికి మూడు రూపాయలు కావాలా? రూపాయిలు కాసేచెట్టు ఎక్కడైనా వుంటే నేను వెతుక్కోవలసిందే!" అంటూ ఒక్కసారిగా నవ్వాడు. "అందులో ఇది వేసవికాలం. ఆ చెట్టుకి రూపాయలుంటాయో వుండవోకూడా అనుమానం. ఊ...ఊ...త్వరగా ఏదో ఒకటి తేల్చి చెప్పండి ఎంత కావాలో..." కూలీలు మళ్లీ ఒకరి ముఖాలుఒకరు చూసుకున్నారు. "శేర్ సాబ్! తమరేదిస్తే అదే తీసుకొంటాం" అన్నాడొకడు ఎంతో వినయం ఉట్టిపడుతున్నట్లు. శేరు నవ్వాడు. "వద్దు...వద్దు... అలా వద్దు...నేనంత కర్కోటకుణ్ణిగాదు. మీకుమాత్రం అన్యాయం ఎందుకు జరగాలి. ఇదిగో చూడండి.. ఒక్కొ మూటకి నాలుగణాల చొప్పున రెండు మూటలికి ఎనిమిదణాలు! ఇప్పుడు సరిగ్గావుందా లెక్క." కూలీలు రిచ్చపడిపోయారు. "అదేంటి శేర్ సాబ్. ఎనిమిదణాలా? కష్టపడి ఇంత బరువు మోసినందుకు? మహారాజులు, మీరు చూడ్క



పాపాయికి పాలు. ఫొటో: నెల్‌డోర్ (అమెరికా)



అందని బుడగ

ఫొటో: జాన్ మిలీ (అమెరికా)


★


బాలక్రీడ

ఫొటో:

ఆర్థర్ లీప్‌జిగ్

★





వెలుగూ నీడా

ఫొటో: పాల్ నిల్సె నిల్సన్ (స్వీడన్)



గూటిలో

ఫొటో: ఇర్వింగ్






ం వ్వ
న్ (అమెరికా)



ఉప్పొప్పొ గోనె
ఫొటో: మార్తా కిచెన్ (అమెరికా)




నవ్వుల వెన్నెల
ఫొటో: బార్నీ కాహర్డ్ (అమెరికా)



శిశుజననం

ఫొటో : వేక్ మింగ్

(అమెరికా)



"ప్రాణస్య ప్రాణః"

(కేనోపనిషత్)

ఫోటో:

ఏరియాట్

ఎర్నెట్

(అమెరికా)

పోతే ఇంకెవరు చూస్తారు మమ్మల్ని—చెప్పండి...మీరు మా తల్లిదండ్రులంతటి వారు." ప్రాధేయపూర్వకంగా అన్నాడు పోర్టరు.

శేషు పర్సువిప్పి చూశాడు. అచ్ఛా భాయ్!...అయినా పేదసాదలమీద నాకెంతో చెప్పరాని అభిమానం మొట్టమొదటినుంచీను...మీ విషయం నాకు తెలుసు...ఇదిగో ఒక్క రూపాయి..." పోర్టరు రూపాయిని తీసుకుని రెండవవాడి కిస్తూ, ఒకరిముఖాలొకరు చూసుకొన్నారు. ఏదో అనబోయి మరుక్షణంలోనే విరమించుకొన్నారు. పోర్టర్లు వెళ్ళిపోతూ ప్లాట్ ఫారంమీదనుంచే "జై రామ్‌జీకి! బాబూజీ!" అన్నారు. శేషు ఎంతో వినయంగా, తానేదో లక్షాధికారినన్న హుందాతో, మళ్ళీ తిరిగి "జై రాంజీకి!" అన్నాడు.

ప్రయాణికులు, గుంపులు గుంపులుగా గొడవచేసుకొంటూ, ఒకరొకరు తోసుకొంటూ, కంపార్టుమెంటుమీద వచ్చిపడుతున్నారు. మెయిలు గంటన్నర ఆలస్యం. ఇంకా ఎంతో వ్యవధివుంది. కాని ఈ గొడవ ఎవ్వరూ పట్టించుకోక, ఎవరిపనిలో వాళ్ళు నిమగ్నులయ్యారు. శేషు ప్రశాంతంగా ఇదంతా తిలకిస్తున్నాడు. ఇంతలో ఒక సన్నటి వ్యక్తి ఖాకీషర్టు-పైజామాతో, పెట్టె ప్రక్కనే తారాడుతున్నాడు. శేషు తన చేతిసంచీని జాగ్రత్తగా ప్రక్కకి పెట్టుకున్నాడు. ఉన్నట్లుండి ఆ ఖాకీ చొక్కాలోవున్న నూతనవ్యక్తి ఏడవడం ప్రారంభించాడు. అలా ఏడుస్తూనే మధ్యలో ఆగుతూ, ఒక్కొక్కసారి శేషుకేసి చూస్తే, తిరిగి వెక్కి వెక్కి ఏడ్వసాగాడు. కొంతసేపటికి ఏడుపు తగ్గించి "ఇదంతా నా ఖర్మకాకపోతే మరేమిటి? విధిని దాటడం ఎవరితరం? చివరికి నాఖర్మే నాకు శత్రువయింది" అని వాపోసాగాడు. శేషు ఏమీ మాట్లాడలేదు. ఖాకీచొక్కా అతను తిరిగి ప్రారంభించాడు. "నా కూతురు ఉన్నట్లుండి ఎవడితోనో లేచిపోయింది. వాళ్ళు ఇంతవరకూ వచ్చారని తెలిసింది. తీరా ఇక్కడ విచారిస్తే, వాళ్ళు వార్ధా వెళ్లారని తెలిసింది. కాని ... నావద్ద ఒక్కరూపాయే వుంది." అంటూ జేబులోంచి ఒకరూపాయి కాగితం తీశాడు, "ఎంత దురదృష్టవంతుణ్ణి కాకపోతే నా ఖర్మ ఇలా కాలుతుంది. ఇక్కణ్ణుంచి వార్ధా వెళ్లాలంటే రూపాయిపదణాలు కావాలి. కాని నావద్ద ఒక్కరూపాయి మాత్రమే వుంది... అంటూ జేబులోంచి ఒక రూపాయికాగితం ఇవతలికి తీశాడు. ఇక్కణ్ణుంచి వార్ధా వెళ్లాలంటే రూపాయి పదణాలుకావాలి కాని నావద్ద ఒక్క రూపాయిమాత్రమే వుంది. ఇంతవరకూ జీవితంలో దేహి అని ఒకరిముందు చెయ్యిచాపి ఎరుగను...ఇటుపైన అలాచేసి ఆత్మవంచన చేసుకోలేను..." అంటూ మళ్ళీ తిరిగి ఏడ్వడం మొదలెట్టాడు.

శేషు మళ్ళీ చేతిసంచీ తెరచి, ఒక అరటిపండు ఇవతలికి తీశాడు. అందులో నలిగి పాడైపోయిన వేవీ మిగల్లేదు కనుక, ఆ ఖాకీ షర్టతనికి ఏమీ ఇవ్వలేదు. అరటిపండువలిచి తిని, తొక్కని కిటికీగుండా అవతల పారేశాడు. ఖాకీషర్టతను అలా ఏడుస్తూనే వణికిపోతున్నాడు. "జీవితం చాలా కష్టభూయిష్టమైంది—నా విషయంలోకూడా అంతేను. నా కూతురి పెండ్లి అంతా సిద్ధమయి, చివరి క్షణంలో పుసిగిపోయింది—కారణం, కట్నం అంతా రొఖ్ఖ రూపంలో ఒక్కసారే కావాలన్నారు. ఇలాంటి విడ్డూరం ఎవరైనా విన్నారా?" అంటూ దీర్ఘంగా నిట్టూర్చాడు శేషు. "అయినావుండు, నేనేదైనా సహాయం చెయ్యగలనేమో!" ఖాకీషర్టతని ముఖంలో ఆశారేఖలు గోచరించాయి. టిక్కెట్టు కలెక్టరు పట్టాలు దాటుకొంటూ సైడింగుప్రక్కనే వున్న ప్లాట్ ఫారం ఎక్కాడు, కూడావస్తున్న కొంతమందితో ఏవో మాట్లాడుతూనే. శేషు తలుపును దగ్గరగానెట్టి ప్రక్కకిఒదిగి కూర్చున్నాడు. టిక్కెట్టుకలెక్టరు, కూడావస్తున్న వాళ్ళని తోసుకొని, కంపార్టుమెంటులోకెక్కాడు. రాగానే క్రిందవున్న మాటల మీద దృష్టిసారించాడు. కాని ఏమీ మాట్లాడలేదు. శేషు ఖాకీషర్టతనిని చూపించి "రోజులుచాలాగడ్డుగావున్నాయి. అందులో పేదవాళ్ళకి మరీను. ఇదిగో! ఇతన్ని చూడండి—పాపం, కూతురు ఎవడో నీచుడితో లేచిపోయిందట. తీరా వాళ్లని వెదుక్కుంటూ ఇక్కడికి వచ్చేసరికి, వాళ్లిద్దరూ వార్ధా వెళ్ళిపోయినట్లు తెలిసింది. కాని ఇతనివద్ద ఒక్క రూపాయిమాత్రమే వుంది. వార్ధాకి ఇక్కణ్ణుంచి రూపాయి పదణాలు టిక్కెట్టు!" టిక్కెట్టు కలెక్టరు నిశ్శబ్దంగా ఊరుకున్నాడు. "నాలాగే మీరెంతో ఉదార హృదయులని, మీ ముఖంచూస్తేనే తెలుస్తోంది...ఏమంటారు టిక్కెట్టు కలెక్టరు సాబ్? మీరు ఈ పేదవానికి ఏదో విధంగా సాయం చేయగలరని నేననుకుంటున్నాను. అతనివద్దఉన్న ఒక్కరూపాయి మీకిస్తే, బహుశా మీరు అతన్ని వార్ధా వరకూ వెళ్ళేటట్లు చూడగలరని నేను తలుస్తున్నాను." టిక్కెట్టు కలెక్టరు సన్నగా నవ్వాడు. మరుక్షణంలోనే చేతినిచాపాడు. ఖాకీషర్టతను సందేహించకుండా యిచ్చిన రూపాయిని చేతిలో పట్టుకొని "నా కూడా రా" అంటూ పెట్టె దిగాడు. మూడవ తరగతి పెట్టెలను దాటుకొంటూ పోతున్నాడు. అతనికూడా ఖాకీషరతను వెంబడిస్తున్నాడు. వాళ్లిద్దరూ దృష్టిపథంలోంచి తప్పిపోగానే శేషు గలగలా నవ్వుకొన్నాడు తనపాచిక పారినందుకు! తరువాత ఆవలించి చిటికలు వేస్తూ నెమ్మదిగా పక్కమీద వ్రాలేడు. వెంటనే చిన్న కునుకుపట్టింది.

మెయిలుకి సిగ్నలిచ్చారు. సైడింగుప్రక్క వున్న ప్లాట్ ఫారం మీద మళ్లీ జనం రద్దీ ఎక్కువయింది. ఇంతలో లైటింజనువచ్చి పెట్టెను తగిలించుకొని పోతూంది. పాయింట్ల మీదుగా చక్రాలు మారుతున్నప్పుడు చేసిన చప్పుడుకి, కుదుపుకి, శేషు లేచికూర్చొని, కిటికీగుండా చూడసాగాడు. పెట్టెలువచ్చి అసలుబండికి తగులుకొన్నాయి. పళ్లమ్మే అతనికోసం, కిటికీమీద ఆనుకొని చూస్తున్నాడు. ఇంక రైలు కదలడానికి మూడు నిముషాలు వ్యవధి వుండిఉంటుంది.

★ అతనికంటె ఘనులు ★

ఒక టిక్కెట్టు కలెక్టరు-(ఇంత క్రితం వచ్చినతను కాదు) పెట్టె తెరచి తలుపు తోసుకొని లోపలికి వచ్చాడు. "టిక్కెట్ ప్లీజ్!" అన్నాడు. ఇదివరకే ఒకసారి చెక్ చేయబడిన టిక్కెట్టును తీసి, శేషు చూపించాడు. టిక్కెట్టు కలెక్టరు తిరిగి వెళ్లిపోతుండగా, క్రింద వున్న రెండు మూటలు అతని కంటబడ్డాయి.

"ఈ మూట లెవరివి?" అన్నాడు.

"నావేనండి" అన్నాడు శేషు తాపీగా.

"ఏమున్నాయి అందులో శేఠ్ సాబ్!"

"అబ్బే...కొద్దిగా బట్టలు వుంటేను...కూడా తీసుకుపోతున్నాను" అన్నాడు కొంచెం తడబడుతూ.

టిక్కెట్టు కలెక్టరు ఒకమూట చివర పట్టుకొని లేవనెత్తి దభేలున క్రింద పడేశాడు. "ఇవి అథమం ఒక్కొక్కటి ఒక్క మణుగు బరువుంటాయి. అంటే మీ టిక్కెట్టుమీద తీసుకువెళ్లగలిగే లగేజికన్న ఎక్కువ వుంది. మీరు దీనికి ఎక్కువ ఛార్జి చెల్లించవలసి వుంటుందేమో?" శేషుకి పట్టరాని కోపం వచ్చింది. ఎన్నో భావాలు లోపల్లోపలే సుళ్లు తిరగ నారంభించాయి. "ఇది వట్టి అబద్ధం. ఇవి బేళ్ళు కావు-వట్టి గుడ్డల మూటలు! ఎంతో తేలిగ్గావున్నాయి. వట్టి తేలిక ... ఎక్కువఛార్జి చెల్లించనవసరం లేదు. అలా అంటూనే ఒక చెయ్యి చొక్కా జేబులోనికి పోయి పర్సుతో ఇవతలికి వచ్చింది. అందులోంచి ఐదురూపాయల కాగితం ఇవతలికి తీశాడు. టిక్కెట్టు కలెక్టరు దానిని చూసి కూడా, చూడనట్లే వేరొకవైపుకు చూస్తూ "అథమం రెండు మణుగులు ఎక్కువ. దానిమీద తిరిగి పెనాల్టీ...రెండు మణుగులకు, కలకత్తా వరకు మొత్తం ఛార్జి 35 రు||లు...కాదు 38 రు||లు...అవును సరిగా 38 రు||లు అవుతుంది అన్నాడు. శేషుకి అనుకున్నదానికన్న ఎక్కువ కోపం వచ్చింది. 38 రూపాయిలే?...ఈ మూటలోని గుడ్డలు అంత ఖరీదు లేవే?" "మేము బట్టల ఖరీదునిబట్టి ఛార్జి చెయ్యం. వాటిబరువుమీద మాత్రమే! మొత్తం 38 రు||లు అవుతుంది." అన్నాడు టిక్కెట్టు కలెక్టరు. పర్సులోంచి తిరిగి ఇంకో రెండు అయిదు రు||ల కాగితాలు ఇవతలికి తీశాడు. వాటిని వ్రేళ్లతో పట్టుకొని విదిలిస్తూ టిక్కెట్టుకలెక్టరువైపు చూశాడు. ఆ నోటు పంకా చిరుగాలిలో రెపరెప కొట్టుకొంటున్నాయి. "టిక్కెట్టు కలెక్టరు సాబ్! తమరు అలాగంటే ఎలాగు? ఏదో విధంగా సర్దుకుపోవాలిగాని...ఏమంటారు" గార్డు ఈలని పెదాలవద్ద పెట్టుకోవడం, టిక్కెట్టు కలెక్టరు కిటికీగుండా చూశాడు. "నేను చెప్పిన ఛార్జికి మీరు అంగీకరించకపోతే, బండి దిగివెళ్ళి ఈ మూటలు మీరు తూకం వేయించవలసి వస్తుంది. ఏదో పదిహేను రు||లు లంచంగా యిచ్చి నన్ను నలుగురిలోనూ మభ్యపెట్ట ప్రయత్నించకండి!" అన్నాడు. గార్డు ఈల ఊదాడు. టిక్కెట్టు కలెక్టరు మూటల్ని అవతల పారేయడానికి ఒకదానిని లేవనెత్తాడు. ఇంకో రెండు అయిదు రు||ల నోట్లు ఇవతలికి తీసి మొత్తం టిక్కెట్టు కలెక్టరువైపు పడేస్తూ "ఇప్పుడు నేను బండి దిగి వెళ్ళలేను. గార్డు సిగ్నలు యిచ్చేశాడు. నేను రేపు ఉదయానికి కలకత్తా చేరితీరాలి. కొంచెం దయచూపండి టిక్కెట్టుకలెక్టరు సాబ్" అన్నాడు. టిక్కెట్టు కలెక్టరు నెమ్మదిగా చెయ్యిజాపి డబ్బును తీసుకొని జేబులో కుక్కకొన్నాడు. "సరే! మీరు అంతలా చెబుతుంటే నేనెలా కాదనగలను." అంటూ నవ్వుకొంటూ కదులుతున్న బండిలోంచి దిగిపోయాడు.

శేషు ఒక్కసారి పట్టిన చెమటనుతుడుచుకొన్నాడు తువ్వాలూ, రుమాలు గాని పైగుడ్డతో. హతాశుడై కోపంతో "అంతా వట్టి లుచ్చాలు...ఈ ప్రపంచంలో ఎక్కడా నీతిలేదు." అనుకొన్నాడు కిటికీని ఆనుకొని అవతలికి చూస్తూ. బండి నెమ్మదిగా కదులుతుంటే, ప్లాట్‌ఫారంమీద జనంచేసే... గోల నెమ్మదిగా చెవులను దూసుకొంటూ పోతోంది. తన మూటలు మోసిన పోర్టర్లు, ఖాకీషర్టతను - టిక్కెట్టు కలెక్టర్లు-అంతా కలిసి ప్లాట్‌ఫారం చివర ఏదో మాట్లాడుకొంటూ విరగబడి నవ్వుకొంటూండడం అకస్మాత్తుగా శేషు కంటబడింది. వళ్ళంతా తేళ్ళు, జెర్రెలు ప్రాకినట్లయింది. వెంటనే కిటికీ మూసేసి పడుకొంటూ "నాకే టోపీ వేశారే వీళ్లు! ప్రపంచం వట్టి మోసం...నీతి న్యాయం ఆరోజు కారోజు క్షీణించి పోతున్నాయి...అందుకనే కలియుగం అన్నారు" లోలోపలే గొణుక్కొసాగాడు. ఇంతలో "కలికాలపు పరమరహస్యం రామబ్రహ్మం గంజాయికి తెలియని సత్యంశివబ్రహ్మం..." అంటూ ఒక బిచ్చగాడు తత్వం పాడుకొంటూ ప్రక్క పెట్టెలోంచి ఈ పెట్టెలోకి వచ్చాడు. ★

వనితా లోకం

ఢిల్లీలో ఉదయం 11 గంటల వేళ—

మగవాళ్ళకన్నా స్త్రీలు షాపింగ్ చేస్తేనే బాగుంటుంది. మగవారు ప్రొద్దున్న ఆఫీసుకెళ్ళి సాయంత్రం ఇంటికి తిరగొస్తారు. ఆ సాయంత్రం గంటసేపూ హాయిగా ఖబుర్లు చెప్పుకోటమో లేక ఏ షికారో వెళ్లకుండా, ఈ సామాను లేదు, ఆ సామాను లేదు అని అప్పుడు బజారుకి పంపి అవి నచ్చక అతన్నో నాలుగు మాటలనటం, అతను పగలంతా పనితో అలసిఉండటంవల్ల అతనూ ఓ నాలుగు మాటలనటం, ఇద్దరూ ఎడమొఖం, పెడ మొఖం పెట్టి, తప్పించుకు తిరగడం మంచిది కాదు. ఆమె భర్తమీద అక్కసుకొద్దీ సమయమొచ్చినప్పుడు తనవాళ్లదగ్గరా, ఇరుగు పొరుగులవద్దా "మావారికి బజారు చెయ్యటం చేతకాదని" నలుగుర్లో అతన్ని చిన్నబుచ్చుతుంది. అతన్ని అలా అనటంకంటే తనే (ఇంటి ఇల్లాలు) బజారుకెళ్లి ఇంటికి కావలసిన నాలుగూ తెచ్చుకుంటే ఈమెకీ హాయి, ఆయనకీ హాయి ఏమంటారు?

షాపింగ్ ఎప్పుడు చెయ్యాలి? మాకు తీరికే ఉండదు. అని చాలామంది అనొచ్చు. చాలామంది ఇళ్ళల్లో 11 గం॥ కల్లా భోజనాలు పన్లు అయిపోతాయి. అటువంటివారు ఓ రెండుగంటలు రెస్టుతీసుకుని మధ్యాహ్నం షాపింగ్ (బజారు) చేసుకుంటే సాయంత్రం మగవారు ఇల్లుచేరేలోపల మనమూ ఇల్లుచేరుకోవచ్చును.

ఢిల్లీలో 11 గంట లయేసరికి కరోల్ బాగ్ బజారంతా స్త్రీలతో నిండిఉంటుంది· పగలు బజార్లో స్త్రీలు ఎక్కువగా కనిపిస్తారు. ఇంటికి కావలసిన సామానంతా అంటే కిరాణా సామానుదగ్గరనుండి, బట్టలు, టాయిలెట్ సామాను, కూరలు, రేషన్లు (ఇప్పుడు రేషన్లు లేవుకాని) తెచ్చుకోవడం, పిల్లల స్కూలుఫీజు కట్టడంవంటి పనులు అన్నీ స్త్రీలే చేస్తారు.

మనప్రక్క కొన్ని బస్తీల్లో స్త్రీలు షాపింగ్ చేస్తారుకాని అన్ని పూర్లలోనూ స్త్రీలు బజారుకు వెళ్లరు. కొందరు స్త్రీలు ధైర్యంచేసి వెళ్ళినా మిగతా అమ్మలక్కలు ఆమె ఏదో తప్పుచేసినట్టు తక్కువగా చూస్తారు. అందరూ షాపింగ్ మొదలు పెట్టితే ఒకటి రెండురోజులు వాళ్లకి విడ్డూ

ఎస్. సుగుణ

రంగా కనిపించినా మూడో రోజునుండి వాళ్లుకూడ తయారవుతారు. మనప్రక్క షాపింగ్ చెయ్యని కొందరు స్త్రీలు (అందరూకాదు సుమండీ) భర్త ఆఫీసు నుండి ఇంటికొచ్చిన తరువాత, "తను రోడ్డు మొహంచూసిందికి నోచుకోలేదని, ఈ చాకిరీతో ఇంక వేగలేనని, నా ఖర్మ ఇంతే" అంటూ రోజూ భర్తని సాధించే స్త్రీలు ఉంటారు. అటువంటివారు భర్త అనుమతిమీద మధ్యాహ్నం షాపింగ్ చేసి, వంటా అవీ భర్త వచ్చేసరికి పూర్తిచేసి అలా షికారు కెళ్దామంటే భర్తమటుకు వద్దంటాడా?

కొందరిళ్ళల్లో నౌకర్లు బజారుసామాను తెస్తారు. వాళ్ళచేత సరుకులు తెప్పించేకంటే మనము వెళ్లి బేరమాడి కొనితెచ్చుకుంటే సగండబ్బు కలిసొస్తుంది. మంచి సరుకులు తెచ్చుకుంటాము. దగ్గర బజారు లేకపోవచ్చు. అటువంటివారు వారానికి ఓసారో మూడురోజుల కోసారో వీలునిబట్టి తెచ్చుకోవచ్చును. స్త్రీలకి డబ్బు ఎలా ఖర్చుచేయాలో తెలుస్తుంది. చాలామంది ఒంటరిస్త్రీలు ఏమీ ఉబుసుపోవటం లేదని అనటం తరచూ మనం వింటూనేఉంటాము· అటువంటి స్త్రీలు ఇరుగు పొరుగుల సహాయంతో షాపింగ్ చేస్తే పన్లూ అవుతాయి. కాలక్షేపమూ జరుగుతుంది. నా ఉద్దేశం ప్రపంచంకూడ కొంచెం అర్థమవుతుందని.

★

తల్లిదండ్రుల పోలికలు

ఆ దినము మా కాలేజీ లెక్చరర్ కమల గారింట్లో భోజనాలు. వారి సపర్యలు అందుకొని, వారిచ్చిన ఫలహారపు సంచులతో తిరిగి కాలేజీహాస్టలుకు వస్తున్నాము.

"అచ్చంగావారి నాన్నగారి పోలిక సుమా!" అంది మా మీరా.

"నా కంటికి 'చిన్నకమల' లా ఉంది."

"నుదురూ, కళ్ళూ వారి నాన్నగారి విలా ఉన్నా, ముక్కూ, ముఖకళవళిక అంతా కమల పోలికే—మూడు మూర్తులా కమలే"

"నీవు గుర్తించావోలేదో కాని, కమలకు ఎడమచెంపను చిన్న పుట్టుమచ్చ లేదూ, అదీ ఉందోయ్ ఈ చిన్నకమలకు"

"ఎంత ఆశ్చర్యం! అలాంటి చిన్న విషయాలల్లోకూడ తలిదండ్రుల పోలిక రావడము నిజంగా ఆశ్చర్యమే."

"అదేకదోయ్‌మన 'సైకాలజీ' క్లాసులో 'వంశ పారంపర్యము' (Heredity) అంటూ చదువుతాము."

"ఆఁ...అదంతా బి. ఇడి క్లాసులో పరీక్షకని చదివానుకాని, అర్థమై ఏడ్చిందా ఏం?"

"ఏమండోయ్ మిమ్మల్నే...లెక్చరర్ గారూ! మాకు ఈ విషయాలు చెప్పకూడదేం?"

అప్పటివరకూ మాట్లాడకుండా నడుస్తున్న నేను, "అడగండి ఎందుకు చెప్పను?" అన్నాను.

అలా అనడము ఆలస్యం, నామీద ప్రశ్న పరంపర కురిపించారు నాసహోద్యోగులు.

"మన తలిదండ్రుల పోలికలు మనకు ఎలా వస్తాయి?"

"మన తలిదండ్రుల స్వభావము కూడ వస్తుందా?"

"ఒకే తలిదండ్రులకు పుట్టినా, పిల్లలందరు ఒకే పోలికలో ఉండరేమండీ?"

"ఎందుకుండరు? మరి కవల పిల్లలు అచ్చంగా ఒకేలా ఉంటారేం?"

"తలిదండ్రులకు ఉన్న జబ్బులు, బిడ్డలకు కూడ సంక్రమిస్తాయా?"

"మా అమ్మమ్మగారి పోలిక నాకు వస్తుందా?"

"దొంగ కడుపున పుట్టినవాడు గజదొంగ అవుతాడటగా?"

"గ్రుడ్డివాని కొడుకు గ్రుడ్డివాడౌతాడేమి?"

"పుట్టబోయేబిడ్డ ఆడపిల్లా, మగబిడ్డా, అని చెప్పగలమూ?"

"తలిదండ్రుల తెలివితేటలు బిడ్డలకు వస్తాయా?"

"అన్ని ప్రశ్నలకూ జవాబు చెప్పుతాగా. ఆగండి అన్నీ విన్నాక మీ అభిప్రాయాలు చెప్పాలి. ఆ తరువాత మీకు సందేహాలుంటే అడుగవచ్చు" అన్నాను.

మనకు మన తలిదండ్రుల పోలికలు ఎలా వస్తాయి?

తల్లి గర్భములోని అండము (Ovum) తో తండ్రి పురుషబీజము (Sperm) కలసినపుడు పిండము ఉత్పత్తి అవుతుంది. ఇది క్రమక్రమముగా అభివృద్ధిచెంది నవమాసాలు నిండిన తరువాత "శిశువు"గా జన్మిస్తుంది.

కనుక ప్రతి శిశువూ జన్మించేటప్పుడు తన తండ్రినుండీ, తల్లినుండీ కొంతభాగము తీసికొని దానిని "తనది"గా చేసికొని రూపం ధరిస్తుంది. అందువలన ప్రతి శిశువులోనూ కొన్ని తల్లి పోలికలూ, కొన్ని తండ్రి పోలికలూ కన్పించుతాయి. అసలు జరిగే దేమిటి, అంటే!

తల్లి అండములో 24 జతలు (48) "క్రోమోసోమ్‌లు" అనే పదార్థములుంటాయి. అలాగే తండ్రి బీజకణములో కూడ 24 జతలు (48) "క్రోమోసోమ్‌లు" ఉంటాయి. వీటిలో "జీన్"లు అనే పదార్థాలుంటాయి. ఈ "జీన్"లలో మనకు మన తలిదండ్రులనుండి వచ్చేపోలికలు గుప్తముగా ఉంటాయి. కొన్ని "జీన్"ల కలయిక వలనే మనము "ఎఱ్ఱగా" ఉండేది "నల్లగా" ఉండేది, నిర్ణయ మౌతుంది. ఈ "జీన్"ల వలనే మనకు అమ్మగారి నొక్కుల జుట్టు నాన్నగారి "విశాల ఫాలము" వస్తాయి,

ఎ. ఆర్. సుహాసినీఫిలిప్
ఎం. ఏ; ఎం. ఇడి.

మానవజాతికి 48 క్రోమోసోమ్‌లే ఉండాలి. పిండము ఏర్పడే టప్పుడు తల్లి కణములో 48 క్రోమోసోములు తండ్రి కణములో 48 "క్రోమోసోములు" ఉంటే మొత్తము 96 క్రోమోసోములు శిశువుకు వస్తాయి కదూ? అలా రాకూడదు. 48 క్రోమోసోములు మాత్రమే ఆ పిండములో ఉండాలి. కనుక ప్రకృతి ఒక్కొక్క కణములోనుండి 24 క్రోమోసోములు విసర్జించి వేస్తుంది. పుట్టేశిశువు ఎప్పటిలా 48 క్రోమోసోములతో జన్మిస్తాడు. ఈ క్రోమోసోములే మన తలిదండ్రుల పోలికలు మనకు మోసికొని వస్తాయి. ప్రతి శిశువూ తన తలిదండ్రులనుండి $\frac{1}{2}$ వంతు, తాతలనుండి $\frac{1}{4}$, ముత్తాతలనుండి 1/8 వంతు, 4 వ తరము పూర్వీకులనుండి 1/16 ఇలా యీ వారసత్వం తెచ్చుకుని ఈలోకములోనికి అడుగు పెడతాడు. కనుకనే కొంత మంది శిశువులలో అమ్మమ్మ ముత్తవ్వల, తాతముత్తాతల పోలికలూ కన్పిస్తాయి. తరాలు దాటేకొలది ఈ పోలిక అంతగా కన్పించదు.

"మా యింటి ప్రక్కన ఒకావిడ ఉంది. ఆమెకు ఉంగరాలజుట్టు. ఆమె ముగ్గురు పిల్లలకూ ఉంగరాల జుట్టే. ఆవిడ భర్తగారికి సూదులలా ఉండే జుట్టు. ఆ జుట్టు పిల్లలలో ఎవరికీ రాలేదు. కారణం?

తలిదండ్రులలో ఉండే లక్షణాలన్నీ రెండు రకాలు. (1) ప్రముఖమై బలంగా ఉన్నవి. (2) బలహీనమైనవి. ప్రముఖమైన లక్షణాలు బిడ్డలలో మరింత ప్రముఖముగా కన్పిస్తాయి. బలములేని లక్షణాలు మరింత బలహీనమై క్రమేణ నశించిపోతాయి. మీ ఇంటి ప్రక్కనున్న భార్యా భర్తలలో వెంట్రుకలకు సంబంధించిన జీన్‌లలో భర్త జీన్‌లకంటే భార్య జీన్‌లు బలమైనవి అన్నమాట. అందుకే ప్రముఖ లక్షణాలు బాగుగా కనిపించి, దుర్బల లక్షణములు కనిపించలేదు.

ఒక్కతల్లి కడుపున పుట్టిన బిడ్డలంతా అచ్చంగా ఒకేమాదిరిగా ఉండరెందుకు?

ఒక్కతల్లి కడుపున పుట్టిన బిడ్డలలో కొన్నిసార్లు కవల పిల్లలు అచ్చంగా ఒక మాదిరిగా ఉండవచ్చు. అంతేగాని తక్కిన పిల్లలలో కొద్దిగా పోలికలు ఉన్నా, అచ్చం ఒకేమాదిరిగా ఉండరు. ఎందుకంటే:

ఇందాక ప్రతి మానవకణములో 48 లేక 24 జతల క్రోమోసోములు మాత్రమే ఉండాలి అని చెప్పాను. జ్ఞాపకముందా? పిండోత్పత్తి జరిగేటప్పుడు తల్లికణమునుండి 24 క్రోమోసోములు, తండ్రి కణమునుండి 24 క్రోమోసోములు విసర్జించేటట్లు చేయించడము సృష్టిబాధ్యత. పిండము నిర్మాణమయ్యేటప్పుడు ఎప్పటిలా తల్లినుండి 24, తండ్రి నుండి 24 మొత్తము 48 క్రోమోసోములతో పిండము ఏర్పడుతుంది.

1వ బిడ్డ—పొడుగు, నొక్కుల వెంట్రుకలు, చిన్న చెవులు, పచ్చని ఛాయ.

2వ బిడ్డ—పొట్టి,నొక్కుల వెంట్రుకలు, పెద్దచెవులు, నలుపు.

3వ బిడ్డ—పొడుగు, నిడుపైనవెంట్రుకలు, చిన్న చెవులు. పచ్చఛాయ.

4వ బిడ్డ—పొట్టి, నిడుపైన వెంట్రుకలు, పెద్దచెవులు, నలుపు.

ఇంకా ఈలక్షణాలే వేరవేరే కలయికలలో రావచ్చును. ఈబిడ్డలో ఈలక్షణాలే ఉంటాయి అని చెప్పడానికి వీలు లేదు. ఎందుకంటే 48 క్రోమోసోములు, 24 గా తగ్గించబడేటప్పుడు ఏవి వుంటాయో ఏమి వశిస్తాయో ఎవ్వరూ నిర్ధారణ చేయలేరు. అందుకే సహజన్ములలో ఒక్కొక్కరు ఒకొకమాదిరిగా ఉండడము—ఏవో కొన్ని పోలికలు మాత్రము ఒకటిగా ఉండవచ్చు—మా లక్షణమాటలకు అంతా నవ్వుకొన్నాము.

మరి, కొంతమంది కవలపిల్లలు అచ్చం ఒకేపోలికలో ఉంటారు ఎందుకు?

జాగ్రత్తగా పరిశీలించిచూస్తే మనము రెండురకములైన కవలపిల్లలను చూడవచ్చు.

(1) ఏ పోలికాలేని కవలలు (Fraternal twins)

(2) అచ్చుగుద్దినట్లుండే కవలలు (Identical twins)

రెండోరకపు కవలలను మనము కొన్నిసార్లు పోల్చుకోలేము. తల్లులుకూడ పొరబడడము ఉంది. "కామెడీ ఆఫ్ ఎరర్స్" "కార్సికన్ బ్రదర్స్", మున్నగు కథలలో కూడ ఇలాంటి కవలలను గూర్చిన హాస్య సన్నివేశాలు చూడగలము. ఇద్దరూ ఒకేలా ఉండడము ఎలా

పిల్లలకు ఎలా వస్తాయి?

తన 48 క్రోమోసోములలో ఏ 24 ఉంచి ఏ 24 విసర్జించాలో అది తల్లి యిష్టములో గాని, తండ్రి ఇష్టములో గాని లేదు. ఆహక్కు సృష్టికి మాత్రమే ఉంది. ఒకసారి బిడ్డ ఉత్పత్తి అయ్యేటప్పుడు విసర్జింపబడిన క్రోమోసోములు మరియొకసారి విసర్జింపబడకపోవచ్చును. ఒక్కొక్కసారి పిండోత్పత్తి అయ్యేటప్పుడు ఏ క్రోమోసోములు ఉండాలో,ఏవి విసర్జింపబడాలో నిర్ణయించే శక్తి సృష్టికి మాత్రమే ఉంది. తలిదండ్రుల ఇష్టములో లేదు. ఒకసారి ఒకరకమైన క్రోమోసోములుండవచ్చు. మరోసారి మరోరకము విసర్జింపబడవచ్చు. కనుక ఒకే తలిదండ్రులకు పుట్టినబిడ్డలలో తలిదండ్రుల పోలికలు కన్పించినా, ఒకసారివచ్చిన లక్షణాలన్నీ మరోసారి రావు. ఏవో కొన్ని రావచ్చు, లేదా రాకపోవచ్చు. అందుకే ఒకే తలిదండ్రులకు పుట్టిన తోబుట్టువుల రూపురేఖలలో, తెలివితేటలలో చాల భేదము కన్పించుతూంది.

పోలికలు, తేడాలు

ఉదాహరణకు ఒక తండ్రి పొడగరి, నొక్కుల జుట్టు, పెద్ద చెవులు, నల్లని శరీర ఛ్ఛాయఅనుకోండి. తల్లిపొట్టి, నల్లని నిడుపైన వెంట్రుకలు, చిన్న చెవులు, పచ్చని ఛాయఅనుకోండి. వారికి నలుగురుపిల్లలుంటే వారు ఈవిధంగా ఉండవచ్చును.

"అదీ ఒకవిధంగా మంచిదే—లేకపోతే ఆ[ట్రేడ్‌మార్కు] మొహాలన్నీ చూడలేక మనకు విసుగెత్తి ఉండేది. అంతమట్టుకు భగవంతుడు మనల కరుణించాడు!"

సాధ్యము? మరి ఈ సందర్భములో ఒకే రకమైన క్రోమోసోములు రెండు సార్లు కలశాయా?

ఈ సందర్భములో ఏమి జరుగుతుం

శాగో పట్టీస్

కావలసిన పదార్థములు:- సగ్గుబియ్యము-½ శేరు, బంగాళ దుంపలు-¼ వీశ, పదిపలాలు నూనె, తగుమాత్రం, జీడిపప్పు, కొత్తిమీర, కరివేపాకు, పచ్చిమిరపకాయలు.

తయారుచేయు విధము:- రేపు ఈ పిండి వంటచేసుకుంటామనగా యీరోజురాత్రి సగ్గుబియ్యము నానపోసుకొనవలెను. మరునాడు వుదయము బంగాళదుంపలు ముక్కలుగా తరిగి బాగా వుడకపెట్టవలెను. జీడిపప్పు చిన్న చిన్న ముక్కలుగా తరుగుకొనవలెను. పచ్చిమిరపకాయలు, కరివేపాకు, కొత్తిమీరకూడా సన్నగా తరుగుకొనవలెను. ఇవి అన్ని ఒక పళ్ళెములో వుంచుకొనవలెను. బాగుగా నానిన సగ్గుబియ్యమును రుబ్బి ముద్దచేసికొని ఒక పళ్ళెములో వుంచుకొనవలెను. బంగాళా దుంపలు ఉడికించి చెక్కతీసిబాగుగాపిసికి ముద్దచేసి, సగ్గుబియ్యము ముద్దను యీ బంగాళదుంపల ముద్దలో కలపవలెను. జీడిపప్పు, కొత్తిమీర, కరివేపాకు, పచ్చిమిరపకాయల ముక్కలను ఈ ముద్దలోకలిపి బాగపిసికి ఒక ప్రక్కన పెట్టుకోవాలి. నూనెను ఒక బూరెల మూకుడులోపోసి బాగుగా కాచి ఈ ముద్దలోంచి కొంచెం కొంచెంగా తీసి ఒక ఆకుమీద వేళ్ళు తడిచేసి గారెలవలె ఆకుమీద వత్తితీసి నూనెలో వేయించవలెను. వేగిన తరువాత ఒకపళ్ళెములోకి తీసికొని చల్లారిన పిదప తినిన రుచిగాయుండును. కావలసినవారు అల్లముకూడా వేసికొనవచ్చును. ఒకసారి కొంచెము పచ్చిగా వేసి, తిరిగి రెండవమారు వేసిన రుచిగా యుండును.

వల్లూరి అనూరాధ.



పిల్లలకు అసలు జబ్బులు రాకుండానే చూసుకోవచ్చు. వేళకు అన్నంపెట్టి, నిద్రపుచ్చడం. వారి దుస్తులు, పడకబట్టలను శుభ్రంగా ఉండేలా పరిమాచుకుంటే జబ్బులు రానేరావు. అథవా వచ్చినా తరుణంలో మందు వెయ్యడానికి బద్ధకిస్తే, గోళ్ళతో తీసేది గొడ్డలిదాకా పోతుంది. పిల్లలకు సాధారణంగా జ్వరం వచ్చినప్పుడు ఏడ్చారుగదా అని తొందరపడి వాళ్ళకు పెట్టేదానికన్నా ఓ రోజు ముందు అన్నం పెడుతూంటాం. జ్వరం కొద్దిగా లోపల నిలిచిందంటే జీర్ణజ్వరం క్రింద పడుతుంది. పిల్లలు పైకి బాగా కనపడ్డా లోపల జీర్ణజ్వరముంటే, అన్నహితవు పోయి పిల్లలు చెడిపోతారు. జ్వరం బాగా జీర్ణిస్తే, లివర్ చెడిపోవడం, కామెర్లు వగైరా జబ్బులు రావచ్చు. జ్వరం లోపలుందని మన మనుకుంటే...

జీర్ణజ్వరాలకు

మూడు నుంచి 5 సం॥ పిల్లలకైతే 4 మిరియాలు, 5 నుంచి 10 సంవత్సరాల పిల్లలకైతే 8 మిరియాలు తీసి రాత్రి రెండు టీస్పూన్ల పుల్లమజ్జిగలో నానెయ్యాలి. తెల్లవారేక ఆ నానిన మిరియాల్లో చిన్న సిందూరంపలుకు వేసి, చిన్న కల్వంలో ఆ మజ్జిగపోసి బాగా నూరి మాత్రకట్టి వేయాలి. అలా ప్రతిరోజు

డి. భాస్కరమ్మ

వేస్తే 'లోజ్వరం' ఇట్టే హరించి ఆకలి పుట్టిస్తుంది. వారం పది రోజులు వేస్తే సరిపోతుంది.

ఊపిరి నొప్పి

ఊపిరి నొప్పి సాధారణంగా బాగా వేడి చేసి వస్తుంది. ఇది వస్తే గుండెల్లో పోటులా వచ్చి, ఊపిరితీస్తే చాలా బాధ పెట్టేస్తుంది. అలా వచ్చినప్పుడు ఓ అరకప్పు కాచిన నీళ్లలో ఒక టీస్పూన్ నెయ్యివేసి త్రాగితే ఆ నొప్పి తగ్గుతుంది.

చెవిపోటుకు

నవాసేరు కందదుంప తెచ్చి బాగా కడిగి, రోట్లో వేసి బాగా దంచి రసం తీసుకోవాలి. తీసినరసం వడగట్టి, ఎంత రసమో అంత మంచినూనె కలిపి బాగా కాచాలి. రెండూ కలిపింది ఎంతవుందో అందులో సగమయ్యేలా కాచాలి. (అనగా రెండూ రెండు కప్పులుంటే) రసమూ కప్పు, నూనె ఓ కప్పు వుంటే ఓ కప్పు అయ్యేలా కాచాలి. రెండేసి చుక్కలు చెవిలో వేసుకుంటే పోటు తగ్గిపోతుంది. ఈ నూనెకి ఎర్రకంద దుంప వాడాలి (అనగా దురద కంద దుంప) కాచిన నూనెను చల్లారనిచ్చి వొడగట్టి ఒక తడిలేని సీసాలోపోసి దాస్తే ఎన్నాళ్ళయినా నిలవ వుంటుంది. ఇంత చెయ్యడానికి ఓపిక లేనివారు, ఓ చిన్న కంద ముక్క తీసుకు చితకగొట్టి సున్నంలోకలిపి గుడ్డలో వేసి పోటువచ్చిన చెవిలో నాలు చుక్కలు పిండినా తగ్గుతుంది. ఈ రెండూ కాకుంటే దొడ్లో బొప్పాయిచెట్టు వుంటే ఆఆకు బాగానలిపి పసరుపిండినా తగ్గుతుంది.

కళ్ళకలకలకు

సాధారణంగా యీ కళ్ళకలక వచ్చిందంటే ఇంటిల్లిపాదిని ముట్టడిస్తేగాని వదలదు. తగని బాధ పెడతాయి కళ్లు. అలా వచ్చేముందే (అనగా కన్ను కొద్దిగా ఎఱ్ఱపడి నీరు కారినప్పుడే ఆ కంట్లో రెండు చుక్కలు ఈకంట్లో రెండుచుక్కలు నువ్వులనూని వేసుకుంటే కలక తేలిపోవచ్చు. అథవా వచ్చినా తేలిగ్గా వస్తుంది. కొద్ది మంట భరించగలిగితే నీరుల్లిపాయి చితగ్గొట్టి ఆ రసం చెరిరెండు చుక్కలూ వేసుకున్నా తగ్గిపోతుంది. పిల్లలకు కలకవచ్చి తగ్గిన ఒక వారం వరకు కండ్లు అంటుకుంటూంటాయి. రాత్రి పడుక్కున్నప్పుడు వంటాముదం వెచ్చబెట్టి రెండు కళ్లలోను వేసినట్లయితే తెల్లవారి లేచుసరికి కళ్లు అంటుకోవు.

చిడుము, గజ్జి

గజ్జి చిడుము, కురుపులు, వేసవిలో వచ్చే నెత్తురు గడ్డలు కూడా చాలా బాధాకరంగా వుంటాయి. చిడుము అంటువ్యాధిలాంటిదే. ఒకరితో వదిలిపెట్టదు పిలలకొస్తే పెద్దలకు అంటుతుంది. పెద్దలకొస్తే, పిల్లలకు అంటుతుంది. వొక్కొక్కప్పుడు ఇంట్లో ఎవరికీ లేకున్నా గాలి మారినప్పుడు వస్తూంటాయి. (కె.పద్మజగారు వ్రాసిన తులశాకు మిరియం వగయిరా వైద్యాలు తరుణంలో అయితే తగ్గచ్చు) కాని ఇవి చాలా మొండిజబ్బులు. నెలలపిల్లలకువస్తే సంవత్సరంవరకు, సంవత్సరందాటిన పిల్లలైతే మూడోఏడువరకు వదలదంటారు. అదికాదని ఇది, ఇదికాదని అది, వైద్యం చేస్తూవుంటే ఏదో ఒకదానికి తగ్గి తీరుతాయి. చిడుము బిడ్డలు ఒళ్ళంతావున్నప్పుడు భరించే తల్లిబాధ చెప్పలేం. అలా వున్నప్పుడు నీరుడుగింజలు, బావంచాలు

(56-వ పేజీ చూడండి)

తలితండ్రుల పోలికలు

వంటే, తల్లిగర్భములో నున్న అండము, పురుష బీజముతో కలసి "పిండము"గా ఏర్పడిన తరువాత, ఏదో ఒక కారణము (చెప్పలేనికారణము)వలన రెండు భాగములుగా విభజింపబడి, రెండు భాగాలు వేరైపోతాయి. ఈ రెండూ విడివిడిగా, అభివృద్ధియై ఇద్దరు శిశువులుగా జన్మించుతారు. ఇద్దరూ ఒకే పిండములో నుండి వచ్చారు గనుక ఒకే రకపు "క్రోమో సోములు" కలిగియుంటారు. ఒకే పోలికలో ఉంటారు. ఇలా అచ్చంగా ఒకేలా ఉండే కవలలు, ఉంటే మగవారుగా వుంటారు లేదా ఆడవారుగా ఉంటారు. అంతేగాని వారిలో ఒకరు మగబిడ్డగా మరియొకరు ఆడపిల్లగా ఉండరు. వీరిద్దరూ, శరీర లక్షణాలల్లో, మెదలో, భావనా ప్రకృతిలో ఒకే మాదిరిగా ఉంటారు—ఒకే పరిసరములో పెరిగితే.

(సశేషం)

స్త్రీలు—రైలు ప్రయాణాలు

శ్యామలాదేవి

రైలు ప్రయాణం మీద వ్యాసం వ్రాయమనే వారు తెలుగు మాస్టారూ, ఇంగ్లీషు టీచరున్నూ. అన్ని విషయాలు అమ్మ చూచుకొనేది కాబట్టి ప్రయాణం అంటే సరదా, అంతేగాని అందులోని అవస్థలేమీ కష్టేవి కావు. ఎంత సరదాగా ప్రయాణం చేసే వాళ్లమో, ఏమేమి చూచేవాళ్లమో అవన్నీ వివరంగా వ్రాసేవాళ్లం.

ఏదైనా ఊరు వెళ్తున్నామని తెలిస్తే అట్టే ఎగిరి గంతేసేవాళ్లం. రైలు పెట్టెలో కూర్చొని అమ్మ జాగ్రత్త చేయమని ఇచ్చిన మరచెంబును ఒళ్లో పెట్టుకొని, కిటికీగుండా గంటలకొలది చూస్తూండడం హాయిగా ఉండేది. ఇప్పుడు ప్రయాణమంటేనే తలనొప్పి. రైలుదిగిన మరుదినంవరకు ఆ ప్రయాణ బడలిక పోదు. ప్రయాణీకులకు అందులో స్త్రీలకు సరైన సదుపాయాలు లేని మూలాన్నే చాల అవస్థపడుతుంటారు.


ఒక్క పెట్టె: పుట్టెడు సామాను

మూడవ తరగతి పెట్టెల్లో స్థలం దొరకడం అతికష్టం. ఆడవాళ్ళకు కేటాయింపబడిన పెట్టెలు చాలా కొద్ది. దానికితోడు మగవారు సామానంతా తెచ్చి స్త్రీల పెట్టెల్లోనే పడేయడం వారు ఒంటిగా ఎక్కి ప్రతి స్టేషన్లో పచార్లు కొట్టడానికే కాబోలు. ఒకసారి ఇలాగే మూడో తరగతిలో ప్రయాణం చేస్తుండగా అసలే క్రిక్కిరిసి ఉన్న బండిలోకి జనం త్రోసుకొని వస్తున్నారు. ఒకావిడ అందర్నీ నెట్టుకొంటూ లోపలికి వస్తూనే నాలుగు బరువైన బుట్టల్ని పెట్టెలోకి చేర్చింది. 'బండి కదిలేక సర్దుకొందామమ్మా' అంటూనే ఒక్కొక్క బుట్టనీ ఒక్కొక్కరి కాళ్లమీదకు ఒళ్లోకి, తలమీదకి ఇలా నెట్టేసింది. ఇంకా రెండు బుట్టలు ప్లాట్ ఫారంమీదే మిగిలిపోయినయ్. ఏమండోయ్, అవికూడా యిలా అందియ్యండి. మీ దగ్గరుంటే మనకిక ఊరగాయలుండవన్నమాటే. అంటూ పసిపిల్ల నెత్తుకున్న పక్కావిడ డొక్కలోకి మోచేత్తో పొడుస్తూ హెచ్చరించింది. ఇహ తర్వాత మేమనుభవించిన కష్టాలు వ్రాయక్కర్లేదు.

స్టేషన్ స్టేషన్‌కు రైలాగినప్పుడల్లా కొంచెంసేపు నరకం అనుభవించాల్సిందన్న మాటే. ఇహ రైలుసాగిందా, కొట్లాటమొదలెడ్తారు. దానికి మధ్య మధ్య ముష్టి పిల్ల కీచుగొంతుక వినిపిస్తుంటుంది. ఈ కలహాలు వినడానిక్కూ ఘోరంగా ఉంటాయి. మౌనంగా నిల్చున్నామంటే కొన్ని స్టేషన్లు దాటాక మనకే, కనీసం కూర్చోడానికైనా స్థలం తప్పక దొరుకుతుంది, లేదా ఏ పెట్టె మీదైనా వీలుచూచుకొని కూర్చోవచ్చు.

మూలల్లో బెడ్డింగులు పరచుకొని గుర్రుపెట్టే పెద్దమనుషుల్ని చూస్తే ఒళ్ళు మండుతుంటుంది. చాల దూరప్రయాణం చేస్తున్నామన్న సాకు చెప్తారు వాళ్ళు. వాళ్ళనిచేరి కొంచెం స్థలం ఆక్రమించాలన్నా ఈమధ్య సముద్రాలు, వంతెనలూ దాటి, పైగా తిట్లుతిని మరీపోవాలి. ఒకసారి రెట్రేను ఎక్కడానికి లేచిందో కావిడ. చెప్పులు వేసికొని దాటపోయేసరికి ఇంకోఆవిడ కాలికితగిలి ఆమె వేడిచూపులకు గురైంది. సరేనని వదిలేసివెళ్లింది. ఒక స్టేషన్లో రైలు ఆగినపుడు ఆవిడ తిరిగివచ్చి సామాన్లు చూచుకొని ఇక చెప్పులుకోసం చూస్తే అప్పటికే మాయమయ్యాయి. "హరి భగవంతుడా, నిన్న నేనండి ఆ క్రొత్త చెప్పులు కొనుక్కొన్నాను" అని భగవంతుని మొదట స్మరించి, తర్వాత నన్నుద్దేశించి చెప్పింది. పాపం బెంచీల క్రిందంతా కూడా వెతికింది. మంచిమనిషి కాబట్టి అందర్నీ తిట్టిపోయకుండా దీనంగా చూస్తూ అక్కడితో ఊరుకొంది. ప్రతినిమిషంకూడా 'దొంగలున్నారు జాగ్రత్త' సూచనని స్మరిస్తూ మెలకువతో ప్రయాణాలు చేయాలి. ఎంతసిగ్గు పడవలసిన విషయమో?

స్టేషన్లలో రైలుకోసం కనిపెట్టుకొని కూర్చొన్నప్పుడు బాధలు చెప్పలేము. స్త్రీలకు, మూడవతరగతి ప్రయాణీకులకు వెయిటింగ్ రూమనేది ఉండదు. ఒంటరిగా ప్రయాణం చేసేటప్పుడు స్త్రీలకు మూడవతరగతి ప్రయాణమే శ్రేష్ఠము. చాలమంది పెట్టెలో ఉంటారు కాబట్టి మూడవతరగతిలో తక్కువమంది ఉండడం చాల అరుదు. కూలి నాలి చేసికొనే వారు తప్ప మిగిలినవారందరూ వెయిటింగ్ రూమ్‌లోనే ఉంటాని కిష్టపడతారు. కాని మూడవతరగతి స్త్రీ ప్రయాణీకులకు వెయిటింగ్ రూములుంటేగా. ఒకసారి రైలు నాలుగ్గంటలాలస్యముందని కూలివాడు వెయిటింగు రూములో సామాను సర్దాడు. ఐదునిమిషాలున్నామో లేదో చెకింగ్ ఆఫీసరొచ్చి బయటికి వచ్చెయ్యాలి మూడవ తరగతి ప్రయాణీకులంతాను' అని చెప్పేశాడు. ప్లాట్ ఫారంమీద ఒంటరిగా ఆ నాలుగ్గంటలు నేనెలా గడపాలా అని విచారిస్తూండగా ట్రాలీ పోవడాన్ని స్థలంలేక నాకు నా సామాన్లను ఇంకో స్థలానికి చేర్చాడు. ఇలా ప్లాట్ ఫారంమీద బదలీలుగూడా జరిగాయి. అలా కాకుండా మూడవతరగతి స్త్రీ ప్రయాణీకులకుకూడా ప్రత్యేక వెయిటింగురూములు కనీసం కొన్ని జంక్షన్లలో పెద్ద స్టేషన్లలో ఉంటే ఎంతో వీలుగా ఉంటుంది. స్త్రీలకు ప్రత్యేకింపబడే పెట్టెల సంఖ్యను గూడా ఎక్కువచేస్తే ప్రయాణ బాధలు తగ్గుతాయి. మనకూ, మన పిల్లలకూ ప్రయాణమునకు కావలసిన కొద్ది వస్తువుల్ని మాత్రం మన దగ్గరుంచుకొని మిగత (ఊరగాయజాడీలున్న బుట్టలైనాసరే) మగవాళ్ళ అధీనంలో ఉంచామంటే మనం చెప్పకుండానే అవి సురక్షితంగా గమ్యస్థానం చేర్తాయని నా నమ్మకం. మన సోదరీలకు గూడా సహాయం చేసిన వాళ్లమౌతాము. ★



దిండు కవర్ మీదకు డిజైన్

— ఇ. నిర్మల.


పుష్పమువలె...
రెక్సోనాతో మీ చర్మ
సౌందర్యము వికసించును
రెక్సోనా సబ్బులో కేడిల్...చర్మమును పోషించునటువంటియు మీ సహజ సౌందర్యమును బయల్పరచుటకు సహకరించునటువంటియు ఒక ప్రత్యేక నూనెల మిశ్రమము గలదు.
Rexona
BLENDED WITH CADYL
ఇది ఒక్కటే కేడిల్‌తోగూడిన సబ్బు
రెక్సోనా ప్రొప్రయిటరీ లిమిటెడ్ తరఫున భారతదేశంలో తయారుచేయబడినది
RP. 148-X52 TL

తలుపు పిలుపులు

తలుపు పాటలు విన్నారా! వినేవుంటారు.

తలుపు పాటలంటే పెనుగాలి వేసినప్పుడు ఇంటి తలుపులు కొట్టుకొని చేసే నాదాలు కాదు. వివాహ, గృహప్రవేశాది సమయాలలో ముత్తైదువలు తలుపుల దగ్గర నిల్చొని కమ్మని కంఠాలతో ఇమ్ముగా పాడతారు. అవి నూతన వధూవరులకు ఆతురతచే రుచించకపోయినా వినేవారికిమాత్రం వీనుల విందులే. వాట్లో రామాయణ భారతగాథలూ ఉంటవి :

రాముడు:

శ్రీ తరుణిరో నే శ్రీరఘురాముడ
చేరి కవాటము దీ - వే -
చేరి కవాటముదీ - వే - .

సీత:

ఖ్యాతిగ శ్రీ రఘురాముడవైతే
కోతులఁజేరఁగదోయీ
ఘనసేతువు గూర్పఁగదోయీ"

విన్నారా ఆ సతీపతుల సంభాషణ. ఈ తలుపుపాట మరవగలమా - తలుపుదగ్గఱ నిల్చొని పాడే పాటలను తలుపు పాటలని లక్షణయా అర్థం చెప్పితే తలుపుదగ్గఱనిల్చొని పిల్చే పిలుపులు తలుపు పిలుపులేగా. విట్లో వింతలూ విపరీతాలు ఉన్నవి.

పిలుపుల్లో మజాలుఎన్నో. మన మితరుల్ని అనేకవిధాలుగా పిలుస్తాము. "పాటీ!" "షాధుగూ!"ఎట్టా,కట్టీ!బడ్డూ!జడీ!ఇంతేనా వీటికి ముందు సంబోధనా వాచకాల్ని గూడా తగిలిస్తాము "ఒరే బడ్డూ, అరే" స్త్రీలనైతే ఒసే, ఒలే పదాలు ఎవరో అపరిచిత వ్యక్తి దూరంగా పోతూవుంటే, అతను గొడుగు పట్టుకుంటే ఓగొడుగూ!, కఱ్ఱ పట్టుకుంటే ఓకఱ్ఱా! టోపీ వేసుకుంటే ఓ టోపీ!" అని, పూలనమ్మినవానినైతే ఓ పూలూ! అని, కట్టెలమ్మినవానిని "ఓ కఱ్ఱలూ" అని మిఠాయి వానిని "ఓ మిఠాయీ" అని ఇట్లా రకరకాలుగా పిలుస్తాము. ఇంతకూ చెప్పేదేమంటే పేరుపెట్టి పిలవడం మన సాంప్రదాయం కాదూ అని. మనశాస్త్రాలే అందుకు నిదర్శనం.

శ్లో॥ ఆత్మనామ గురోర్నామ
నామాతికృపణస్య చ
శ్రేయస్కామో న గృహ్ణీయాత్
జ్యేష్ఠాపత్యకళత్రయోః॥

(భావము:—శ్రేయసును గోరుకొనెడివాడు తనపేరును, గురువుపేరును, అతినీచుని పేరును, పెద్దకుమారు (కుమార్తె) పేరును, భార్యపేరును గైకొనగూడదట. అంటే వారిని పేరుపెట్టి పిలవడంగాని, పేరు నితరులకు చెప్పడంగాని కూడదు—)

ఒకవేళ ఎవరైనా మీ పేరేమిటండీ అంటే పెద్ద చిక్కే. రామారావు అంటారు అని సమాధానం చెప్పితే తప్పులేదు. నేటి నవీన నాగరిక శిరోమణులు 'లీలా, లలితా, పద్మా, సరోజా, రత్నం' అని రకరకాలుగా పేరుపెట్టి తమ కాంతారత్నాల్ని పిలిస్తున్నారుగాని మన పూర్వులు

ఎ. ఎల్. నాయుడు

మాత్రం అట్లా పిలిచేవారుగాదు. నేటికీ పెద్దలు ఇంటికి వచ్చినపుడు తలుపును వ్రేలితో తట్టుతూ "తలుపు, తలుపూ!" అని శబ్దం చేస్తారు. అంటే తలుపు పలుకుతుందా. ఇంట్లో నున్న యిల్లాలు వస్తుంది. గొళ్లెం తీస్తుంది. ఇదే మన భారత సంప్రదాయం. చూడండీ-పూర్వం గోపాలుడైన శ్రీకృష్ణుడు వచ్చి తలుపు గట్టిగా తట్టితే లోపల నిద్రపోయిన గోపాంగన లేచి వచ్చిందేగాని వెంటనే తలుపుతీయక విపరీతార్థాలు తీసింది. ఆ సరస సంభాషణ వింటే అర్థం అవగతమైతే ఆనందించని వారుండరు-ఇంతకూ ఈ శ్లోకం ప్రార్థనారూపం ధరించింది.

శ్లో॥ "అంగుళ్యా కః కవాటం ప్రహరతి
కుటిలే? మాధవః, కిం వసంతః?
నో చక్రీ, కిం కులాలః? నహి ధరణిధరః
కిం ద్విజిహ్వః ఫణీంద్రః?
నాఽహం ఘోరాహిమర్దీ; త్వమసి ఖగపతిః? నో హరిః, కిం కపీంద్రోఽ
సీ? త్యేవం గోపకన్యా ప్రతివచనజడః
పాతు వశ్చక్రపాణిః"

గోపిక : ఎవడా కుటిలుడు! వ్రేలితో తలుపు బాదుతున్నాడు!

కృష్ణుడు : నేను, మాధవుడను.

గోపిక : వసంతుడవా! (1. మాధవః=లక్ష్మికి భర్త 2) వసంతుఁడు. అని రెండర్థాలు.)

కృ : కాదు, కాదు, నేను చక్రిని.

గో : కుమ్మరివాడవా (చక్రి=చక్రాయుధధారి, కుమ్మరి సారె గూడా చక్రమే గాన కుమ్మరివాఁడు.)

కృ : కాదు, ధరణీధరుడను (భూమిని మోయువాడను)

గో : ఓహో, అయితే శేషాహివా (శేషుడు భూమిని ధరిస్తాడు గదా)

కృ : కాదు, నేను ఘోరసర్పాలను మర్దించువాడను (కాళీయమర్దనము గావించాడు)

గో : నీవు ఖగపతివైన గరుత్మంతుడవా! (గరుత్మంతుడు పాములను మర్దిస్తాడు గదా)

మతి జవాబు చెప్పలేకపోయాడు కేశవుడు.

కేశవుడే గాదు శివుడు గూడా అదే పరిస్థితులో నోరుమూసుకొన్నాడు. భిక్షానికి పోయి ఇంటింటా తిరిగి అలసిసొలసి తన యింటికి వచ్చి తలుపు తట్టి పార్వతిని పిల్చాడు. వినండి ఆ పార్వతీ పరమేశ్వరుల సంభాషణ.

శ్లో॥ కస్త్వం? శూలీ, మృగయ భిషజం!
నీలకంఠః ప్రియోఽహం;
కేకా మేకాం కురు! పశుపతిః; నైవ
దృశ్యే విషాణే!
స్థాణుర్ముగ్ధే! నవదతి తరుః; జీవితేశః
శివాయాః
గచ్ఛాటవ్యా మితి హృతయశః పాతు
వశ్చంద్రమౌళిః

పార్వతి : నీ వెవడవు.

ఈశ్వరుడు : శూలిని (త్రిశూలధారి)

పార్వతి : అయితే వైద్యుని దగ్గరకు పో (శూలము అంటే నొప్పి అని గూడా అర్థం)

ఈశ్వ: ప్రియా! నేను నీలకంఠుడను (హాలహాలముచే నీతని కంఠము నల్లనైనది)

పార్వతి: అయితే ఒక్క కేక పెట్టు (నెమలికి గూడా నల్లని కంఠము గదా)

(56-వ పేజీ చూడండి)

ఉత్తరాలు:

అద్దె కొంపలూ, అగచాట్లూ

ఇల్లుగలవాళ్లు ప్రక్కనవుంటే ఆ ఇంట్లో అద్దెకువుండి కాపురంచేయడ బహుకష్టం. కచ్చితంగా అద్దె తీసుకున్నా ప్రతి చిన్న విషయానికీ పేచీ పెడతారు. అందరినీ యాగీ చేస్తారు. గొడ్లో ఏమైనా మొక్కలుంటే శ్రద్ధగా చూడమంటారు. పువ్వులు, కాయలుకు మాత్రం అద్దెవాళ్లు దగ్గరకు చేర కూడదు. వాళ్లకిష్టముంటే ఇస్తారు. పిల్లలు కూడ స్వేచ్ఛగా ఆడుకోవడానిక్కి హక్కు లేదు. ఇల్లు అరిగిపోతుందనీ, పాడైపోందనీ అంటారు. వాళ్లింటికి వచ్చిన చుట్టాలకు ఇల్లు చూపించి, వాళ్లకు కావలసిన సౌకర్యాలు చేయాలి. ఎందుకంటే ఇల్లుగలవాళ్లు ఒకటి రెండు గదుల్లోనే వుంటారుగా. మర్యాదస్తులై మనలను అర్థంచేసుకొని, కలిసి, మెలిసి తిరిగే ఇల్లుగలవాళ్లయితే మనమూ మర్యాదగా వుండొచ్చు. వాళ్లు ప్రతీ విషయంలో ఖచ్చితంగావుండి, ఏమాత్రం అభిమానం చూపకపోతే మనకీ చిరాకు వేస్తుంది. ఇంటివిషయంలో ఏదైనా లోపాలుంటే సరిచేయమని అడిగితే చాలాఅవస్థపెడతారు. చూస్తామని కొన్ని సంవత్సరాలు గడిపేస్తారు. ఎంత అవస్థపడినా ఆ కొంపలో నోరెత్తకూడదు. అంటే విరుచుకు మీదపడతారు, లేకుంటే ఖాళీ చెయ్యమంటారు. ఖాళీ చేద్దామన్నా, చేస్తారని తెలిసినప్పటి నుండి వాళ్ల మీద ఈర్ష్య ఇంతా, అంత కాదు. ఆవీధి అంతా రచ్చలు చేసి పడేస్తారు. అద్దెకున్న వాళ్లు కూడ చెడ్డవాళ్లున్నారు. సరిగా అద్దెలు ఇవ్వక అలా కాలం గడపగల వాళ్లు బహుతక్కువ. ఇంటిగలవాళ్లకు ఇష్టం లేని వాళ్లతో మనం మాట్లాడకూడదు. వాళ్లింటికి వెళ్లకూడదు. వాళ్లు మనింటికి రాకూడదు. మన ఇష్టమని వాళ్లతో తిరిగి ఇష్టంగావుంటే ఎంతో బాధపడుతూ లేనిపోని చాడీలు వాళ్లకీ, వీళ్లకీ చెప్తారు. గోడలకు మేకులు కొట్టకూడదనీ, పిల్లలు సుద్దతో గోడలమీద గీయకూడదని విసుక్కుంటారు. ఏం సౌకర్యం లేకపోయినా ఆ ఇల్లు కదిలితే విరోధులవుతారు. వాళ్లు మాట మాటికి అద్దె హెచ్చించినా నోరెత్తకుండా, వాళ్లకు అణిగి, మణిగి వుండమని వుంటుంది. వాళ్లకిష్టం లేకపోతే పనిమనిషితో కూడ చాడీలు చెప్పి మానిపించేస్తారు. అది కనక వినకపోతే దొడ్డి సరిగా తుడవడం లేదు, పచ్చగడ్డి తీయలేదు, నీళ్లు చల్లలేదని దాంతోనైనా వాదులాడి సంతృప్తి చెందుతారు.

న్యాయం ఆలోచిస్తే ఇవన్నీ సౌఖ్యమం తగునా? అద్దె ఇస్తున్నాం, అంటే ఇల్లు వాళ్ళు మాత్రం బాధ్యతతో చూచుకోరూ? వాళ్ళకు మాత్రం, శుచి, శుభ్రతా వుండదా? ఏదో పిల్లలు తెలియక చేసిన వాటిని వాళ్ళూ ఖండిస్తారు. ఇటువంటి ఇళ్ళుగల వాళ్లుంటే అద్దె ఇల్లు అంటే భయంగా వుంటుంది. పైగా వాళ్లకు మళ్లీ మొండితనం కూడ అలవాటు అవుతుంది.

ఇలాంటి పద్ధతులు మంచివి కావు. ఒకరినొకరు అర్థం చేసుకుంటేనే అభిమానాలు పెరిగి ఎక్కడికెళ్లినా మర్చిపోకుండా గొప్పగా చెప్పుకోవాలనిపిస్తుంది మరి, వాళ్లే బంధువులు కన్న, అక్క చెల్లెళ్ల కన్న ఆత్మీయులౌతారు.

ఎస్. సూర్యాభాయి (తిరుపతి)

* * *

ఇల్లుగలవారి ఇక్కట్లో?

మొన్నవారం వనితా లోకంలో 'అద్దె ఇండ్లు-అగచాట్లు' చదివాక నిజంగా అద్దె యిండ్లలో వుండే వారు యిన్ని అగచాట్లు పడుతున్నారా అని అనిపించింది. అద్దె యిండ్లలో వుండేవారే గాదు అగచాట్లు పడేది సొంత యిండ్లుగల వాళ్ళ సొదకూడా వనితా లోకానికి చెప్పాలనిపించింది. ముందు బాడుగకు చేరేటప్పుడు చాలా నెమ్మదస్తులు మాదిరిగా చేరతారు. తర్వాత తోట వేసుకోవడానికి దొడ్డిలేదు పాడు కొంప ఇంత బాడుగ యిచ్చినా సుఖం లేదని పొద్దస్తమానమూ విసుక్కుంటుంటారు. ముందు చేరేటప్పుడు మేము అట్టే నీపు లైట్లు వాడమండీ. ఆ కరెంటు బిల్లు అదీ మీరే చూసుకోండి. లైటు కింత అని తీసుకుందురూ అని అంటారు. గానీ నెలాఖరుకు చూడబోతే వీళ్ళిచ్చే డబ్బుమొత్తం బిల్లులో మూడోవంతో నాలుగోవంతో వుంటుంది. పోనీ మీరే బిల్లు కట్టుకోండి మేము యింత అని యిస్తాము అని అంటే ఈ అద్దెకుండే వాళ్ళు ఒప్పుకోరు. యింట్లో చేరే ముందు బాగా వెల్ల వేయించి శుభ్రంగా యిస్తారు యింటి వోనర్సు. కానీ ఈ అద్దెకుండే వాళ్ళు మనసొత్తు గాదు గదా ఎటా వుంటేనేం లెమ్మని గోడలంతా చీలలతో చిల్లులు, బొమ్మలు, పద్యాలు గీచిపెట్టారు. వాళ్ల యిళ్ళు అయితే యిట్లాగే గోడలు పాడుచేసుకుంటారా? పోనీ వీటన్నిటికీ సహించి వూరుకున్నా చాలా మంది బాడుగైనా కరెక్టుగా యివ్వరు. అటు ఇటూ పదిరోజులైతే పర్వాలేదుగానీ ప్రతినెలా విసిగిస్తుంటే యిళ్ళు గలవాళ్ళ కెంత కష్టంగా వుంటుందో గమనించాలి.

సొంత యిళ్ళు కట్టించి నాలుగు రూపాయలు వస్తుందని బాడుగకుయిస్తే, అవి టైముకు అందకపోతే, ఆ వచ్చిన డబ్బులు రిపేరుకు, మునిసిపాలిటీ పన్నులకు చాలకపోతే యింక ఆ యిళ్లవల్ల లాభమేమిటి? "మాటికిముందు లేచిపొమ్మని" అంటారు అని వ్రాసారు, కానీ లేచిపొమ్మనగానే పోయేకాలం మారిపోయి, లేవమంటే ఎట్లాగండీ మాకు 6 నెలల టైమివ్వండి లేకపోతే మీయిష్టం వచ్చినట్లు చేసుకొమ్మనే అద్దె వాళ్లుకూడా వున్నారు. అందుకని అద్దెకుండే వాళ్లే చాలా నెమ్మదస్తులు, ఇంటివోనర్సు చిక్కులు తెచ్చేవారు అని భావించరాదు. మంచి చెడ్డ అనేది ప్రపంచంలో ప్రతిచో వున్నట్లే ప్రతిదానిలో మంచి చెడ్డ వుంటుంది. అద్దెకుండేవారిలో అసాధ్యులున్నారు, ఇంటి వోనర్సులో అసాధ్యులున్నారు. ఇంకొకమాట రెండు నెలల క్రితమే నా స్నేహితురాలి భర్తను ఝాన్సీ మార్చారు. అది మొన్న వుత్తరం వ్రాస్తూ జాబంతా తమ యిళ్ళుగల్ల వాళ్లను పొగడి వ్రాయడమే. ఇట్లా వుంటుంది యిళ్ళుగల్ల వాళ్ళ, అద్దెకుండేవాళ్ళలో తారతమ్యాలు.

పి. అనసూయ, నెల్లూరు.

* * *

అందరు అంతేనా?

ఈ మధ్య పత్రికల్లో అద్దెలకుండేవాళ్లని ఇంటివాళ్లు పెట్టే అగచాట్లని గురించి ఎం. లక్ష్మిగారు వ్రాశారు. కేవలం అందరు అంతేనా? మేము ఇంటికి అద్దె చెల్లిస్తున్నాం కదా అని ఇంటివాళ్లతో పేచీపెట్టే వాళ్ళు

ఎంతమంది లేరు. కావాలని వేలకు వేలుపోసి ఇళ్ళు కట్టుకుంటారుకదా వాళ్ళు చెల్లించే ఏపాతిక, ముప్పదిరూపాయలకే తెల్లనిగోడల నిండా మసిచేసి, గోళ్లెములు విరగ్గొట్టి, తలుపులు బద్దలుగొట్టే మహానుభావులు మాత్రం లేరా?

అదేమని అడిగితే పిల్లలు చేస్తే తాము చూడలేదనో, ఏదో సాకు చెప్పతారు. పేచీకోర్లనేవాళ్లు వీళ్ళలోను వాళ్ళల్లోనుకూడ ఉంటారు. ఎటొచ్చి ఒకళ్ళనొకళ్ళు అర్థం చేసుకోటంలోనే ఉంది. లేనివాడు అద్దెకి వీళ్లు ఉండా లేరు. వాళ్లు ఉంచుకోనూలేరు.

వంగల రాజేశ్వరి.

(గుంటూరు)

* * *

ఎవరు ఘటికులు?

పెంకి ఘటాల కోవలోచేరే ఒక సుబ్బారావూ, సూర్యాకాంతం ఒక చిన్న బొమ్మరిల్లు అద్దెకుతీసుకున్నారు. ఇల్లు చాలా అసహ్యంగా ఉంది.

రేపోమాపో వెల్ల వేయిస్తానంటూనే కాలక్షేపం చేస్తున్నాడు ఆ యింటి యజమాని. "పోనీ మేంబాగుచేయిస్తాం; ఆనక అద్దెలో చూసుకుందాం" అన్నాడు సుబ్బారావు. మొదటిసూచన బాగుందన్నాడు ఇంటాయన. రెండోది ఆయనకు నచ్చలేదు.

చివరకి సుబ్బారావు స్వయంగా ఖర్చుపెట్టి ఇల్లు శుభ్రంచేయించి వెల్లా అదీ వేయించాడు.

వారం తిరిగేసరికి, ఇల్లు తనకి కావాలి కాబట్టి తక్షణం కాళీ చేయాలనీ తాఖీదు ఇచ్చాడు ఇంటాయన కొంటెగా. పెంకె సుబ్బారావు పెళ్లాంతో ఆలోచించి మూడోనాటికల్లా కాళీ చేసేశాడు.

నాలుగోనాడు ఇంటాయన తన తెలివికి నవ్వుకుంటూ ఇంటి తలుపు తీసి చూడబోయేసరికి ఏముంది?

తెల్లటి గోడనిండా తారు, మసి. ఇల్లంతా చెత్త. ఆఖరికి మరమ్మతు పనిలో, సుబ్బారావు గోడలలో గోతులు మెత్తించినచోట కూడా వెళ్లేముందు సిమెంటు / పెళ్లలు ఊడబీకి మరీ పోయాడు. అదివరకు గోడలు దుమ్ముకొట్టి మాత్రమే ఉండేవి. ఇప్పుడు వాటిమీద తారు చారలు కూడాను.

ఎవరు ఘటికులు?

—సి. భానుమతి.

"చెప్పడంకాదు"

ఈమధ్య వనితాలోకంలో "ఆస్పత్రిలో అవస్థలు" కొందరు ఘోరంగా చిత్రిస్తూ వచ్చిన వాఖ్యానాలు నమ్మలేకుండా వున్నాము. ఆస్పత్రులలో, సిబ్బంది అంతా వారి దగ్గరకు వచ్చేరోగులందరిని చీదరించుకొని పోతారనడం, మాటవినుపించుకోరనడం సబబుకాదు. మనకున్న ఆత్రుత, అవసరమే ఇతరులకూ వుంటుంది. ఇంకా ఎందరో రోగులను వారు చూచుకోవాలి. ఎన్నో అర్జంటుకేసులుంటాయి. వాళ్లేదో తొందరగా, హడావుడిగా పోతుంటే మధ్యలో మనమెల్లి మనగోడు చెప్పబోతే చిరాకు (ఆ మాటకొస్తే మనకుమాత్రం రాదా) రావడం సహజమే. చుట్టాలకే సుస్తిచేసి సేవ చెయ్యడానికి చీదరించుకుంటారు కొందరు. అటువంటిది పరాయివాళ్ళయినా నర్సులు ఎంతో సహనంతో చేస్తుంటే వారి త్యాగబుద్ధే తెలుస్తుంది. ఒకసారంటే ఒకసారి చెయ్యండి చూద్దాం ఆ నర్సులుచేసేపని. ఎంత ఓపిక, త్యాగం కావాలో ఆలోచించండి. వచ్చిన రోగులనందరిని నిర్లక్ష్యపరుస్తూ పొమ్మంటే ఇక వారెందుకున్నట్టు? చెప్పడం సులువే చెయ్యడమే కష్టం.

బి. సుమిత్ర, నిర్మల,

పెద్దాపురం.

* * *

మనవిని విని

'డిగ్రీలెందుకు' అన్న అంశం మీద వ్రాస్తూ ఒక సోదరి "స్త్రీలను గౌరవించడం పురుషులలో ఎంతమందికి ఈనాడు తెలుసును" అని వ్రాశారు. ఏదో సందర్భంలో పురుషులపై అక్కసు. తీర్చుకోడం ప్రతీ మహిళా కార్యక్రమంలోను ఎక్కడో ఒకచోట కనిపిస్తుంది.

ఆమధ్య రేడియోలో కవయిత్రి ముద్దుపళని గూర్చి ప్రసంగిస్తూ ఒక వక్త "ఈమె కవితలో ఛలానాలోపం ఉన్నదని విమర్శకులు అంటారు. కాని ఈలోపము పురుషుల రచనల లోనూ ఉంటుందని" సంతోషించారు. మరొక వక్త కస్తూర్బాగాంధీ జీవిత చరిత్రను చెపుతూ "గాంధీజీ అంత గొప్పవాడవడానికి కారణం కస్తూర్బా సతియే"అన్నారు. ఇలాటివి పరిశీలిస్తుంటే పురుషుల్ని కించపరచడం ద్వారా మహిళాభ్యుదయం సాధిస్తున్నామని వీరు తృప్తిపడుతున్నారా అనిపిస్తుంది. అదే నిజమయితే చాలా విచారకర విషయము. ఇది సోదరీమణులు గుర్తించాలని కోరిక.

ఎస్. రామనాథం

(కాకినాడ).

* * *

భుజాలు తడుముకోకుండా


నిర్మల ప్రభావతిగారు వ్రాసిన ఆడబిడ్డలు వ్యాసం చదివాను. ఆమె వ్రాసింది అక్షరాలా నిజం దానిలో అసహజమైనదేమీ లేదు. వదినలను సాధించి అల్లరిపెట్టే ఆడబిడ్డలేకాకుండా, వదినంటె యెంతో అభిమానంతో, ప్రతి విషయంలోను వదినే ముందుగా వుండాలని మారాం చేస్తూ వదినల ఆదరాభిమానాలను చూరగొన గలుగుతున్న ఆడబిడ్డలు లేకపోలేదు. గాని అటువంటి వాళ్లు చాలా తక్కువ.

వదిన అన్నయ్యకు యెంతో సన్నిహితంగా వుండటంవలన, తమనుండి అన్నను వేరు చేస్తున్నదని బాధపడిపోయి సూటి, పోటి మాటలతో ఆమె మనస్సు నొప్పించి సంతోషిస్తారు కొందరు. అంతేగాని వదిన, అన్నయ్య జీవిత భాగస్వామిగా, కష్ట సుఖాలను పాలు పంచుకోవడానికి, తల్లిదండ్రులను, తోడబుట్టిన వాళ్లను సహితం వదిలిపెట్టి వచ్చిన వదిన, తమకు తల్లి తరువాత, తల్లివంటిదని గ్రహించి అభిమానంతో చూడటం పోయి, ఆమెను తమ యింట్లో ఒక వ్యక్తిగా భావించడానికే బాధపడిపోతారు కొందరు. తల్లి యేదైన పని చేస్తున్నప్పుడు అమ్మా నేనూ చేస్తానంటూ సరదాగా అన్ని పనుల్లోను చెయ్యి చేసుకొనే ఆడపిల్లలు వదిన యే మాత్రం చిన్న పని చెప్పినా కష్టాలు పెట్టేస్తూందని అనుకోవడంలో అర్థంలేదు.

నిర్మల ప్రభావతిగారు వ్రాసినట్టు, యెవరికి, వారే బుజాలు తడుముకోకుండా, ఆడబిడ్డలు, వదినలు గూడా, తమలోవున్న లోపాలను సరిదిద్దుకొని ప్రవర్తిస్తే, మనస్పర్ధలంటూ తలెత్తవు. చూసేవాళ్లు ఆ వదినా మరదల్లిద్దరూ ఒక తల్లి బిడ్డల్లా వున్నారని అనుకుండేట్టు, ప్రవర్తించడం అలవర్చుకోవాలి.

బి. సరోజిని, విజయనగరం.

* * *



[illegible]

అనగనగా ఒక గ్రామము
నం దిరువురు ప్రియమిత్రులు-
కలిసి మెలిసి వారిరువురు
మెలగుచుందు రెల్లప్పుడు.

అందొక్కఁడు ప్రతిదినమును
ఆలయమున కేతెంచుచు
దేవుని పూజలుచేయుచు
"దేవదాసు"డన నొప్పెను.

రెండవవా డనుదినమును
వేశ్యాగృహమునకు బోయి
వేశ్యాంగన సేవజేసి
"వేశ్యాదాసుం" డాయెను.

దేవదాసు తన మిత్రుని
వేశ్యాదాసుని సుఖిగా
భావించుచు వేశ్యను మది
ధ్యానము చేయుచునుండెను.

వేశ్యాదాసుడు నిరతము
దేవదాసు పుణ్యునిగా
తలపోయుచు దేవునియెడ
దత్తచిత్తుఁడై యుండెను.

కొంతకాల మరిగిన అ
నంతర మా సహవాసులు
కాలధర్మమును జెందిరి
పరలోకమునకు బోయిరి.

వేశ్యాదాసునకు ముక్తి
దేవదాసునకు నరకము
పరాత్పరుడు కృపాపరుడు
ప్రసాదించె చిత్రముగా.

అది చూచిన నారదముని
కక్కుఁజ మధికంబాయెను
భగవంతుని చెంతకు జని
ప్రశ్నించెను "ఇది యే?"మని!

నారదునకు భగవానుడు
ఈరీతిగ వివరించెను
"ఇందులోన విపర్యయము
ముమ్మాటికి లేదు సుమ్ము!

వేశ్యాదాసుడు బయటికి
వేశ్యాపరుడేయయ్యును
నాయందే దత్తచిత్తు
డై యుండెను జన్మాంతము.

దేవదాసు బయటికి నా
సేవాపరుడే యయ్యును
మనసా వేశ్యాకాంతనె
మరణాంతము ధ్యానించెను!

స్వర్గనరకముల కెన్నడు
బాహ్యావ్యాపారమ్ములు
కారణములు గాజాలవు
కాజాలును మనసొక్కఁటె!"

చిటిప్రోలు కృష్ణమూర్తి

విశ్వాసం

జోటో కళాశాల ఉపన్యాసకుడు.

అతనికి 'నా' అన్న వాళ్లెవ్వరూ లేరు, ఒక్క రీటా తప్పితే!

రీటా అతని పెంపుడు కుక్క. రీటా అంటే అతనికెంతో మక్కువ. రీటాని తన ప్రాణంతో సమానంగా చూసుకొనేవాడు. రీటాకూడా యజమానికి తన ప్రాణాలు సయితం యిచ్చేందుకు సిద్ధంగా ఉండేది.

జపాను దేశానికి ముఖ్యనగరం అయిన 'టోకియో'కు కొద్ది దూరంలోవున్న ఓపల్లెలో ఉంటున్నాడు జోటో. ప్రతీరోజూ ఆయన 'ఎలక్ట్రిక్ ట్రెయిన్'లో టోకియో వెళ్లేవాడు. అతను పనిచేసే కళాశాల టోకియోలోనే ఉంది. జోటో కళాశాలకు వెళ్లేప్పుడు, రైల్వేస్టేషన్ వరకు రీటా కూడా వెంటవెళ్ళేది!

జోటో భోజనంచేసి... బట్టలు వేసుకుని, పుస్తకాలు పుచ్చుకు బయలుదేరే సమయానికి, ఎక్కడవున్నా...సరే, వచ్చి గుమ్మంలో సిద్ధంగా నుంచునేది రీటా!

రైలుస్టేషన్‌కీ, జోటో ఉండే బంగళాకీ...ఎలా లేదన్నా...రెండుమూడు ఫర్లాంగులుదూరం ఉండేది. జోటో బంగళానించి స్టేషన్‌కి కాలిడకనే వెళ్లేవాడు. అతని వెంటనే వెళ్లేది రీటా.

రైలు వచ్చేంత వరకూ యజమానితో కూడా ఉండి...అతనురైలెక్కిపోగానే తోకాడిస్తూ 'టాటా' చెప్పి బంగళాకు తిరిగి వచ్చేసేది, రీటా!

తిరిగి సాయంకాలం రైలువచ్చే వేళకు యజమాని కోసం స్టేషన్‌కు వెళ్ళేది రీటా. రైలువచ్చేంత వరకూ ఉండి, రైలు రాగానే... యజమాని కోసం ఎదురుచూసేది. జోటో కనిపించగానే ... పరుగెత్తుకు వెళ్లి అతని కాళ్ళను చుట్టేసేది! యజమానితోకలిసి బంగళాకు వచ్చేసేది. రోజూ ఇలానే జరుగుతూ ఉండేది.

చరిత్ర పునరావృత్తి

ఓనాడు రీటా తన యజమానిని మామూలుగా రైలు ఎక్కించేసి... బంగళాకు తిరిగి వచ్చేసింది.

జోటో కళాశాలకు వెళ్లేవరకూ బాగానే ఉన్నాడు. తీరా, ఆయన కాలేజీలో ఉపన్యసిస్తూండగా ... హఠాత్తుగా గుండెనొప్పి వచ్చింది! మాట్లాడుతూనే... కిందపడిపోయాడు.

ప్రిన్సిపాల్ వెంటనే డాక్టరు కోసం కబురు చేశాడు. కాని... డాక్టర్ వచ్చేంతవరకూ వ్యవధి లేకుండాపోయింది. డాక్టర్ వచ్చేసరికి ఆయన మరణించాడు.

జోటోమరణిస్తూ ప్రిన్సిపాల్‌తో చెప్పాడు—'నేను చిన్నప్పుడు ఈ కాలేజీలోనే చదువుకున్నాను. నా అదృష్టం కొద్దీ... ఈ కాలేజీలోనే ఉద్యోగం అయింది. చివరకు యీ కాలేజీలోనే మరణిస్తున్నాను!... అందువల్ల కడసారిగా మిమ్మల్ని కోరేదేమంటే...నా శవాన్ని యీ కళాశాలలోనే ఎక్కడైనా 'సమాధి' చేయించమని! మరో చిన్నమాట! అది...రీటా...రీటా...' అని ఇంకేమో చెప్పబోయాడు. కాని చెప్పకుండానే ... మరణించాడు. రీటాని గురించి...యేం చెప్పాలనుకున్నాడో పాపం!

ప్రిన్సిపాల్ జోటో కడసారిగా చెబుతూ వదిలేసిన 'రీటా' గురించి అంతగా పట్టించుకోలేదు. అసలు 'రీటా' అన్నది కుక్కపేరు అని... తెలిసే తెలీదు. జోటో శవాన్ని మాత్రం అతని కోరిక ప్రకారం, ఆకాలేజీ ఆవరణలోనే సమాధి చేశారు.

రైలువచ్చేవేళ కాగానే రీటా మామూలుగా యజమాని కోసం స్టేషన్‌కు వచ్చింది. రైలు వెళ్లిపోయింది. యజమాని కనిపించలేదు. స్టేషన్‌లోనే దీనంగా నుంచుంది! వచ్చేబళ్ళనీ ... పోయే బళ్ళనీ ... అమాయకంగా, ఆత్రంగాచూస్తూ చాలా రాత్రివరకూ స్టేషన్లోనే ఉంది చీకటిపడగానే ... నిరాశగా బంగళాకు చేరుకుంది.

మర్నాడు ఉదయం...బంగళా గేటు దగ్గర నుంచుంది, యజమాని కోసం. యజమాని రాలేదు!... మామూలుగా స్టేషన్‌కు వెళ్ళింది. రైళ్ళన్నీ పరికించింది... యజమాని రాలేదు. దిగులుగా బంగళాకు చేరుకుంది. యథాప్రకారంగా తలుపులు మూసి ఉన్నాయి. తన యజమాని లోపల ఉన్నాడేమోనని... తలుపుదగ్గర నుంచొని అరచింది!... తలుపు కరిచింది!! శక్తి ఉన్నంత

★ విశ్వాసం ★

వరకూ ఏడ్చింది!!!... యజమాని రాలేదు! దాని ఏడుపు ఎవరూ విన్నవారు కాదు!...పాపం!

కొద్దిరోజులు గడిచినయ్. జోటో బంగళాలో ఎవరో కొత్తమనుషులు ప్రవేశించారు. వాళ్లు రీటానుచూసి పిలిచి, అన్నం పెట్టారు. కానీ... ఒక్కమెతుకైనా ముట్టింది కాదు! దీనంగా ... లోపలకు చూసింది! అంతా కొత్తవాళ్ళే కనిపించారు. అది యజమానిని స్టేషన్‌కు దిగబెట్టే వేళ! ఒక్కర్తే స్టేషన్‌కువెళ్లి, యధా ప్రకారం తిరిగి వచ్చింది

రోజురోజుకీ రీటా చిక్కిశల్యమై పోతోంది! తిండి తినేదికాదు! ఎవరు పిలిచినా పలికేదికాదు. పొద్దుటా సాయంకాలం కూడా...స్టేషన్‌కు వెళ్లేది. యజమాని కనిపించకపో గానే...నీరసంగా...తిరిగి వచ్చేది!

స్టేషన్లో స్టేషన్ మాస్టర్లూ, టీ. సీ. లూ రీటా, రోజూ స్టేషన్‌కు వచ్చి, ఎవరికోసమో చూసి...వెళ్ళి పోవడం గమనించారు. రీటా ఎవరిదో, స్టేషన్‌కు ఎందుకు వస్తు న్నదో అర్థం అయిందికాదు. తర్వాత-ఫలానా కళాశాలఉపన్యాస కుడు 'జోటో' కుక్క అని తెలుసు కున్నారు. రీటాకు యజమానిమీద ఉండే భక్తివిశ్వాసాలకు విస్తుపోయే వాళ్లు!...

కాలచక్రం తిరిగిపోతోంది! పాత ఉద్యోగులు రిటైరయిపోతున్నారు. కొత్తవాళ్లు ప్రవేశిస్తున్నారు. కానీ, రీటా మాత్రం స్టేషన్‌కు రావడం మానలేదు! మామూలుగా స్టేషన్‌కు వస్తూనే ఉంది. యజమాని కోసం చూస్తూనేఉంది!

కొన్నాళ్ళకు రీటా బాగా చిక్కి పోయింది. కొన ఊపిరితో ఆవేళ స్టేషన్‌కు వచ్చింది!...పాపం! కాని, తిరిగి బంగళాకు వెళ్ళలేకపోయింది! పాపం!

ఆఖరిబండి టోకియోనుంచి వచ్చి వెళ్ళిపోయింది! రీటా ప్లాట్‌ఫారం మీద కూలిపోయింది!! ఆవేళనే... రీటా ప్రాణవాయువు అనంతాకా శంలో కలిసిపోయింది!...... పాపం!!... ★





మంచి వాక్యం

సుకుమార్

సుందర నగరం అనే పట్నాన్ని పూర్వం శూరవర్మ అనే మహారాజు పరిపాలిస్తూవుండేవాడు. శూరవర్మ పరిపాలనలో ప్రజలు ఏవిధమైన కష్టాలు లేకుండా హాయిగా వుండేవారు. మహారాజు చాలా మంచివాడుగా సుందరనగరంలోనే కాదు- చుట్టుపట్ల వూళ్లల్లో కూడా ఖ్యాతిపొందాడు!

ఒకనాడు శూరవర్మ వేటకుపోయి సాయంత్రం వరకూ వేట వినోదాలలో కాలం గడిపి, మంత్రులతోను, సైనికులతోను కోటకు తరలిపోతూవుండే సమయంలో ఒక బైరాగివాడు మహారాజుకు ఎదురై నమస్కరించాడు.

"ఏం కావాలి?" అని ప్రశ్న వేశాడు శూరవర్మ.

"మహారాజా! నేను తమకో సంగతి మనవి చేస్తాను. అదివిన్నాక 'ఇంతేనా' అని మీ కనిపించినా, దాని విలువ చాలా గొప్పది. ఐతే ఆ సంగతి చెప్పాలంటే నూరు తులాల బంగారం మీరు ఇచ్చుకోవాలి" అన్నాడు బైరాగి. ఈమాట వినేసరికి సైకులు, మంత్రులు నవ్వటం సాగించారు. ఒక చిన్నసంగతి చెప్పటానికి నూరుతులాల బంగారం ఏమిటా అనిపించింది. ఐతే మహారాజు ఒక్కసారి పరివారాన్నంతా 'నిశ్శబ్దం' అని హెచ్చరించి-"ఏమిటా సంగతి? చెప్పు-అట్లాగే నీకు నూరు తులాల బంగారమూ ఇస్తాను" అన్నాడు. ముందివ్వమన్నాడు, బైరాగి. శూరవర్మ తనమెడలోంచి ఒక స్వర్ణహారాన్ని తీసి ఇచ్చి చెప్ప మన్నాడు. బైరాగివాడు ఒక రాగి రేకును మహారాజుకు అందిస్తూ "దానిమీదవున్న ఆ వాక్యమే, మహారాజా!" అన్నాడు. ఆ రాగి రేకు చూడగానే అందరికీ ఏమిటా అని ఆశ్చర్యం కలిగింది. అంతా ఆత్రంగా దాన్ని చూడటానికి ఉత్సాహ పడ్డారు. మహారాజు ఆ రాగిరేకు మీదవున్న ఆవాక్యాన్ని గట్టిగా చదివాడు-

"ఏపనిచేసినా, చివరకు ఏమవుతుందోనని ఆలోచించి మరిచెయ్యి!" అంతే! ఈవాక్యం శూర్మవర్మ చదవగానే సైనికులంతా మళ్లీ నవ్వసాగారు. 'ఈమాత్రం సంగతికి నూరుతులాల బంగారం దండగ' అని కూడా కొందరన్నారు. బైరాగి రెండు చేతులతోనూ నమస్కరిస్తూ

"మహారాజా! సెలవు. ఈమాట అందరికీ తెలిసినదే ఐనా, దాని నిజం తెలిసే సమయం వస్తుంది. ఆనాడు మీరే తెలుసుకుంటారు!" అని వెళ్లిపోయాడు.

శూరవర్మకు మనసులో ఏమిటో అనిపించినా పైకిమాత్రం ఏమీ అనలేదు-'చూద్దాం' అనుకున్నాడు. కోటకు పోతూవుంటే సైన్యాధిపతి "పచ్చిమోసం మహా ాజా!" అన్నాడు- శూరవర్మ మాట్లాడ లేదు.

కోటకు చేరుకున్న తర్వాత శూరవర్మ ఆ వాక్యాన్ని గురించి ఆలోచించసాగాడు. 'నిజమే! అది సామాన్యంగా మనం అనుకున్న విషయమే. ఐనా నూరు తులాల బంగారంపెట్టి, కొన్నందుకు వూరికే వుంచరాదు- దీన్ని ప్రచారం చేస్తాను' అనుకున్నాడు.

ఆ మర్నాడే కోటలో గోడల మీదా, తలుపుల మీదా- ప్రతీ వస్తువుమీదా ఆవాక్యాన్ని చెక్కించాడు. ఊళ్లో చాలాచోట్ల రాయించటం, చెక్కించటం చేయించాడు.

కొన్నాళ్లు గడచింది. శూరవర్మ ఏదో జబ్బుచేసి మంచాన పడ్డాడు. ఈవార్త వూరంతా ప్రాకిపోయింది. "అయ్యో పాపం" అనుకున్నారు ప్రజలు. మహారాజు ప్రాణాలు కాపాడమంటూ దేవాలయాల్లో ప్రార్థనలూ అర్చనలూ జరిగినై. క్రమక్రమంగా శూరవర్మ జబ్బు ముదరసాగింది. ఆ జబ్బు ఏమిటో చాలాకాలం వరకూ రాజవైద్యులు కనిపెట్టలేకపోయారు. ఆ తర్వాత చూడగా కడుపులో ఏదో చెడు పదార్థంచేరి వ్రణంగా మారినట్టు తేలింది! "శస్త్రచికిత్స చెయ్యాలి" అన్నాడు రాజవైద్యుడు.

ఎంత మంచివాడికైనా, శత్రువులుంటారు. శూరవర్మ రాజ్యంలోనే, అతని పరివారంలోనేవున్న సైన్యాధిపతి అవకాశం వొస్తే చాలు— రాజ్యాన్ని కబళించాలని ఏనాటి నుంచో వూహిస్తున్నాడు! ఈ

(49-వ పేజీచూడండి)

పేరు మార్పు

పాలంకి వెంకటరామ చంద్రమూర్తి

వరంగల్లులో వలీఖాన్ అనే తాసిల్దారు ఉండేవాడు. అతనివద్ద రామయ్య అనే బంట్రోతు ఉండేవాడు.

వలీఖాన్ ఒకనాడు తీరికగా కూచుని శౌఖరును, "'రామయ్యా' అంటే ఏమిటి హోయ్?" అని ప్రశ్నించాడు.

'రాముడంటే సీతమ్మ మొగుడండి ఆయన దేవుడు'. అన్నాడు రామయ్యా,

'దేవుడూ? అల్లా ఒక్డే దేవుడు! రామ్డూ దేవుడూ నై' అన్నాడు వలీఖాను.

ఆనాటినుంచీ వలీఖానుకి రామయ్యని చూసినప్పుడల్లా వాడిపేరు హిందువుల దేముడి పేరన్న సంగతి జ్ఞాపకం వస్తోండేది. 'రామయ్యా' అని పిలిచే సరికల్లా, హిందువుల దేముణ్ణి పేరెట్టి పిలుస్తోన్నట్లనిపించేది. కొత్తల్లా దేవుడిపేరు అస్తమానూ ఇలా పలకడం పాపమనిపించిదిఖానుకి!

రామయ్యాని మరోచోటికి బదిలీ చేయించేస్తే ఇంక వాడిపేరు పిలవక్కర్లేదని ఆలోచించి వలీఖాను, పై అధికార్లకి 'రామయ్య సరిగ్గా పనిచెయ్యటంలేదు. శిక్షకింద బదిలీ చెయ్యవలసింది.' అని రిపోర్టు రాశాడు. 'రాజా తలుచుకుంటే దెబ్బలకు కొదవా?' అన్నట్లు తహసిల్దారు తలుచుకుంటే బంట్రోతుకు బదిలీ చేయించటం ఎంతసేపు? వారం దాటకుండా రామయ్యకు ఫర్మానా వచ్చి చేరింది.

రామయ్యా మూటా ముల్లే కట్టుకుని వెళ్ళిపోయే ముందు వచ్చి బూబమ్మగారికి సలాం చేసి, 'అమ్మా వెళ్ళిపోతున్నాను; దయ ఉంచండి.' అన్నాడు.

'హెక్కడీక్కి హోయ్?'అంది బూబమ్మ.

'ఖైరతాబాదు బదిలీ చేశారండి నన్ను. చెంబూ చేంతాడూ పుచ్చుకుని వెళ్ళిపోతున్నాం.' అన్నాడు రామయ్యా.

'ఉండు సెప్తా' అంటూ బూబమ్మ మేడమేదకెళ్ళి 'నిజమేనా? రామయ్యాకి బదిలీ ఐందా? పై వాళ్ళకి రాసి ఆపు చేయించలేరా?' అని తురకంలో మొగుణ్ణి ప్రశ్నించింది.

'ఆపు చేయించడ మేమిటి? నేనే వాడికి బదిలీ చేయించాను!' అన్నాడు ఖాను.

'అదేమిటండీ? మీకే మొచ్చింది? వాడొచ్చాక ఇంట్లో ఒక్క వస్తువుకూడా పోలేదు. బజారుకు పంపుతే కమిషను పుచ్చుకోకుండా సరియైన ధరలకే సరుకు తెచ్చి, చిల్లర ఇచ్చేస్తున్నాడు! ఇలాంటి నమ్మకస్థుడు ఎక్కడ దొరుకుతాడండీ? వాణ్ణి మాత్రం బదిలీ చెయ్యడానికి వీల్లేదు!' అనేసింది బూబమ్మ.

జహంగీరు చక్రవర్తికి నూర్జహాను ఎంత చెప్తే అంత ఐనట్లే వలీఖానుకు బూబమ్మ ఎంత చెప్తే అంత. అతడామె ఆజ్ఞ జవదాటేవాడుకాడు. 'కాని ఈ ఒక్క విషయంలోనూ మాత్రం కలుగ చేసుకోవద్దు' అని ఖాను భార్యను బ్రతిమాలేడు.

'ఎందువల్ల?' అని ఆమె నిలదీసి అడిగింది. ఖాను సంగతంతా చెప్పి, 'వీడి మూలాన నేను రోజూ ఆ రాముణ్ణి తలుచుకోవలసొస్తోంది!' అన్నాడు.

'దానికోసం నిక్షేపంలాంటి నౌకర్ని పోగొట్టుకుంటూంటండీ? వీడి పేరు మీకు గిట్టకపోతే మార్చేసి మరోపేరు పెట్టుకోమనండి!' అని సలహా చెప్పింది బూబమ్మ.

వలీఖాను 'సరే' అని మళ్ళీ పైవాళ్లకి రాసి, రామయ్యా బదిలీ ఆర్డరును రద్దు చేయించేశాడు. రామయ్యాను పిలిచి, 'ఒరేయ్, నీ పేరు మార్పించేసోక్కరా' అన్నాడు

'పేరాఅండి బాబూ? మార్పించుకోవాలంటే శానా కష్టమండి!' అన్నాడు రామయ్యా.

'హేమిటిరా కష్టం?' అని అడిగేడుఖాను.

'మా పొలం యిల్లూ ఇవన్నీ లెక్కల్లో నాపేరనే ఉన్నాయండి. నాపేరు మార్చేసుకుంటే ఆ పొలం యిల్లూ నాది కాదంటారండి' అన్నాడు రామయ్యా.

'కరణంతో సెప్పి లెక్కల్లో కూడా మార్చి హెయ్యవోయ్' అన్నాడు ఖాను.

'కరణానికి లంచం ఇస్తేగాని ఏపనీ చెయ్యడండి' అన్నాడు రామయ్యా.

'తాసిల్దార్ ఫర్మానా అని సెప్పావోయ్ కర్ణాన్కి' అన్నాడు.

'మా ఊరు ఎక్కడో ఖమ్మంమెట్టు దగ్గిరుందండి. వరంగల్ తాశీల్దారంటే ఆ కరణానికి భయం ఉండదండి' అన్నాడు రామయ్యా.

ఖానుకి చిరాకేసుకొచ్చింది. కాని లాభం లేదని తోచి లోపలికెళ్ళి రెండు రూపాయలు తెచ్చి రామయ్యా చేతిలో పడేసి, 'పట్కాపో. ఆ కర్ణాన్కి లంచం హిచ్చి, లెక్కల్లో పేరూమార్పించి హోస్కురా' అన్నాడు.

రామయ్యా రూపాయలను జేబులో పెట్టుకున్నాడు గాని కదిలేడుకాడు.

'హేమిరా పోవ్?' అన్నాడు ఖాను.

'పేరు బాప్పమ్మకు మారుస్తే గాని కరణం మార్చడండి' అన్నాడు రామయ్యా.

'బామడ్? బమ్మన్ దేన్కివోయ్?' అన్నాడు ఖాను.

'పేరు పెట్టినప్పుడు అయ్యవారొచ్చి పళ్ళెంలో బియ్యంమీద రాయించరండీ? ఇప్పుడు నాపేరు మారుస్తే, ఆయనొచ్చి నా కొత్తపేరు మా బాబుచేత బియ్యంమీద రాయించాలండి' అన్నాడు రామయ్యా.

'హేమిటివోయ్ ఇదంతా?' అన్నాడు ఖాను చిరాగ్గా.

'ఆచారం బాబూ. ఏది ఎలా జరగాలో అలా జరిపించకపోతే మావోళ్ళు వొప్పుగోరండి. కరణంగారు అసలే వొప్పుగోరండి' అన్నాడు రామయ్యా.

'బమ్మన్కి హెంతా హివ్వాలా?' అన్నాడు ఖాను.

'రెండు రూపాయలు చాలండి, చుట్టాల భోజనాలకి పదిరూపాయలు చాలండి' అన్నాడు రామయ్యా.

'భోజనాల్?' అంటూ గుండె బాదుకున్నాడు ఖాను,

'భోజనాలు పెట్టకుండా ఏం చేసినా మావాళ్లువప్పుగోరండి పెట్టకపోతే చుట్టాలు వెలివేస్తారండి,' అన్నాడు రామయ్యా.

'పురోహిత్యుడికి రెండూ, భోజనాలకి పదీ చెల్లించుకోవలసిందేనా?' అని ఆలోచించాడు ఖాను. చెల్లించకపోతే, రామయ్యాను 'రామయ్యా' అనే పిలవాలి. చస్! చీటికీ మాటికీ ఆ పేరు పలకడమా? పోతే పోయాయ్ రూపాయలు!

అలా నిశ్చయించుకుని ఖాను పన్నెండు రూపాయాలూ తెచ్చి రామయ్యా చేతిలో పోశాడు.

'మా ఊరు వెళ్లివచ్చేసరికి పది రోజులు పడుతుందండి,' అన్నాడు రామయ్యా.

'పది పట్టేనసరా, పదిహేనైనాసరే పేరు మాత్రం మార్చుకురా,' అని చెప్పి ఖాను వాణ్ణి పంపేశాడు.

మంచి వాక్యం

(47-వ పేజీ తరువాయి)

సైన్యాధిపతి రాజవైద్యుణ్ణి రహస్యంగా పిలిచి మంతనాలు ప్రారంభించాడు.

"ఇంతకంటే మంచి అవకాశం నీకు రాదు. మహారాజుకు శస్త్రచికిత్స చేస్తూ విషపదార్థాన్ని లోపలకు ఎక్కించు. మహారాజు మరణిస్తాడు. నీకెందుకు? ద్వారం దగ్గర నేను చూసుకుంటాను. అంతే! ఆతర్వాత నేను రాజూ...నువ్వు నా ప్రధానమంత్రివీ! ఈ వూహకు తిరుగులేదు—కానీ!" అని సైన్యాధిపతి రాజవైద్యుడి చేతిలో తళుక్కుమని మెరిసే వజ్రపుటుంగరాన్ని ముందుగా బహూకరించాడు.

వైద్యుడు భయపడి, "నావల్లకాదు" అనేశాడు. సైన్యాధిపతి చాలా విధాలుగా నచ్చజెప్పి ఏంభయం లేదని వీపుమీద తట్టి పంపించాడు!

ఆ మర్నాడు మహారాజు శూరవర్మకు శస్త్రచికిత్స. కోటంతా నిశ్శబ్దమైపోయింది. మంత్రులూ పరివారమూ అంతా మహారాజు శయనమందిరంలోనుంచి బయటికి వచ్చేశారు. మందిరంలో పాన్పుమీద పడుకున్న శూరవర్మ, చికిత్స చెయ్యటానికి రాజవైద్యుడు తప్ప ఎవరూలేరు! శయనమందిర ద్వారం దగ్గరమాత్రం విచారాన్ని నటిస్తూ సైన్యాధిపతి నించున్నాడు!

శూరవర్మ పూర్తిగా తెలివి తప్పి వుండలేదు. తనకు శస్త్రచికిత్స కాబోతున్నదన్న సంగతి అతనికి తెలుసు. నీరసించిపోయినా, ధైర్యంగావున్నాడు. మహారాజు కడుపును కొయ్యటానికిగాను వైద్యుడు చిన్న కత్తిని తీశాడు. ప్రక్కనేవున్న విషపుసీసాలో దాన్ని ముంచి మహారాజు పొట్టమీద పెట్టటానికి చెయ్యిఎత్తాడు. చెయ్యి వణికింది! గుండెలు దడదడ కొట్టుకుంటున్నై! కత్తివేపు సాలోచనగా చూశాడు—వెంటనే అతనికి

ఆ అక్షరాలు ఆ కత్తిమీద మెరుస్తూ కనిపించినై! "ఏపని చేసినా చివరకు ఏమవుతుందోనని ఆలోచించి మరీ చెయ్యి!" అంతే! కత్తి దించేశాడు. మొహంలో నెత్తురు ఇంకిపోయింది. ముచ్చెమటలూ పోయసాగినై. రాజవైద్యుడి తలకాయలో ఆలోచనలు చకచకా బయలుదేరినై. తను విషప్రయోగాన్ని చేసి శూరవర్మ ప్రాణాలు తీసినట్టు ఎట్లాగన్నా తెలియకతప్పదు—తెలిసిందా తనగతి ఏమిటి? చిత్రవధ!

రాజవైద్యుడు ఆ కత్తిని అట్లాగే పడేశాడు. ఏంచెయ్యటానికీ పాలుపోవటంలేదు — బిత్తరగా అటూ యిటూ చూడసాగాడు. వైద్యుడిలో జరుగుతున్న ఈ మార్పును శూరవర్మ గ్రహిస్తూనేవున్నాడు. ఐతే ఏమిటో ఇదంతా అతనికి అర్థంకాక చివరకు-"చికిత్స చెయ్యవేమయ్యా వైద్యుడా?" అన్నాడు. ఈమాటతో మరింత గాభరాపడ్డాడు రాజవైద్యుడు. ఏదో మాయ జరుగుతున్నదని శూరవర్మ ఛటాలుని గ్రహించి వైద్యుడిచెయ్యి పట్టుకొని ఏమిటో చెప్పమని గద్దించాడు. రాజవైద్యుడు శూరవర్మ కాళ్లమీద వాలిపోయి, జరిగినదంతా చెప్పి తనను క్షమించవలసిందిగా వేడుకున్నాడు.

రాజవైద్యుడు చెప్పినదంతా విన్నాక శూరవర్మ ఎంతో ఆశ్చర్యపడ్డాడు. తనకొలువులో పనిచేస్తూ ఎంతో వినయం ప్రకటిస్తూవున్న ఈ సైన్యాధిపతి ఇంత మోసగాడా అనుకున్నాడు. రెండునిమిషాల్లో సైన్యాధిపతి శూరవర్మ ఎదుట హాజరు పెట్టబడ్డాడు!

జరిగిన మోసానికి కారకుడైన సైన్యాధిపతికి ఉరిశిక్ష—తన ప్రాణం తియ్యటానికి పూనుకుని, తియ్యలేక నిజం ఒప్పుకున్నందుకు రాజవైద్యుడికి, ఆస్థానంనుంచి బహిష్కారం— తన ప్రాణాలను కాపాడటానికి కారణమైన ఆ వాక్యాన్ని ప్రసాదించిన బైరాగికి రాజనగరులో బ్రహ్మాండమైన ఊరేగింపులతో— ఈ కథ ఐపోయింది! ★

పది రోజులైంది; రామయ్య రాలేదు. పదిహేనైంది; రామయ్య పికరులేదు. ఇరవై రోజులయాక వచ్చి 'సలాం, సాబ్' అన్నాడు.

'హేమ్ మియా వోయ్? హిన్ని దినాల్ చేశావ్?' అన్నాడు ఖాను.

'ఏం చెయ్యనుసాబ్? ఆ బమ్మన్ ఊళ్లో లేడు. ఆయన వచ్చేదాకా ఆగిపోయాను. పేరు మార్చుకునే వేళకి కరణంగారు జమాబందీకి వెళ్ళిపోయారు. ఆయన వచ్చేవరకూ ఉండిపోవలసొచ్చింది!' అన్నాడురామయ్య.

'పోనీలే. పేరు మార్చేసుక్కున్నావ్ గా? నీ కొత్తాపేరూ హేమ్మియావోయ్?' అని అడిగాడు ఖాను.

'సీతారామయ్య!' అన్నాడు బంట్రోతు.

ఆ పేరు వినేసరికి వలీఖానుకి వళ్ళు మండిపోయింది! 'హేమ్మి? రామూ సాల్లా సీతానీ పెట్కొవచ్చావ్? హారే సైతాన్ వోయ్ నువ్వూ! సీతా, రామూ రెండూ దేవుళ్లనీ ఫిల్వాలోయ్ నేనూ?' అంటూ కేకలేసా కర్ర తెద్దామని లోపలకు పుగెత్తేడు.

బూబమ్మ అడ్డుకుని, 'ఏమిటండీ?' అని సంగతంతా మెల్లిగా తెలుసుకుని, రామయ్య తెలివికి లోలోపల నవ్వుకుంది. భర్త శాంతించాక, "పేరులో ఏముందండీ? వాళ్ళు దేవుణ్ణి 'రాముడం'టారు. మనం 'అల్లా' అంటాం. అంతేకదూ?" అని సమాధానపరిచింది. ★

సినిమా

ముడిఫిలింకోటా: బిల్లిమోరియా విమర్శ


ముడిఫిలిం దిగుమతికి కోటాలపద్ధతి అనుసరించాలని ప్రభుత్వం చేసిన నిర్ణయం భారత చలనచిత్ర పరిశ్రమకు పెద్ద దెబ్బ అని ఫిలిం ఫెడరేషన్ అధ్యక్షుడు శ్రీ ఎం. బి. బిల్లిమోరియా మొన్న నొక ప్రకటనచేస్తూ అన్నారు.

ఇంత హఠాత్తుగా, ఇటువంటి నిర్ణయం చేయడం ఈ పరిశ్రమకు శ్రేయస్కరం కాదు అన్నారు. కాగా, దేశావసరాల పేరిట దిగుమతులను తగ్గించడంలో ఫిలిం పరిశ్రమకు అత్యంత ప్రధానమైన ముడి ఫిలింను నిత్యావసర వస్తువుల జాబితాలో చేర్చి దీని దిగుమతులను తగ్గిస్తామనడం సమర్థనీయం కాదని ఆయన పేర్కొన్నారు.


ఇంతకీ ఫిలిం దిగుమతుల ద్వారా విదేశాలకు వెళ్లేది రు.220 లక్షుల చిల్లర. ఇదిమొత్తం దిగుమతి వ్యాపారం ద్వారా ఖర్చుయే ధనంలో నూరింట ఒకటిలో నాలుగోవంతుమాత్రమే. అందువల్ల దీన్ని తగ్గించడంద్వారా పరిశ్రమలో ఇబ్బందులు బయలుదేరడంతప్ప, దేశానికి అఖండమైన లాభం ఏమీ కలిసిరాబోదు, అని బిల్లిమోరియా వివరించారు.

ఆయన ఈ సందర్భంలో మరోవిషయం కూడా ప్రభుత్వందృష్టికి తీసుకువచ్చారు. 1955-56 సంవత్సరంలో ఫిలిం పరిశ్రమ వాడిన ముడి ఫిలింకన్న గత సంవత్సరం వాడకం నూరింట పదిపాళ్లు తగ్గింది. పోతే, ఇప్పుడు చెల్లుబడిఅవుతున్న ముడి ఫిలింలో భారత ప్రభుత్వ సమాచారశాఖవారు వార్తా చిత్రాలకూ డాక్యుమెంటరీలకూ వాడుతున్న ఫిలిం చాలా ఉంటోంది. గత నాలుగేళ్లలోను ఫిలింస్ డివిజన్‌వారి వాడకం మూడు నాలుగింతలు పెరిగింది. పరిశ్రమలోవారు వాడేది పెరగనే లేదు. ఈపరిస్థితిలో కోటాల పద్ధతి ప్రవేశపెడితే, లేనిపోని ఇబ్బందులు వస్తాయని, బిల్లిమోరియా చెప్పారు.

ప్రభుత్వం ఈ విషయంలో తగిన కట్టుదిట్టాలు చేస్తున్నట్టు తెలిసిందని కూడా ఆయన తెలియచేశారు.



అశోక్ పిక్చర్స్ వారి "రాగిణి" చిత్రంలో కిశోర్, జబీన్



ప్రధాని నెహ్రూ యూరప్ పర్యటనను, లండన్‌లో ఆయన పాల్గొనే కామన్‌వెల్త్ ప్రధానుల సమావేశాన్ని డాక్యుమెంటరీ చిత్రంగా తీయడానికి భారత ప్రభుత్వ ఫిలింస్ డివిజన్ పంపిన బృందంలో, ఫిలింస్ డివిజన్ మద్రాసు మండలం ఛాయాగ్రాహకుడు శ్రీ ఎస్. ఎ. రావుకూడా ఉన్నారు. ప్రధాని వెంట పశ్చిమదేశాల పర్యటనకు దక్షిణ భారతంనుండి వెళ్ళిన మొదటి కెమెరామన్ ఈయనే. ఈయన ఇతఃపూర్వం సయాం, బర్మా, మలయా, ఇండొనీషియా, సింహళ దేశాలు పర్యటించారు. ఛాయాగ్రహణంలో 20 ఏళ్లి అనుభవం గడించారు. లోగడ బెంగళూరులో, ఆసియా దూర ప్రాచ్యదేశాల ఆర్థిక సంఘ సమావేశం జరిగినపుడు ఈయన దాన్ని డాక్యుమెంటరీగా తీశారు. ఐక్యరాజ్యసమితి విద్యా సంస్కృతిక సంఘం వారు ఆ చిత్రం ప్రతినొకటి తీసుకున్నారు. రావుగారు, ఇప్పుడు ప్రధాని వెంటవెళ్లిన బృందంలో ప్రధాన ఛాయాగ్రాహకులు.



"అబ్ దిల్లీ దూర్ నహీఁ" చిత్రంలో మాస్టర్ రోమా

నిగ్రహపరిపాలకసంఘం తోడ్పడగలదని న్నారు.

పన్నులభారం విషయం ప్రస్తావిస్తూ లన చిత్రాలపై వినోదం పన్ను విధించడం తగదన్నారు.

"వినోదం పై పన్ను విధించడం అంటే జ్ఞానం మీద, సంస్కృతిమీద పన్ను వేయడమే అవుతుంది. దీన్ని నివారించడానికి ప్రయత్నాలుజరగడం వాంఛనీయం" అని ఆయన అన్నారు.

* * *

ముడిఫిలిం దిగుమతిలో కోటా లైసెన్సు ప్రద్ధతి ప్రవేశపెట్టాలని ప్రభుత్వం చేసిన ర్ణయంగురించి ఇక్కడి నిర్మాతలంతా లోవిధంగా అభిప్రాయాలు వెలిబుచ్చుతున్నారు. ఈపద్ధతివల్ల పరిశ్రమలో కొత్త నిలదొక్కుకుని పలుకుబడి గడించిన పెద్ద నిర్మాతలకే, కావలసిన ఫిలిం దొరుకుతుంది.

కాగా ప్రేక్షకులకు సంబంధించినంతవరకూ మరో చెప్పుకోతగ్గ విషయం చిత్రాల విడివి తగ్గడం. కోటాపద్ధతివల్ల క్రమంగా నిడివితగ్గే మార్గాలుఏర్పడతాయి. ముఖ్యంగా దక్షిణ భారతచిత్ర నిర్మాతలు చాలా సర్దుబాటుచేసుకోవలసి ఉంటుంది. అనవసరమైన పాటలు, నృత్యాలూ తగ్గిపోతాయని ఆశించవచ్చు.

* * *

జూన్ 6 న సునిల్ దత్ పుట్టినరోజు పండుగ జరుపుకున్నాడు. ఈ పండుక్కి పిండి వంటలు వండించి, విందు చేసినచోటు కల్పనా దేవానంద్‌ల ఇల్లు.

* * *

నాలుగో తేదీన నూతన్ పుట్టినరోజు (21 వ తేది) చేసుకున్నప్పుడు ఆమె తల్లి శోభనా సమర్థ్ మంచి పార్కర్ పెన్ బహూకరించింది. దాంతోపాటు కుమార్తె విశ్రాంతి తీసుకోడానికని బొంబాయి దగ్గరగా ఉన్న కొండప్రాంతంలో 'లోనావాలా' దగ్గర ఒక చక్కని కుటీరాన్ని కూడా కొని కానుకగా ఇచ్చింది. క్రితంసారి పుట్టినరోజు పండుగనాడు ఆమె కుమార్తెకు మంచి కారు బహూకరించడం నూతన్ అభిమానులకు విదితమే.

జూన్ నాలుగున, నటుడు షమ్మీ కపూర్ ప్రమాదవశాత్తు గుర్రంమీదనుండి పడిపోయాడు.


ఫిలింస్థాన్‌వారి 45 వ చిత్రం షూట్ ఫ్లోర్ షూటింగ్‌లో గుర్రపు స్వారీచేస్తూ ఉండగా, గుర్రంకాలు తొట్రుపడి, అది ఒక కాలువలో పడిపోయింది. షమ్మీ తూలి కొంచెం అవతలగా పడినందువల్ల, పెద్దదెబ్బ లేమీ తగలేదు. వెంటనే ఆస్పత్రికి వెళ్ళి కట్టు కట్టించుకున్నాడు. ఇపుడు బాగా కోలుకొన్నాడు. ప్రమాదంజరిగిన సమయానికి, అతని భార్య గీతాబాలి ఉదకమండలంలో ఉంది. వార్త తెలియగానే, ఆమె బొంబాయి వచ్చేసింది.

పి. ఎస్. ఫిలింస్ వారి 'సమందర్'

ప్రేమనాథ్ ఫిలింస్‌వారి "సమందర్" చిత్రం గతవారం విడుదలఅయింది. ప్రేమనాథ్ ఇందులో ఐదు భూమికలు నిర్వహించాడు. నిర్మాత, దర్శకుడు, రచయిత, నటుడు కూడా అతడే. నటుడు గా రెండు భూమికలు — కవలలు గా నిర్వహించాడు. ఒకడు బాగీ. మంచివాడు. అతన్ని బేలా (బీనారాయ్) ప్రేమించింది. రెండో వాడు భగవాన్. ఇతడు దుర్మార్గుడు. ఆ ఇద్దరికీ పడదు. భగవాన్ తన సోదరుడిని చంపించి, బేలాను పెళ్లాడ



నంది ప్రొడక్షన్ వారి శ్రీ కృష్ణ గారడిలో నూతనతార 'ప్రియదర్శిని'





శ్రీ గోగినేని వెంకట సుబ్బయ్యనాయుడుగారు తమ మనుమరాళ్లు ఇద్దరికీ మే 24 రాత్రి వైభవంగా వివాహాలు జరిపించారు. పై చిత్రంలో వధువు చి. సౌ॥ ధనలక్ష్మి (సూరెడ్డి వీర రాఘవయ్యగారి కుమార్తె,) వరుడు చి॥ సూర్యచంద్రరావు రెండవ చిత్రంలో వధువు సౌ॥ పద్మావతి (గోగినేని పెద వెంకటేశ్వరరావుగారి కుమార్తె), వరుడు చి॥ కోటేశ్వరరావు.

బొంబాయి సినిమాలేఖ

ప్రయత్నిస్తాడు.

ఇందులో మంచి సెట్‌లు, బోలెడన్ని యుద్ధాలూ ఉన్నాయి. కథను బాగా చిత్రించడానికి తగినట్టుగా రచనలేదు. దర్శకత్వం అంతకన్నా లేదు. నటన కూడా వాటికి తోడు అయింది.

ఇందులో హీరాలాల్, ఉల్హాస్, నిక్షీ కూడా పాల్గొన్నారు.

ఆద్యంతం విసుగెత్తించే ఈ చిత్రంలో ఆహ్లాదకరమైనది మదనమోహన్ వినిపించిన సంగీతం ఒకటే.

(ఆంధ్ర వారపత్రిక బొంబాయి విలేఖరి)

★

శ్రీ ధనసాయివారి

'బలేబావ'

ఎంత పల్లెటూరి మొద్దు అయినాఇప్పుడు ఫాషన్‌ల గుట్టూ మట్టూ తెలుసుకు నాజూగ్గా తయారవడం అసాధ్యం కాదు అని ఉద్ఘాటించారు సి. ఎస్. ఆర్.

ఈ మహత్తర సత్యాన్ని నిరూపించి సలు గురికీ ఆ సంగతి చెప్పడానికి తీసిన చిత్రం ఒకటి మొన్న విడుదలఅయింది. పేరు 'బలే బావ.'

ఇది అందరినీ వంచించి డబ్బు గడించడం మరిగిన ఒక టోకరాసురుడి కథ; లేదా ఆ టోకరాసురుడికి టోకరాయిచ్చి నెగ్గుకొచ్చిన బలేబావ (మరిది) కథ. అదికాదా, పొగరుతో తనను విడనాడిన పతిని, మంగమ్మ శపథంమార్కు మార్గంలో (పొగరు, దుర్గుణాలు చెడకుండా) మంచి చేసుకున్న మగువ కథ. సహృదయులంతా ఇలా పరిపరి విధాల చెప్పుకోవచ్చు దీన్ని గురించి. పై జాతి వారికి ఓపిక ఉండే పక్షంలో ఇందులో తప్పులన్నీ వీరి వాటిని (రేలంగి కథారంభంలో చేసిన సూచన మేరకు) ఒప్పులుగా భావించవచ్చు. లేని పక్షంలో బాగున్న అంశాల గురించిమాత్రం చెప్పుకోవచ్చు.

అవి: 1. మొట్టమొదట చెప్పుకోతగ్గది తలాతోకా లేని ఈకథను దర్శకుడు రజనీకాంత్ తెరమీద చెప్పిన విధం. 2. ఆపైన రెండు మూడు పాటలూ (దక్షిణామూర్తి) ఒకరిద్దరి నటనా బాగున్నాయి. ఒకరు గుమ్మడి వెంకటేశ్వరరావు; మరిద్దరు రేలంగి, జగ్గయ్య.

జగయ్యకు ఇందులో ఒకచోట కర్కు ("20 తౌజండ్ లీగ్స్") డగ్లస్ మార్కు బనీను తొడిగి, రూడాల్ఫ వాలంటినో పోజులో నిలబెట్టి ఫోటోతీశారు ఈ హీరో పాత్ర కేవలం కల్పితం. ఎవరికీ దీనికీ పోలికలు లేవు. కాబట్టి ఏ వేషం వేసినా ఫర్వాలేదు. అందుకని వేసిన ఈ వేషం చూట్టానికి బాగానే ఉంది.

ఈ చిత్రం మొత్తంమీద చాలా బాగున్నది సి. నాగేశ్వరరావు ఛాయాగ్రహణం.

కథ: శేఖర్ (లేక హీరో) తనభార్య పల్లెటూరిమొద్దు అని ఆమెను వదిలేశాడు. అందుకని ఆ పిల్లా కష్టాలూ కలిసి కాపురం ఉండడం జరుగుతుంది. ఉద్యోగం, డబ్బు లేని శేఖర్ పట్నంలో ఓ పెద్ద మేడ సెట్టువేయించుకుని, గిరిజతో డ్యూయట్‌లు పాడడానికని విశాలమైన డాబా, డాన్సులకో సంపెంగతోట, చెక్క వంతెనా, స్టుడియో సెట్టు యేరు, నిజమైనదనిపించే చందమామ, ఓ బామా (ఈమె మంచిదా చెడ్డదా అన్నది



శర్వాణీ వారి "అక్కాచెల్లెళ్లు" చిత్రంలో లక్ష్మీకాంత, రమణారెడ్డి

"సహృదయులే" తేల్చుకోవాలి) అందు బాటులో ఉంచుకుని పాటలు పాడుతూ, వాళ్ళకీ వీళ్ళకీ టోకరాలు తినిపిస్తూ, తింటూ ఉంటాడు. పెళ్లాన్ని కాపరానికి తీసుకు రావడానికి అతడి అభ్యంతరం: 'అది పల్లెటూరి మొద్దు.'

"అయితే నేం, నీ చిత్తంవచ్చినట్టు తీర్చి దిద్దుకోవచ్చుగా" అంటాడు అతని శ్రేయోభిలాషి. అలా అని బోలెడు డబ్బూ, బోలెడు ఫిలిమూ ఖర్చు పెట్టించి ఆ సత్యాన్ని నిరూపించ ప్రయత్నిస్తాడు.

అతని ప్రయత్నాలు ఫలిస్తాయా? పల్లెటూరి పిల్లకి షోగ్గా డ్రెస్ బనాయించడం చేతవుతుందా? ఈ మహత్తర సత్యం ఋజువవుతుందా? శేఖరు దాన్ని నమ్ముతాడా? అవన్నీ ఎలా వున్నా, మానినా ఈ చిత్రం చివరికంటా చూస్తే నీతి లాంటిది ఒకటి తెలుస్తుంది.

"పెళ్లాన్ని వదిలేసి, ఎంతమందికి టోకరిచ్చినా, ఎన్ని దురభిప్రాయాలను పరమ సత్యాలుగా నమ్మి, అమ్మినా మరేం ఫర్వాదు. చివర్ని 'పెళ్లాన్ని ఏలుకుంటా'నంటే లు. అదే పదివేలు అని అందరూ ఆనందారుసుమీ" అని బలేబావ చిత్ర కథ సా ఇస్తుంది.

ఈ కథలో, మనుషులకన్న ఫాషన్ లే ధానమని నమ్మిన శేఖర్ 17 వేల అడుగులు తిరిగినా ఆ అభిప్రాయం మార్చుకోడు. తనపెళ్ళాం బస్తీదుస్తులు వేసుకోడం నేర్చుకుంది కాబట్టే ఆమెను స్వీకరించాడు. అతనిదే గెలుపు. ఆ మర్నాడే ఇంకో అతిలోకసుందరిని, ఇంకో కొత్తఫేషన్‌నుచూచి మతి పోగొట్టుకుని మళ్లీ ఓ సినిమా కథంత గ్రంథం జరపడన్న గారంటీ లవలేశం లేదు.

అంతగా అతనలా చేస్తే ఈ చిత్ర నిర్మాతలు ఇంకో సినిమా తియ్యొచ్చు. ★

శీతజ్వరం

[3వ పేజీ తరువాయి]

వారు, ధారాళంగా గాలివచ్చే గృహాల్లో ఉండేవారు, ఈ అంటువ్యాధికి సాధారణంగా గురికారు. కానీ, వ్యక్తి పరిశుభ్రత లేనివారినీ, సమగ్ర ఆహారం తినక బక్కగా ఉండే నీరసులనీ, గాలీ వెల్తురూ సరిగ్గా రాని పిచిక గూళ్లలాంటి కొంపల్లో ఉండే వారినీ ఈ అంటువ్యాధి ఆప్యాయంతో పలకరించి కూడాఉండటానికి ముచ్చటపడుతుంది. క్రిక్కిరిసిపోయిన ఇళ్ళల్లో ఉండకూడదు. విపరీతమయిన ఎండలో నయినా, చలిలోనయినా, తిరగకూడదు. నీరసం రానీయకూడదు.

టీకాలు అంతఆదుకోటంలేదు

సరిఅయినవాక్సిన్‌తో టీకాలు వేయించుకుంటే కొంతవరకూమంచిదే. ఇంతకుముందే చెప్పినట్లు శీతజ్వరానికి కారణమైన వైరస్‌లో చాలా తెగలున్నాయి. ఒక తెగవల్ల వచ్చిన జ్వరానికి, మరొక రకం వాక్సిన్‌తో టీకా వేస్తే పనిచెయ్యక పోవచ్చు. వ్యాధిలేనిప్రాంతాలనుంచి వ్యాధి ఉన్న చోట్లకి ప్రయాణంచేసేవారికి ఈ వాక్సిన్‌లు ఉపయోగకరంగా ఉండచ్చు.

టీకాలువేసిన వారం రోజులకిగానీ దాని ప్రభావం కనబడదు. వ్యాధి నిరోధకశక్తి కొన్ని నెలలపాటు మాత్రమే ఉంటుంది.

రోగి కోలుకున్న తరువాతకూడా, అతడు వాడే దుస్తుల్ని డెట్టాల్, ఫినైల్ లాటి క్రిమిహారణౌషధాలలో రెండుగంటలసేపు నానేసి మరీ ఉతకాలి. పాత్రలు గిన్నెలు వగైరా కూడా వేడినీళ్లల్లో నానేయాలి. ఇంటిలోని కుర్చీలూ, బల్లలూ, మంచాలూ ఎండలో, ఆరుబయట కొన్ని గంటలు వుంచాలి. రోగి వున్న గదీ, గోడల క్రిందభాగాలూ క్రిమిహారౌషధాలతో శుభ్రంగా కడగాలి. గది తలుపులూ కిటికీలూ రోజంతా తెరచి ఉంచి, బాగా గాలి వచ్చేట్టుచూసి గదంతా ఎండనివ్వాలి.

జన సమ్మర్దం ఉండే చోట్లలోకి వెళ్లకండి

ఇక స్థూలంగా చూస్తే ప్రజారోగ్య దృష్ట్యా, రోగులు, ఇతర జనంతో కలవకుండా చూడాలి. వ్యాధివున్న ప్రాంతాల నుంచి వ్యాధిలేని ప్రాంతాలకు రాకపోకలు సాధ్యమైనంతవరకూ తగ్గించాలి. సినిమాలూ, నాటకశాలలూ, సమావేశాలూ, సంతలూ మొదలైన జనసమ్మర్దంగా ఉండే చోట్లకి వెళ్లకూడదు. అసలు సినిమాలు, నాటకశాలలూ, ఈతకొలనులూ, పాఠశాలలూ, కళాశాలలూ, కార్యాలయాలూ సాధ్యమైనంతవరకూ మూసివేస్తేనే చాలామంచిది. ఎన్నిప్రయత్నాలుచేసినా ఇలాటి చోట్లలో సమ్మర్దం, రద్దీ లేకుండా చేయడం కష్టం. ఇవికాక బస్సులు, రైళ్లూ మొదలైనవాటిల్లో జనం క్రిక్కిరిసి ఉండకుండా చూసుకోవాలి. ఎందుకంటే ఈ అంటువ్యాధి వ్యాపించడానికి అట్టేకాలం తీసుకోదు. జ్వరం తగిలినవాడిదగ్గర కాస్సేపుంటేచాలు, ఈ వ్యాధి రెండోవాడిని కూడా వరిస్తుంది.

ఈవిధానాలు చాలాకఠినంగా ఉండచ్చు కానీ, ప్రజారోగ్యానికి భంగం కలగకుండా వ్యాధివ్యాప్తి ప్రతిమించకుండా మనం ముఖ్యంగా దృష్టిలో ఉంచుకోవాలి. వ్యాధిలేని ప్రాంతాల్లో ఇప్పటి నుంచే ముందు జాగ్రత్తలో ఉండడం చాలా శ్రేయస్కరం. ★

గృహ వైద్యం

(38-వ పేజీ తరువాయి)

తెచ్చిపెట్టుకుని రాత్రి పుల్లమజ్జిగలో నానేసి మర్నాడుపుదయం బాగా నూరుకొని బిడ్డవంటికిపట్టించి, ఓ అరగంటవుంచి, తలస్నానం చేయించాలి. ఇది రాసినప్పుడు బిడ్డలు చేతులు నోటపెట్టకుండా చూచుకోవాలి. నీరుడుగింజలు బిడ్డలకు అందకుండా దాచిపెట్టుకోవాలి. అలా 3 నాలుగు రోజులు రాసేసరికి నయం కనపడవచ్చు. అలా ఆముదంరాసి స్నానం చేయించిన వెంటనే తుడిచేసి చాయపసుపు అద్దెయ్యాలి.

ఇది చిడుము గజ్జికికూడా పనికొస్తుంది. ఇంక కొంచెం ఓర్చుకోగల పెద్దవారైతే పట్టెడు మూర్తుండ ఆకుతీసుకుని కొస్తపసుపు పొడి కలిపి నూరి రాసుకుంటే కొద్దిగా మండినా, మూడుపూటల్లో మాడిపోతుంది.

గజ్జికురుపులు:—ఇవిపెట్టేబాధ ఇంతా అంతా కాదు. పిల్లలైనా పెద్దలైనా ఇది భరించడం చాలాకష్టం. చీముతోకూడి చితకనిగజ్జి పొక్కులకు సున్నం ఆముదం కలిపిపెడుతే తక్షణం చితికి సలుపు తగ్గుతాయి. వెలిమిడి కచిక (అనగా పిడకకాల్చిన కచిక) ఆముదంలోకలిపి రాయచ్చు. దీనికికూడా తగ్గుతాయి. మైలుతుత్తం తెచ్చి, మంచి గంధం అరగతీసి రెండూకలిపి కొద్దినూనెవేసిరాస్తే గజ్జి మాడిపోతుంది. కాని కొస్త మంటపెడుతుంది. హారతికర్పూరం మంచిగంధం కలిపి వేసినా చల్లగావుంటుంది. పాలసుగంధి, తుంగముస్తల అనగా గరికిగడ్డి అడుగుభాగాన్ని చిన్నకాయలాంటివి వుంటాయి. ఆరెండూ నూరి కొబ్బరినూనెలో కలపి రాయచ్చు. అలారాశినా నయంకనపిస్తుంది.

రక్తంగడ్డలు వీటినే శగ్గడ్డలు అంటారు. ఇవి సాధారణంగా వేసవికాలంలో వస్తాయి. ఈ గడ్డ ఎదిగేవరకు పిండి కట్టు కట్టి ఎదిగేక, రణపాలాకు అని ఉంటుంది (దళసరిగా చుట్టూ వంకులాంకులా వుంటుంది) అదితెచ్చి వెచ్చచేసి కడితే తగ్గుతుంది.

ఈ ఆకులందరకు దొరకదు. సీమగొబ్బిగింజలు తెచ్చి మజ్జిగలో నానవేసి నూరికట్టినా కురుపు చితికిపోతుంది. తెలకపిండి కూడా నానేశి కట్టచ్చు. చితికిన తర్వాత చీము పోయే వరకు తిరిగి పిండికట్టే కట్టాలి. ★

సవరణ

12-6-57 తేదీ సంచికలో "కాల్టెక్స్ పెట్రోలు కర్మాగారం" అనే వ్యాసంలో "ఈకంపెనీకి భారతదేశంలో వరకే రెండు నూనె శుద్ధి కర్మాగలున్నాయి" అని పొరబాటు పడి. కాల్టెక్స్ కంపెనీకి భారతదేశంలో నూనె శుద్ధి కర్మాగారం ఉన్నదనీ, ఇప్పుడు విశాఖపట్టణం వద్ద నిరణంలో ఉందనీ గ్రహింప ప్రార్థన.

తలుపు పిలుపులు

(41-వ పేజీ తరువాయి)

ఈశ్వ: నేను నెచ్చెలిని కాను, పశుపతినే (ప్రమథ గణాయులకుపతి)

పా: నీకు కొమ్ములు లేవే (పశుపతి-పశువులకు పతి: ఆబోతు)

ఈ: సుందరీ! నేను స్థాణువును (అచంచలుడు)

పా: చెట్టు మాట్లాడదే (స్థాణువు-చెట్టు ఇదీ కదలదు)

ఈ: (విసుగెత్తిపోయి) నేను శివాభర్తనే (శివా-పార్వతి)

పా: అయితే అడవికి పో (శివా-ఆడునక్క)

సరే అంతటితో ఆయన నోరు మూతపడ్డది-సర్వజ్ఞుడు గూడా సరస సంభాషణలో ఓడిపోయినాడు. తలుపు పిలుపుల్లో అనేక తలపులు సంభవిస్తవి: ★

నిజమాడితే నిష్ఠూరం

(27-వ పేజీ తరువాయి)

పరుసులంకించుకున్నాడు.

హెడ్ క్లార్కు తలమీద గోడగడియారం పన్నెండుకి పదినిముషాలు తక్కువ చూపుతోంది. రొప్పుతూ రోజుతూ అటెండెన్సు రిజిస్టర్‌లో సంతకంపెట్టపొయ్యాడు.


హెడ్ క్లార్కు ముఖం జేవురించి ఉంది దృష్టి నిశితంగా ఉంది. ఒక్కసారి హెడ్ క్లార్కు ముఖంచూశాడు. లాభం లేదనుకున్నాడు. ఏం చెప్పినా ఎవ్వరూ నమ్మరు.

"ఆలస్యమైందండీ కారణం ఏమీ లేదు. నాతప్పే. రేపటినుంచి తప్పకుండా టైముకు వస్తాను" ప్రాధేయపూర్వకంగా చెప్పాడు మూర్తి.

"అలా ధోవకురా. ఇంకో బడిపిల్లాడి మల్లే రోజుకో సాకు కల్పించటంవల్ల ఏమీ లాభం లేదు. రేపట్నుంచైనా సరీగ్గా" అన్నాడు హెడ్ క్లార్కు.

ప్రపంచానుభవంలో ప్రథమ సోపానమెక్కాడు మూర్తి.

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad.



బాతు జంట హాయి

ఫొటో : ఎస్. హరిహరన్ — మద్రాసు.

